www.andhrajyothy.com

ANDHRAJYOTHI

మంగళవారం | 10-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 235 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: దశమి తె. 3.43 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఉత్తరాభాద్ర మ. 1.30 తదుపరి రేవతి; వర్జ్యం: రా. 12.39-2.08; దుర్ముహూర్తం: ఉ. 8.50-9.34, రా. 9.54-10.44; అమృతఘడియలు: ఉ. 8.59-10.29; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.38; సూర్యాస్తమయం: 5.37 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఎల్ఐసీ 'బీమా సఖి' యోజన!

మహిళల కోసం కొత్త పథకం

ప్రారంభించిన ప్రధాని మోదీ.. 2 లక్షల మంది నియామకం

మహిళా ఏజెంట్లకు స్టైపెండ్ కూడా.. తొలి మూడేళ్లు చెల్లింపు

పదో తరగతి ఉత్తీర్ణత, 18 నుంచి 70 ఏళ్ల వయసు అర్హత

ఆర్థిక వ్యవహారాలపై చైతన్యం.. బీమాపై అవగాహనే లక్ష్యం

జీవిత బీమా సంస్థ వెబ్‌సైట్‌లో దరఖాస్తుల స్వీకరణ మొదలు!

2



కేబినెట్‌లోకి నాగబాబు!

రాజ్యసభ సీటుకు బదులుగా మంత్రి పదవి

కూటమి పార్టీల నడుమ అంగీకారం.. సీఎం చంద్రబాబు ప్రకటన

ఖాళీ అయిన 3 ఎంపీ స్థానాల్లో ఒకటి తన అన్నకివ్వాలన్న పవన్

కృష్ణయ్య, బీదాకు ముందే హామీ ఇచ్చామన్న బీజేపీ, టీడీపీ

మంత్రివర్గంలోకి నాగబాబును తీసుకోవాలని నిర్ణయం

ఎమ్మెల్సీని చేసి ఇస్తారా.. ముందే ఇస్తారా?

13


బీదా మస్తాన్‌రావు


సానా సతీశ్


ఆర్.కృష్ణయ్య

పెద్దల సభకు ఆ ముగ్గురే

రాజ్యసభకు టీడీపీ నుంచి బీదా, సానా

బీజేపీ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్య

పార్టీ సభ్యత్వం.. వెంటనే పెద్దల సభకు

నేడు సభ్యుల నామినేషన్లు.. ఏకగ్రీవమే

13

పవన్‌కు బెదిరింపు కాల్

డిప్యూటీ సీఎం ఓఎస్డీకి ఫోన్ చేసిన ఆగంతకుడు

నిందితుడు తిరువూరు వాసిగా గుర్తింపు

కొద్దిరోజుల క్రితం హోంమంత్రికీ బెదిరింపులు

14

ఆంధ్రా టు ఆఫ్రికా

ఇక్కడ ఉచితం.. అక్కడ కిలో రూ.150

రేషన్ బియ్యం అక్రమ రవాణా అంతా వ్యవస్థీకృతంగా సాగింది. ఎండీయూ ఆపరేటర్లు రేషన్ కార్డు దారుల నుంచి కిలో రూ.12 నుంచి 15కు కొనుగోలు చేశారు. అదే బియ్యాన్ని ఐదారు రూపాయల లాభానికి మండల, జిల్లా స్థాయి కొనుగోలుదారులకు విక్రయించారు. ఆ తర్వాత... ఎగుమతిదారులు రంగంలోకి దిగుతారు. కిలో బియ్యం రూ.26కు కొని... మిల్లుల్లో పాలిష్ చేసి రూ.45నుంచి 50కి ఆఫ్రికాకు తరలిస్తారు. ఇలా చేతులు మారుతూ వెళ్లిన 'ఉచిత బియ్యం' ఆఫ్రికాకు చేరేసరికి రూ.120 నుంచి 150 అవుతుంది.

> బియ్యం అక్రమ రవాణాకు ప్రభుత్వ లోగో ముద్రించిన ఎండీయూలనే (రేషన్ వాహనాలు) వినియోగించారు. మిల్లర్లు పాలిష్ పట్టి పంపిణీ చేసే బియ్యానికి ఉప్పుడు బియ్యం అనో, నూకలనో ఓ ముద్ర వేసి పోర్టు వరకూ చేర్చేవారు.

సరుకు సరైనదేనని, న్యాయబద్ధమైన రవాణానే జరుగుతోందని కస్టమ్స్ హౌస్ ఏజెంట్లు (సీహెచ్ఏలు) నిర్ధారించాలి. ఆ తర్వాతే బియ్యం నౌకలోకి చేర్చాలి. కొందరు బడా ఎగుమతిదారులు వారిని కూడా మేనేజ్ చేసి తమ దందాకు లంగరు ఎత్తేశారు. లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసే ఆపరేటర్ మొదలుకొని పోర్టులో ఉండే సీహెచ్ఏల వరకూ అందరినీ వాడుకున్నారు.

అక్రమ తరలింపులో **80** మంది కీలకం



లబ్ధిదారుల నుంచే అసలు దందా మొదలు

బండి దగ్గరే ఎండీయూ ఆపరేటర్ల కొనుగోలు

మండల, జిల్లా స్థాయి వ్యాపారులకు విక్రయం

అనధికార స్టాక్ పాయింట్లకు తరలింపు

ఆపై రాష్ట్రస్థాయి ఎగుమతిదారులు రంగంలోకి

పాలిష్ చేసి నూకలు, ఉప్పుడు బియ్యం ముద్ర

పోర్టుల్లో కస్టమ్స్ హౌస్ ఏజెంట్లకూ లంచాలు

కాకినాడ పోర్టే అక్రమాలకు ప్రధాన 'ద్వారం'

ప్రభుత్వానికి విజిలెన్స్ సవివరమైన నివేదిక

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఏపీలో ఆ బియ్యం ఉచితం! ఆఫ్రికాలో అవే బియ్యం కిలో రూ.150. 'ఈ బియ్యం మాకు వద్దు' అని అక్కడికక్కడే అమ్ముకొనే రేషన్‌కార్డు దారులతో మొదలుకుని... అంతర్జాతీయ ఎగుమతిదారుల దాకా అనేక చేతులు మారుతోంది! ప్రభుత్వం కిలోకు రూ.43 ఖర్చు పెట్టి పేదలకు సరఫరా చేస్తున్న బియ్యం... చివరికి అక్రమార్కులకు లాభాల పంట పండిస్తోంది. ఐదేళ్ల వైసీపీ హయాంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగిన తీరుపై

మిగతా 13వ పేజీలో...

జిల్లా స్థాయిలో రేషన్ బియ్యం కొనేవాళ్లలో కొందరు

1. కోనల ఆనందరెడ్డి 2. కర్రి రామిరెడ్డి 3. పసలపూడి గంగరాజు 4. పండల ప్రసాద్ 5. సుంకర రామకృష్ణ 6. మానేపల్లి కృష్ణారెడ్డి 7. ఉండమట్ల వీర వెంకట సత్యనారాయణ.

ఎగుమతిదారుల్లో కొందరు...

1. వినోద్ అగర్వాల్ 2. సరళ ఫుడ్స్ 3. వీరభద్ర ఎక్స్‌పోర్ట్సు 4. లవన్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోర్ట్సు...

విశాఖ పోర్టులో 483 టన్నుల బియ్యం స్వాధీనం

కాకినాడలో నిఘా పెరగడంతో విశాఖకు అక్రమార్కులు

2 నెలల్లో 70 వేల టన్నులు ఎగుమతి: మంత్రి నాదెండ్ల

పేర్ని నాని బియ్యం దందా

'ఆయన గోదాముల' నుంచి

ఎన్నికల ముందు 250 టన్నులు మాయం

13

కాకినాడ సీపోర్టులో చెక్‌పోస్టు ఏర్పాటు!

రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోకుండా చర్యలు



ఆర్‌బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా

3 ఏళ్ల కాలానికి నియామకం

రేపు బాధ్యతల స్వీకరణ

10



మంచు ఇంట్లో మంటలు

ఊహించని మలుపులు, నిమిషానికో పరిణామం

పోలీసులకు ఫిర్యాదు చేసిన మనోజ్

చిన్న కొడుకు నుంచి రక్షణ కల్పించాలని సీపీని అభ్యర్థించిన మోహన్‌బాబు

9

పెట్రోల్ పోసి తగలబెట్టాడు!

17 ఏళ్ల బాలికపై ఉన్మాది ఘాతుకం

అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి దారుణం

సజీవ దహనమైన యువతి

మంటల్లో గాయపడిన యువకుడు

నంద్యాల జిల్లా నందికొట్కూరులో ఘోరం


లహరి

14

మీరు మా దేశాన్ని కబ్జా చేస్తుంటే...
లాలీపాప్ తింటూ కూర్చుంటామా?

» బంగ్లాదేశ్ నాయకుల వ్యాఖ్యలపై మమత ఆగ్రహం



న్యూఢిల్లీ, డిసెంబరు 9: పశ్చిమ బెంగాల్, బిహార్, ఒడిశా రాష్ట్రాలపై తమకు హక్కులు ఉన్నాయంటూ బంగ్లాదేశ్ రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత భూభాగాలను ఆక్రమించుకోవడానికి బాహ్య శక్తులు ప్రయత్నిస్తుంటే భారతీయులు లాలీపాప్ తింటూ కూర్చుంటారని పొరుగు దేశం భావిస్తోందా అని ప్రశ్నించారు. సోమవారం రాష్ట్ర అసెంబ్లీలో ఆమె ప్రసంగించారు. కొందరు బంగ్లాదేశ్ నాయకులు చేస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యలకు స్పందించవద్దని, ప్రశాంతంగా, ఆరోగ్యంగా, మనశ్శాంతిగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఢాకా సభలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నాయకుడు రుహల్ కబీర్ రిజ్వీ మాట్లాడుతూ బెంగాల్, బిహార్, ఒడిశాపై బంగ్లాదేశ్‌కు చట్టబద్ధమైన హక్కులు ఉన్నాయని వ్యాఖ్యానించారు. పొరుగు దేశంలో జరుగుతున్న పరిణామాలపై చర్చించేటప్పుడు బాధ్యతగా ఉండాలని రాజకీయ ప్రత్యర్థులు, మీడియా సంస్థలతో సహా అన్ని పార్టీలను మమత హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లో పరిస్థితి విషమిస్తే అక్కడున్న మన బంధువులు, స్నేహితులపై ప్రభావం పడుతుంది కాబట్టి, సంయమనం పాటించాలని కోరారు. విదేశాంగ శాఖ మార్గదర్శకాలకు తమ ప్రభుత్వం, పార్టీ కట్టుబడి ఉంటాయని మమత స్పష్టం చేశారు.

హిందువులపై దాడులు ఆందోళనకరం

» బంగ్లాదేశ్‌కు భారత విదేశాంగ కార్యదర్శి స్పష్టం

ఢాకా, డిసెంబరు 9: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతుండడం పట్ల భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఆలయాలు, మత సంస్థలకు భద్రత కరవయిందని, వాటిపై దాడులు జరగడం విచారకరమని తెలిపింది. సోమవారం బంగ్లాదేశ్ పర్యటన నిమిత్తం వచ్చిన భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ తన చర్చల్లో ఈ విషయాన్ని నిర్మొహమాటంగా తెలిపారు. ఆగస్టు 5న ప్రధాని షేక్ హసీనాను పదవి నుంచి తొలగించిన తరువాత భారత ప్రభుత్వ ఉన్నతాధికారి పర్యటనకు రావడం ఇదే ప్రథమం. ఆయన బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి జసీం ఉద్దీన్, తాత్కాలిక ప్రభుత్వ విదేశీ వ్యవహారాల సలహాదారు మహమ్మద్ తౌహిద్ హుస్సేయిన్‌లతో చర్చలు జరిపారు. ఇస్కాన్ గురువు చిన్మయ్ దాస్‌ను అరెస్టు చేసిన తరువాత జరిగిన హింసను ప్రస్తావించారు. తాత్కాలిక ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ యూనస్‌తోనూ భేటీ అయ్యారు. అయితే, ప్రస్తుత బంగ్లాదేశ్ ప్రభుత్వ సలహాదారు యూనస్ మాట్లాడుతూ ఫాసిస్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా బంగ్లాదేశ్ ప్రజలు చేసిన విప్లవం భారత్‌కు నచ్చినట్టు లేదన్నారు. మైనార్టీలను వేధిస్తున్నారంటూ భారత్ మీడియా అతిశయోక్తులను ప్రచారం చేస్తోందన్నారు. తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు ఇతర దేశాలకు లేదని బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి జసీం ఉద్దీన్ స్పష్టం చేశారు.

ఎంతకాలం ఉచితాలు...ఉపాధి కల్పించలేరా?

» 81 కోట్ల మందికి రేషన్ పంపిణీయా: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 9: "ఎంతకాలం ఉచిత పథకాలు ఇస్తూ పోతారు... ఉపాధి కల్పించలేరా?" అని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కరోనా దగ్గర నుంచి వలస కార్మికులకు ఉచిత రేషన్ ఇస్తుండడాన్ని గుర్తు చేస్తూ వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి, నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాల్సి ఉందని తెలిపింది. జాతీయ ఆహార భద్రత చట్టం-2013 కింద 81 కోట్ల మందికి ఉచితంగాగానీ, రాయితీపైనగానీ రేషన్ పంపిణీ చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెప్పగా ఆశ్చర్యం వ్యక్తం చేసింది. "పన్ను చెల్లింపుదార్లనే విడిచిపెట్టారన్న మాట!" అని వ్యాఖ్యానించింది. కరోనా సమయంలో వలస కార్మికుల సమస్యలపై సుమోటోగా చేపట్టిన వ్యాజ్యంపై సోమవారం ధర్మాసనం విచారణ జరిపింది. ఓ స్వచ్ఛంద సంస్థ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ కరోనా సమయంలో 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న వలస కార్మికులకు కూడా ఉచితంగా రేషన్ ఇచ్చారని, దాన్ని కొనసాగించాలని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఎంతకాలం ఉచితాలు కొనసాగిస్తారు..ఉపాధి ఎందుకు కల్పించరని కేంద్రాన్ని ప్రశ్నించింది. విచారణను జనవరి 8కి వాయిదా వేసింది.

మతం ఆధారంగా రిజర్వేషన్లు తగదు: సుప్రీం

న్యూఢిల్లీ, డిసెంబరు 9: మతం ఆధారంగా రిజర్వేషన్ల కేటాయింపు కుదరదని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. పశ్చిమ బెంగాల్‌లో కొన్ని ముస్లిం సముదాయాలకు ఓబీసీ కులాల హోదాను ఇచ్చి.. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను కల్పించడాన్ని తప్పుబట్టిన కోల్‌కతా హైకోర్టు తీర్పును సమర్థిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ముస్లిముల్లోని 77 తరగతులకు పశ్చిమ బెంగాల్ రిజర్వేషన్ల చట్టం కింద, మరో 37 తరగతులకు పశ్చిమబెంగాల్ వెనుకబడిన తరగతుల చట్టం కింద 2010 నుంచి బెంగాల్ ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పిస్తోంది. దీనిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై మే 22న కోల్‌కతా హైకోర్టు తీర్పును ఇచ్చింది. ఆయా సముదాయాలను ఓబీసీలుగా గుర్తించడంలో వెనుకబాటుతనం కంటే మతమే ప్రధాన అంశంగా పని చేసినట్టు కనిపిస్తోందని తన తీర్పులో హైకోర్టు తెలిపింది. ముస్లిముల్లో వెనుకబడ్డాయంటూ కొన్ని తరగతులను ఎంపిక చేయడం మొత్తంగా ముస్లిం సమాజాన్ని అవమానించినట్టే అవుతుందని వ్యాఖ్యానించింది. ఈ తరగతులకు రిజర్వేషన్ల కేటాయింపును నిలుపుదల చేసింది. దీనిని సవాలు చేస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సహా పలు సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. బెంగాల్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. మతం ఆధారంగా కాక, వెనుకబాటుతనాన్ని పరిగణనలోకి తీసుకునే ఆయా సముదాయాలకు రిజర్వేషన్లు కేటాయించారని, కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని ఆయన కోరారు.

కఠ్‌ముల్లాలు దేశానికి హానికరమని జడ్జి వ్యాఖ్యలు

అలహాబాద్, డిసెంబరు 9: "దేశంలోని మెజారిటీ ప్రజల ఆకాంక్షల ప్రకారమే హిందుస్థాన్ నడుస్తుంది. ఇదే చట్టం. అంతేతప్ప.. "మాకు నలుగురిని పెళ్లి చేసుకునే హక్కుంది. హలాలా చేస్తాం. ట్రిపుల్ తలాఖ్ ఇస్తాం. అందుకు మా పర్సనల్ లా అంగీకరిస్తుంది" అనలేరు. ఆ హక్కులు ఇక్కడ పనిచేయవు" అని అలహాబాద్ హైకోర్టు జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వాట్సాప్ వంటి మెసెంజర్లలో, సామాజిక మాధ్యమాల్లో.. ముస్లింలను కించపరిచే విధంగా 'మూఢ ముస్లిం' అనే అర్థంలో వాడే 'కఠ్‌ముల్లా (మూఢ ముస్లిం)' అనే పదాన్ని కూడా ఆయన తన ప్రసంగంలో వాడారు. ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ)పై వీహెచ్‌పీ న్యాయవిభాగం ఆదివారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ పాల్గొని ప్రసంగించారు. యూసీసీ అంటే అదేదో వీహెచ్‌పీ, ఆరెస్సెస్‌లకు సంబంధించిన విషయం కాదని.. దేశ సర్వోన్నత న్యాయస్థానం కూడా దీని గురించి మాట్లాడిందని ఆయన పేర్కొన్నారు. "కానీ, ఈ కఠ్‌ముల్లాలు.. ఈ మాట అనడం సరైనది కాకపోవచ్చు.. కానీ, అనడానికి నేనేమీ సంకోచించను. ఎందుకంటే వారు దేశానికి ప్రమాదకరం. వ్యతిరేకం. వారిపట్ల మనమంతా జాగ్రత్తగా ఉండాలి" అని ఆయన వ్యాఖ్యానించారు.

13న హిడ్మా గ్రామానికి హోంమంత్రి అమిత్ షా?

కొత్తగూడెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ రాజధానిగా పిలిచే ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పూవర్తి గ్రామంలో ఈ నెల 13వ తేదీన కేంద్రం హోంమంత్రి అమిత్‌షా పర్యటించనున్నట్లు తెలుస్తోంది. ఆ రోజు అక్కడే బస చేసి గ్రామస్థులతో సమావేశమవనున్నట్లు సమాచారం. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మా స్వగ్రామమైన పూవర్తి... పూర్తిగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతం. కొన్ని నెలల క్రితం వరకు పూవర్తి పేరు వింటేనే పోలీసులకు వణుకు పుట్టేది. అలాంటిది అక్కడ కేంద్ర హోంశాఖ మంత్రి పర్యటించనుండడం చర్చనీయాంశంగా మారింది. 2026 మార్చి నాటికి ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు పార్టీని లేకుండా చేస్తామని ఇటీవల అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే.

ఢిల్లీలో 40 స్కూళ్లకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ, డిసెంబరు 9: ఢిల్లీలోని పాఠశాలలకు బాంబు బెదిరింపులు మరోసారి కలకలం రేపాయి. నగరంలోని సుమారు 40 పాఠశాలలకు సోమవారం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఈ మెయిల్స్ పంపిన వ్యక్తి 30వేల డాలర్లు(సుమారు రూ.25 లక్షలు) డిమాండ్ చేశాడని, దీంతో ఆయా స్కూళ్లలో తనిఖీలు నిర్వహించామని పోలీసులు వెల్లడించారు. అయితే అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదని పేర్కొన్నారు. మెయిల్స్ అన్నీ ఒకే ఈ-మెయిల్ నుంచి వచ్చినట్టు పోలీసులు గుర్తించారు.

దేశాన్ని అస్థిరపర్చే కుట్ర!

విదేశీ శక్తుల 'సాధనం'గా కాంగ్రెస్.. సోరోస్ నిధులిస్తున్న సంస్థతో సోనియాకు సంబంధాలు

» బీజేపీ అధ్యక్షుడు నడ్డా ఆరోపణలు

» తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ చీఫ్ ఖర్గే

» రాజ్యసభలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం



న్యూఢిల్లీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాల్లో అదానీ అంశంపై చర్చించాలని విపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో అధికార బీజేపీకి 'జార్జ్ సోరోస్' అస్త్రం దొరికింది. అమెరికన్-హంగేరియన్ వ్యాపారవేత్త జార్జ్ సోరోస్ ఫౌండేషన్ నిధులు సమకూరుస్తున్న సంస్థతో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి సంబంధాలు ఉన్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది. బీజేపీ ఆరోపణలపై సోమవారం రాజ్యసభలో గందరగోళం నెలకొంది. కేంద్ర మంత్రి జేపీ నడ్డా; రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఖర్గే మధ్య మాటల యుద్ధం నడిచింది. కాంగ్రెస్ పార్టీ విదేశీ శక్తుల చేతుల్లో 'సాధనం'గా వ్యవహరిస్తోందని నడ్డా ఆరోపించారు. సోరోస్‌తో కాంగ్రెస్‌కు సంబంధాలు ఉన్నాయని, భారత్‌ను అస్థిరపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై ఖర్గే తీవ్రంగా స్పందించారు. నడ్డా అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. సమస్యల నుంచి ప్రజల నుంచి దృష్టి మరల్చేందుకే బీజేపీ నిరాధార ఆరోపణలు చేస్తోందన్నారు. ఈ క్రమంలో నడ్డా, ఖర్గేలను తన చాంబర్‌కు రావాలని ధన్‌ఖడ్ ఆదేశించారు. విపక్ష పార్టీల ఎంపీలు తాము లేవనెత్తిన అంశాలపై చర్చించాలని పట్టుబట్టడంతో సభ వాయిదాల పర్వంలో నడిచింది. రెండోసారి వాయిదా అనంతరం సభ తిరిగి ప్రారంభమైన తర్వాత నడ్డా మాట్లాడుతూ.. ఫోరమ్ ఆఫ్ డెమోక్రటిక్ లీడర్స్ ఇన్ ఆసియా పసిఫిక్ ఫౌండేషన్‌కు సోరోస్ సంస్థ నిధులు సమకూరుస్తోందన్నారు. ఆ ఫౌండేషన్‌కు సోనియా సహ అధ్యక్షురాలిగా ఉన్నారని చెప్పారు. ఇది చాలా తీవ్రమైన అంశమన్నారు. 'ఇది భారతదేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తుంది. జాతీయ భద్రతపై ఆందోళనను పెంచుతోంది. దేశ భద్రతతో కాంగ్రెస్ ఆటలు ఆడుకుంటోంది. అందుకే ఈ అంశంపై చర్చించాలని కోరుకుంటున్నాం' అని పేర్కొన్నారు. దీంతో సోనియా, సోరోస్ సంస్థ సంబంధాలపై వెంటనే చర్చ చేపట్టాలని కోరుతూ బీజేపీ ఎంపీలు నినాదాలు చేశారు. బీజేపీ సభ్యుల డిమాండ్‌పై కాంగ్రెస్ ఎంపీలు ఖర్గే, జైరాం రమేశ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని లేవనెత్తేందుకు బీజేపీ ఎంపీలను ఎలా అనుమతించారని చైర్మన్‌ను అడిగారు. సభలో లేని వ్యక్తి గురించి మాట్లాడడం వారి ప్రతిష్ఠను దిగజార్చడమేనన్నారు. చైర్మన్ ధన్‌ఖడ్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు మాట్లాడుతూ.. సోనియా-సోరోస్ మధ్య సంబంధాలు దేశ భద్రతకు ఆందోళనకరమన్నారు. కాగా,సభలో చైర్మన్ ధన్‌ఖడ్, కాంగ్రెస్ ఎంపీ జైరాంరమేశ్ మధ్య వాగ్వాదం జరిగింది. చైర్మన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని రమేశ్ ఆరోపించారు. గందరగోళ పరిస్థితులతో చైర్మన్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

ధన్‌ఖడ్‌పై అవిశ్వాసం?

రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కాంగ్రెస్ సిద్ధమైనట్లు తెలిసింది. సదరు నోటీసుపై విపక్ష 'ఇండీ' కూటమి ఎంపీలు సంతకాలు కూడా చేసినట్లు సమాచారం. ధన్‌ఖడ్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని గత ఆగస్టులోనే అవిశ్వాసం పెట్టాలనుకున్నారు. అయితే మరో అవకాశం ఇవ్వాలని ఆగారు. ఇప్పుడు అవిశ్వాసం పెట్టక తప్పడం లేదని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. అవిశ్వాసానికి టీఎంసీ, ఆప్, ఎస్పీ, సీపీఎం, సీపీఐ సహా పలు పార్టీలకు చెందిన 70 మంది మద్దతు తెలిపినట్లు తెలిసింది.

లోక్‌సభలోనూ గందరగోళం..

లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదానీ వ్యవహారంపై జేపీసీతో విచారణ జరపాలని, మణిపూర్ అంశం, శంభులో రైతులపై రబ్బర్ బుల్లెట్లతో దాడి వంటి అంశాలపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. విపక్ష సభ్యుల నినాదాలతో సభ కొద్దిసేపటికే వాయిదా పడింది. మళ్లీ సభ ప్రారంభం కాగానే విపక్షాలు నినాదాలతో హోరెత్తించాయి. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. మళ్లీ అదే పరిస్థితి ఉండడంతో 3 గంటలకు వాయిదా వేశారు. ఒకవైపు ప్రతిపక్షాల ఆందోళన జరుగుతుండగానే, మరోవైపు బీజేపీ ఎంపీలు సోనియా-సోరోస్ అంశంపై చర్చించాలని పట్టుబట్టారు. దీంతో స్పీకర్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

రాహుల్ గాంధీకి అదానీ, మోదీ ఇంటర్వ్యూ!


అదానీపై పార్లమెంటులో చర్చ కోసం కాంగ్రెస్ వినూత్న నిరసన ప్రదర్శన

అదానీపై అమెరికా చేసిన అవినీతి ఆరోపణలపై పార్లమెంటులో చర్చ కోసం పట్టుబడుతున్న కాంగ్రెస్ పార్టీ సోమవారం వినూత్న రీతిలో నిరసన తెలిపింది. అదానీ, మోదీ మాస్కులు ధరించి పార్లమెంటుకు వచ్చిన కాంగ్రెస్ ఎంపీలు మాణిక్యం ఠాగూర్, సప్తగిరి శంకర్‌ను విపక్ష నేత రాహుల్‌గాంధీ ఇంటర్వ్యూ చేశారు. 'మీ ఇద్దరి మధ్య ఉన్న సంబంధం ఏంటి' అని వారిని ప్రశ్నించారు. దానికి.. 'ఏదైనా మేమిద్దరం కలిసే చేస్తాం. ఎన్నో ఏళ్ల బంధం మాది' అని బదులిచ్చారు. అదానీ మాస్కు వేసుకున్న ఠాగూర్.. 'నేనేది చెప్తే ఆయన అదే చేస్తారు. ఎయిర్‌పోర్టు అయినా పోర్టు అయినా.. ఏది అడిగితే అది ఇస్తారు' అని మోదీ మాస్కు వేసుకున్న శంకర్‌ను ఉద్దేశించి అన్నారు. అయితే, తర్వాత ఏం అడగబోతున్నారని రాహుల్ ప్రశ్నించగా.. 'ఈ సాయంత్రమే మాకు మీటింగ్ ఉంది' అని ఠాగూర్ అన్నారు.

'ఒకే దేశం-ఒకే ఎన్నిక' బిల్లుపై జేపీసీ?

పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి ఎలక్షన్లు నిర్వహించే 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' విధానంపై ముందుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన బిల్లును ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఏకాభిప్రాయ సాధన ద్వారానే ఈ బిల్లును ఆమోదింపజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు విస్తృతంగా చర్చలు జరిపేందుకు వీలుగా సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని కూడా నియమించే అవకాశం ఉంది.

లోకం తీరు



మహిళల కోసం
ఎల్ఐసీ 'బీమా సఖి'

» కొత్త పథకాన్ని ప్రారంభించిన మోదీ

» మూడేళ్లలో 2 లక్షల మంది నియామకం

న్యూఢిల్లీ, డిసెంబరు 9: మహిళలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 70 ఏళ్ల వయసు గల మహిళలను ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ అయిన ఎల్ఐసీ ఏజెంట్లుగా నియమించనుంది. ఈ మేరకు మహిళల సాధికారత కోసం కొత్త పథకాన్ని ప్రారంభించింది. 2 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చే 'బీమా సఖి యోజన'ను ప్రధాని మోదీ సోమవారం హరియాణాలోని పానిపట్‌లో ప్రారంభించారు. మహిళలకు ఎదురయ్యే అన్ని ఇబ్బందులను తొలగించి, వారు సాధికారులయ్యేలా చేస్తున్నామని ప్రధాని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అన్ని రంగాల్లో మన ఆడబిడ్డలు ముందుకెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బీమా సఖి యోజనలో చేరేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. సోమవారం నుంచే ఎల్ఐసీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫామ్‌లు అందుబాటులో ఉంటాయి. ఈ పథకం తొలి దశలో భాగంగా 35 వేల మందిని బీమా సఖులుగా నియమించనున్నారు. అనంతరం దశలవారీగా దేశవ్యాప్తంగా నియామకాలు చేపట్టనున్నారు. ఎంపికైన మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఆర్థిక వ్యవహారాలపై చైతన్యం, బీమాపై అవగాహన కల్పించే ఈ మహిళా ఏజెంట్లకు మూడేళ్ల పాటు స్టైపెండ్ కూడా అందజేయనున్నారు. వీరికి తొలి ఏడాదిలో నెలకు రూ.7 వేల చొప్పున, రెండో ఏడాది నెలకు రూ.6 వేలు, మూడో ఏడాది నెలకు రూ.5 వేల చొప్పున స్టైపెండ్ ఇస్తారు. ఈ పథకం కింద మూడేళ్లలో 2 లక్షల మంది మహిళలను బీమా సఖులను నియమించనున్నారు. శిక్షణ అనంతరం ఎల్ఐసీ ఏజెంట్లుగా పనిచేసే వీరికి స్టైపెండ్‌తో పాటు కమీషన్ కూడా అందజేస్తారు. పట్టభద్రులైన బీమా సఖులను ఎల్ఐసీలో డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా నియమించే అవకాశం కూడా ఉంటుంది.

కొత్త సర్కారు దిశగా సిరియా

అల్-బషీర్‌కు సమన్వయ బాధ్యతలు.. ప్రకటించిన తిరుగుబాటుదారులు

» దేశవ్యాప్తంగా ఖైదీల విడుదల

» అసద్‌కు ఆశ్రయం కల్పించిన రష్యా



మాస్కో చేరుకున్న అసద్ కుటుంబ సభ్యులు



అల్ బషీర్

డమాస్కస్/న్యూఢిల్లీ, డిసెంబరు 9: కల్లోలిత సిరియా సుస్థిర ప్రభుత్వ ఏర్పాటు దిశగా ముందుకు సాగుతోంది. తిరుగుబాటు దళాలకు నేతృత్వం వహిస్తున్న హయాత్ తహ్రీర్ అల్ షమ్(హెచ్‌టీఎస్) ఈ విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది. అంతర్గత విభేదాల్లేకుండా.. గందరగోళానికి తావివ్వకుండా, సామరస్యపూర్వకంగా సర్కారు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో సమన్వయానికి సిరియా సాల్వేషన్ ప్రభుత్వ(తిరుగుబాటు దారుల పాలనలో ఉన్న ప్రాంతాలు) అధినేత మహమ్మద్ అల్-బషీర్‌కు బాధ్యతలను అప్పగించారు. వివిధ వర్గాలతో ఆయన చర్చించి, సమన్వయంతో కొత్త ప్రభుత్వ ఏర్పాటు చేస్తారు. ఈ క్రమంలో అల్-బషీర్ సోమవారం వరుస భేటీలు ఏర్పాటు చేశారు. హెచ్‌టీఎస్‌తోపాటు.. అహ్మద్ అల్-షరా సంస్థ, సిరియా ప్రధాని మహమ్మద్ అల్-జలాలీ, ఇతర తిరుగుబాటు వర్గాలతో సమావేశమవుతున్నారు. మరోవైపు, సిరియా అధ్యక్షుడు అసద్ రష్యాకు పయనమవ్వగానే.. రెబెల్స్ నాయకుడు అల్-జోలానీ జాతినుద్దేశించి ప్రసంగించారు. "అసద్ పారిపోవడంతో దేశం పవిత్రమైంది. సిరియన్లు ఇక భయపడాల్సిన అవసరం లేదు. వివిధ దేశాల్లో శరణార్థులుగా ఉన్న సిరియన్లు వెనక్కి తిరిగి రావాలి. వారికి స్వాగతం పలికేందుకు సిరియాలోని విమానాశ్రయాలను సిద్ధం చేస్తున్నాం. ఆదివారం (ఈ నెల 8) కంటే ముందు జరిగిన నేరాలకు సంబంధించిన అన్ని శిక్షలను రద్దు చేస్తాం. నిందితులకు క్షమాభిక్ష ప్రసాదిస్తాం" అని ప్రకటించారు. దౌత్యవేత్తల ఆఫీసులు, ఇళ్లకు భద్రత కల్పిస్తామన్నారు. ఆయన ప్రసంగించిన వెంటనే.. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జైళ్లలోని ఖైదీలు విడుదలయ్యారు.

మాస్కోకు చేరుకున్న అసద్

ఆదివారం ఉదయం డమాస్కస్ నుంచి పారిపోయిన సిరియా అధ్యక్షుడు బషర్ అల్-అసద్, అతని కుటుంబ సభ్యులు మాస్కోకు చేరుకున్నట్లు రష్యా ప్రభుత్వం ప్రకటించింది. ఆయనకు రాజకీయ ఆశ్రయం కల్పిస్తున్నట్లు తెలిపింది. అయితే.. డమాస్కస్ నుంచి పారిపోవడానికి ముందు అసద్ తన కార్యాలయ అధికారులు, సైన్యాధికారులకు కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. "వివాదాల్లేకుండా.. శాంతియుతంగా అధికారాన్ని బదిలీ చేయండి. నా భవిష్యత్ గురించి ఆందోళన వద్దు" అని సూచించినట్లు రష్యా మీడియా సంస్థలు పేర్కొన్నాయి.

సిరియాలో స్థిరత్వం రావాలి: భారత్

సిరియాలో పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. సిరియా సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను కాపాడేందుకు ఆ దేశంలోని అన్ని పార్టీలు సమష్టిగా కృషి చేయల్సిన అవసరం ఉందని పేర్కొంది. సిరియాలో శాంతిస్థాపన జరగాలని ఆకాంక్షించింది. అక్కడ ఉన్న భారతీయులంతా క్షేమంగా ఉన్నారని తెలిపింది.

రష్యా వైఖరిలో మార్పు!

అసద్ విషయంలో రష్యా వైఖరిలో మార్పు కనిపిస్తోందని పాశ్చాత్య మీడియా కథనాలను ప్రచురించింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైన నేపథ్యంలో.. అసద్‌కు దూరంగా ఉండాలని రష్యా నిర్ణయించినట్లు పేర్కొంది. సోమవారం ఉదయం మాస్కోలోని సిరియా రాయబార కార్యాలయం వద్ద రెబెల్స్ పతాకాన్ని ఎగురవేయడానికి కూడా రష్యా అనుమతించడాన్ని ఈ అనుమానాలు బలపరుస్తున్నట్లు తెలిపింది. ఇదిలా ఉండగా, డమాస్కస్, హోమ్‌లోని హిజ్బుల్లా స్థావరాలపై అడపాదడపా దాడులు చేస్తున్న ఇజ్రాయెల్.. ఆదివారం సాయంత్రం నుంచి సిరియాపై దూకుడు పెంచింది. సోమవారం డమాస్కస్‌లో ఉన్న రసాయన ఆయుధాల డిపోలపై బాంబుల వర్షం కురిపించింది.

కెనడా, మెక్సికోలకు అన్ని రాయితీలా..
అవి అమెరికాలో విలీనమైతేనే మేలు

న్యూయార్క్, డిసెంబరు 9: పొరుగు దేశాలకు అమెరికా ఇస్తున్న రాయితీలపై కాబోయే ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో స్పందించారు. కెనడా, మెక్సికోకు భారీగా రాయితీలివ్వడం కంటే ఆ రెండు దేశాలు అమెరికాలో విలీనమైతేనే బాగుంటుందని వ్యాఖ్యానించారు. అమెరికాలోకి ఆయా దేశాల నుంచి అక్రమ వలసదారులను నియంత్రించకపోతే దిగుమతులపై భారీ సుంకాలు విధిస్తానని మరోసారి హెచ్చరించారు. ఆదివారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ పలు అంశాలపై మాట్లాడారు. 'మెక్సికోకు ఏటా 300 బిలియన్ డాలర్లు (రూ.24 లక్షల కోట్లు), కెనడాకు 100 బిలియన్ డాలర్ల (రూ.8 లక్షల కోట్లకు పైగా) రాయితీలు ఇస్తున్నాం.. అసలు ఎందుకు ఆ దేశాలకు మనం రాయితీలు ఇవ్వాలి. దానికంటే ఆ దేశాలు అమెరికాలో విలీనమై రాష్ట్రాలుగా మారితే మేలు' అని అన్నారు. ఇక అక్రమ వలసదారులపై స్పందిస్తూ.. అధికారం చేపట్టిన మొదటి రోజు నుంచే పుట్టుకతో సంక్రమించే పౌరసత్వంపై దృష్టి పెడతానని చెప్పారు. వచ్చే నాలుగేళ్లలో అక్రమ వలసదారులను అమెరికా దాటిస్తానని ప్రకటించారు.

కోర్టు బోను ఎక్కనున్న నెతన్యాహు

జెరూసలేం, డిసెంబరు 9: ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తొలిసారిగా మంగళవారం ఓ అవినీతి వ్యవహారంలో కోర్టు బోను ఎక్కనున్నారు. మీడియాలో ప్రచారం కోసం కొన్ని మీడియా సంస్థల అధిపతులకు లబ్ధి కలిగించే విధంగా ప్రభుత్వ నిబంధనలను నెతన్యాహు ఉల్లంఘించారని, ఓ హాలీవుడ్ నిర్మాతతోనూ ఇలాగే వ్యవహరించారని గతంలోనే మూడు కేసులు దాఖలయ్యాయి. వీటిపై 2020లోనే కోర్టులో విచారణ ప్రారంభమైంది. అయితే, గాజాలో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో విచారణను వాయిదా వేయాలంటూ నెతన్యాహు పలుమార్లు కోర్టును కోరుతూ వచ్చారు. పలు వాయిదాల అనంతరం, మంగళవారం నుంచి విచారణ పునఃప్రారంభం కానుంది. దీంట్లో భాగంగా, వారానికి మూడు రోజులపాటు నెతన్యాహు కోర్టు విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. తీర్పు 2026లో వెలువడొచ్చు.

చేతబడి అనుమానంతో
హైతీలో 184 మంది వృద్ధుల ఊచకోత

జెనీవా, డిసెంబరు 9: సాయుధ గ్యాంగుల హింసతో అట్టుడుకుతున్న హైతీలో ఒక బలమైన గ్యాంగ్ నాయకుడు గత వారాంతంలో 184 మంది వృద్ధులను ఊచకోత కోయించాడని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల విభాగం అధ్యక్షుడు వోకర్ టర్క్ చెప్పారు. హైతీ రాజధాని పోర్ట్-ఔ-ప్రిన్స్‌కు సమీపంలోని సిటే సోలీల్ ప్రాంతంలో ఈ హత్యలు జరిగినట్టు సోమవారం తెలిపారు. వార్ఫ్ జెరెమీ గ్యాంగ్ నాయకుడు మానెల్ మికానో ఫెలిక్స్ కుమారుడు అనారోగ్యానికి గురై శనివారం మరణించాడు. వృద్ధులు చేతబడి చేయడం వల్లే అతడి ఆరోగ్యం క్షీణించిందని ఊడో మతబోధకుడు ఒకరు చెప్పడంతో ఫెలిక్స్ అనుచరులు కొడవళ్లు, కత్తులతో స్వైర విహారం చేసి శుక్ర, శనివారాల్లో వృద్ధులను చంపేశారని టర్క్ వెల్లడించారు.

పంపాలో మహిళలకు ప్రత్యేక వసతి

శబరిమల, డిసెంబరు 9: శబరిమల యాత్రకు వెళ్లే మహిళల చిరకాల డిమాండ్ నెరవేరింది. కేరళ సర్కారు మహిళల కోసం పంపా బేస్‌లో ప్రత్యేక వసతి సదుపాయాన్ని కల్పించింది. ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) అధ్యక్షుడు పీఎస్ ప్రసాద్ సోమవారం ఈ వసతి గృహాన్ని ప్రారంభించారు. ఇందులో ఏకకాలంలో 50 మంది మహిళలు విశ్రాంతి తీసుకునే వెసులుబాటు ఉంటుందని, అయ్యప్ప దీక్షాధారులతోపాటు వచ్చే మహిళలు తమవారు తిరిగి వచ్చేవరకు పంపా బేస్, హిల్‌టాప్ వద్ద వాహనాల్లోనే ఎదురుచూసేవారు. ఇలాంటి వారికి ఈ వసతిగృహం ఉపయోగపడుతుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

నోయిడా విమానాశ్రయంలో..
విమాన ల్యాండింగ్ పరీక్షలు విజయవంతం

న్యూఢిల్లీ, డిసెంబరు 9: ఢిల్లీ(ఎన్‌సీఆర్)లో నిర్మితమవుతున్న నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం (ఎన్ఐఏ)లో సోమవారం తొలిసారిగా విమాన ల్యాండింగ్ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేశారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ విమానాశ్రయం నుంచి సిబ్బందితో బయలుదేరిన ఇండిగో ఏ- 320 విమానం చోదన వ్యవస్థ పనితీరు, ఎయిర్ ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థల పరీక్షల అనంతరం సురక్షితంగా నోయిడా విమానాశ్రయ రన్‌వే పై ల్యాండ్ అయింది. ఈ సందర్భంగా విమానాశ్రయ సిబ్బంది విమానానికి వాటర్ సెల్యూట్ సమర్పించారు. దేశ రాజధానిలో ఇప్పటికే ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్నప్పటికీ అక్కడ పెరుగుతున్న రద్దీ, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఢిల్లీకి సమీపంలోని జేవర్‌లో అధునాతన హంగులు, సదుపాయాలతో ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు.

యూపీఎస్సీ మెయిన్స్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ, డిసెంబరు 9: అఖిల భారత సర్వీసుల్లో 1,056 ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన సివిల్ సర్వీస్ మెయిన్స్ ఫలితాలను యూపీఎస్సీ సోమవారం విడుదల చేసింది. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు సెప్టెంబరు 20 నుంచి 29 వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. ఇందులో ఎంపికైన అభ్యర్థుల జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ అభ్యర్థులు ఇంటర్వ్యూ (పర్సనాలిటీ టెస్ట్)కు హాజరు కావాల్సి ఉంటుంది. ఇందులో సత్తా చాటిన వారిని ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి కేంద్ర సర్వీసులకు ఎంపిక చేస్తారు.

ఆత్మహత్యకు ముందు స్నానం..
శివనామ స్మరణ

» ఏమేం చేయాలో రాసుకొని, ఆచరించి బెంగళూరులో యూపీ వాసి ఆత్మహత్య



అతుల్ సుభాష్

బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'ఆత్మహత్యకు ముందు స్నానం చేయాలి.. వందసార్లు శివనామస్మరణ చేయాలి. సూసైడ్ నోట్‌ను హైకోర్టు, సుప్రీంకోర్టు, ఆఫీసు, కుటుంబ సభ్యులకు మెయిల్ చేయాలి. చివరిగా తాడు సిద్ధం చేసుకోవాలి..' ఇలా ప్రతి ఒక్కటీ రెండు రోజుల ముందే అన్నీ ప్రణాళికాబద్ధంగా రాసిపెట్టుకుని.. ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బెంగళూరు నగరం మాతరహళ్లిలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అతుల్ సుభాష్.. మాతరహళ్లిలోని మంజునాథ లేఅవుట్‌లో నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నాడు. దీంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన ఆత్మహత్యకు కారణాలు, ప్రణాళిక.. ఇలా అన్ని వివరాలతో 40 పేజీల సూసైడ్ నోట్ రాసిపెట్టాడు. 'చనిపోవడానికి ఒక రోజు ముందే అన్ని పేమెంట్లు క్లియర్ చేయాలి. ఆఫీసు పనిపూర్తి చేయాలి. ల్యాప్‌టాప్, చార్జర్, ఐడీని ఆఫీసులో అప్పగించాలి' అని పక్కాగా టైం టేబుల్ రాసుకొని ఆచరించాడు. భార్యతో విబేధాలు వచ్చాక తాను ఎదుర్కొన్న సమస్యలను సూసైడ్ నోట్‌లో సమగ్రంగా పొందుపరిచాడని పోలీసులు తెలిపారు.

కోటి సభ్యత్వాల లక్ష్యం దిశగా..

- ఇప్పటికే 68 లక్షలు పూర్తి చేసిన టీడీపీ
- ఈనెల 26 నాటికి లక్ష్యం పూర్తి చేసే యోచన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఈసారి తమ సభ్యత్వాలు కోటి కావాలని తెలుగు దేశం పార్టీ లక్ష్యంగా పెట్టుకొంది. ఇప్పటికే 68 లక్షల సభ్యత్వాలు దాటడంతో కోటి లక్ష్యాన్ని చేరుకోడానికి పార్టీ యంత్రాంగం శ్రమిస్తోంది. కోటికి చేరగలిగితే ఆ పార్టీ చరిత్రలో ఇదే అత్యధిక సభ్యత్వం అవుతుందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది అక్టోబర 26న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించింది. నవంబరు 26 నాటికి 50 లక్షల మైలు రాయిని అధిగమించింది. డిసెంబరు 26 నాటికి కోటి సభ్యత్వాలు పూర్తి చేయాలని పార్టీ నాయకత్వం అనుకుంటోంది. 1982లో ఆవిర్భవించిన తెలుగు దేశం పార్టీ ప్రతి రెండేళ్లకోసారి సభ్యత్వ నమోదు చేపడుతోంది. ఎన్నికలు, కోవిడ్ వంటివి వస్తే మినహా ఈ షెడ్యూల్‌ను ఇంతవరకూ తప్పలేదు. పోయినసారి అధికారంలో ఉన్నప్పుడు 2018లో రెండు రాష్ట్రాల్లో కలిపి పార్టీ సభ్యత్వం 65 లక్షలైంది. ఈసారి ఇప్పటికే దానిని అధిగమించారు. కోటి లక్ష్యాన్ని చేరుకోగలమని పార్టీ నేతలు విశ్వాసంతో ఉన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు లక్ష సభ్యత్వాలను



దాటేశాయి. అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలో ఒక లక్షా పద్దెనిమిది వేల సభ్యత్వాలు నమోదవగా, పార్టీ అధినేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో ఒక లక్షా నాలుగు వేల మంది టీడీపీ సభ్యత్వం స్వీకరించారు. చంద్రబాబు తనయుడు లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గం ఐదో స్థానంలో ఉంది. అక్కడ ఇప్పటికి 84 వేల మంది సభ్యులుగా చేరారు. ఈసారి ప్రజల్లో స్పందన కూడా బాగా ఉండటంతో సభ్యత్వంలో జోరు పెరిగిందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. సభ్యత్వ రుసుం రూ.100 కట్టిన ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నారు. సహజ మరణం సంభవిస్తే అంత్యక్రియల ఖర్చుల కింద రూ.10 వేలు ఇస్తున్నారు. ఇవి ఆకర్షణీయంగా ఉన్నాయనేది పార్టీ వర్గాల కథనం. దీనికితోడు అధికారంలో ఉన్న పార్టీలో సభ్యత్వం తీసుకుంటే ఉపయోగం ఉంటుందనే ప్రజల భావన కూడా సభ్యుల సంఖ్యను పెంచుతోంది. టీడీపీలో సభ్యులుగా ఉంటే ప్రభుత్వ పథకాల్లో తమకు ప్రాధాన్యం ఉంటుందన్న అభిప్రాయంతో విరివిగా చేరుతున్నారని కొందరు నేతలు చెబుతున్నారు.

52 శాతం మంది కొత్త సభ్యులే

కొన్ని నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు మందకొడిగా జరగడాన్ని పార్టీ నాయకత్వం సీరియస్‌గా తీసుకొంటోంది. మిగిలిన చోట్ల బాగా జరుగుతుంటే, ఈ నియోజకవర్గాల్లో జరగకపోవడానికి అక్కడి ఎమ్మెల్యేలు లేదా నియోజకవర్గ ఇన్‌చార్జులు పట్టించుకోకపోవడమే కారణమని నాయకత్వం భావిస్తోంది. సభ్యత్వంలో వెనకబడిన నియోజకవర్గాలు సుమారు ఇరవై వరకూ ఉన్నాయని అంచనా. అక్కడి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులను ఇటీవల పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. సభ్యత్వం ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా శ్రద్ధ తీసుకొని పూర్తి చేయాలని, లేని పక్షంలో ఈసారి పార్టీ అధినేత పిలిపించాల్సిన పరిస్థితి వస్తుందని వారికి చెప్పినట్లు సమాచారం. దీంతో కొందరు ఎమ్మెల్యేలు వేగం పెంచారు. సభ్యత్వ నమోదులో ఏ నియోజకవర్గం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోడానికి పార్టీ వెబ్‌సైట్‌లో ఒక డాష్ బోర్డు ఏర్పాటు చేశారు. ఇందులో టాప్ ఇరవై నియోజకవర్గాల వివరాలు పెడుతున్నారు. ఆ రోజు టాప్‌లో ఉన్న నియోజకవర్గాలు, మొత్తం మీద అగ్రస్థానంలో ఉన్న నియోజకవర్గాల పేర్లు, అక్కడ జరిగిన సభ్యత్వం సంఖ్యను ఇందులో ప్రదర్శిస్తున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో కూడా ఒక పెద్ద డిస్‌ప్లే బోర్డు ఏర్పాటు చేసి ఈ అంకెలు ప్రదర్శిస్తున్నారు. నేతల మధ్య పోటీ పెరగడానికి ఇది ఉపయోగపడుతుందని నాయకత్వం భావిస్తోంది. ఈసారి కొత్త సభ్యుల సంఖ్య గణనీయంగా పెరగడం మరో విశేషం. ఇప్పటి వరకూ చేరిన వారిలో 48 శాతం మంది పాత సభ్యులైతే... 52 శాతం మంది కొత్త సభ్యులు ఉన్నారు.



రూ.3వేల కోట్లతో ధాన్యం కొనుగోలు: నాదెండ్ల



లావేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.3వేల కోట్లతో 1.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సోమవారం శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం బుడుమూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో మొత్తం కలిపితే కేవలం 72,017 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలల వ్యవధిలోనే లక్షా 15 వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేశాం. ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో రూ.253 కోట్లు నగదును జమ చేశాం. రైతులు ధాన్యం విక్రయించిన 24 గంటల్లోపే డబ్బులు చెల్లిస్తున్నాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం' అని మంత్రి తెలిపారు.

రీల్స్ తీసేవారిపై నిఘా

- తిరుమల ఆలయం ముందు తనిఖీలు.. 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



ఆలయం ముందు భక్తులను విచారిస్తున్న విజిలెన్స్ సిబ్బంది

తిరుమల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం ముందు రీల్స్ తీసేవారిపై టీటీడీ నిఘా విభాగం దృష్టి పెట్టింది. 'కొండపై కుప్పిగంతులు' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితం కావడంతో విజిలెన్స్ సిబ్బంది సోమవారం ఆలయం ముందు తనిఖీలకు శ్రీకారం చుట్టారు. సెల్‌ఫోన్లలో వీడియోలు, ఫొటోలు తీస్తున్న వారిని గమనించి ప్రశ్నించారు. రీల్స్ తీస్తున్నట్టు అనుమానం వచ్చిన వారి ఫోన్లను తనిఖీ చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా తిరుమలలో ఎలాంటి వీడియోలు తీయడానికి వీల్లేదని సూచించారు. ఈ తనిఖీలు రోజూ కొనసాగుతాయని టీటీడీ అధికారులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆ సినిమాలో తిరుమల సీన్లు ఎలా తీశారు..?

తిరుమలలో సినిమా షూటింగులకు అనుమతి లేదు. అలిపిరి దాటిన తర్వాత సినిమాల షూటింగ్‌లను టీటీడీ గతంలోనే నిషేధించింది. అయితే ఇటీవల నివేదా థామస్ ప్రధాన పాత్రలో నటించిన '35 చిన్న కథ కాదు' సినిమాలోని కొన్ని సీన్లు తిరుమలలో తీసినట్టు ఉండడంతో సోషల్ మీడియాలో ఇవి వైరల్ అవుతున్నాయి. హీరో ఆలయం ముందున్నట్టుగా ఉన్న సీన్లు, ఘాట్ రోడ్డు దృశ్యాలు ఈ సినిమాలో ఉన్నాయి. అయితే వాటిని ఎప్పుడు, ఎలా తీశారన్నది తెలియడం లేదు. దీంతో ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలలో ఇదేమిటంటూ కొందరు నెటిజన్లు విమర్శిస్తున్నారు.

ఉపాధి అవినీతిపై అంకుశం

- మొదటిసారిగా 8 మందిపై ఎఫ్‌ఐఆర్
- ఇప్పటికే ఐదుగురు ఉద్యోగుల సస్పెన్షన్
- 2022-23లో జరిగిన అక్రమాలపై చర్యలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. 2022-23లో నెల్లూరు జిల్లా కలువాయి మండలంలో జరిగిన అవినీతికి సంబంధించి 8 మంది సిబ్బందిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. రాష్ట్రంలో గత ఐదేళ్లుగా ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతిలో ఇదే మొదటి ఎఫ్‌ఐఆర్. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు చేపట్టాక ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉపాధి హామీ పథకం అవినీతిని రూపుమాపడానికి పలు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇటీవల చీఫ్ విజిలెన్స్ అధికారిగా అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారి భవానీ హర్షను నియమించి ఆ విభాగానికి జవసత్వాలు నింపారు. ఆయన బాధ్యతలు చేపట్టగానే విజిలెన్స్‌కు సంబంధించి జీఓ నెంబర్ 52కు పదును పెట్టారు. ఉపాధి హామీ పథకంలో రూ.లక్ష కంటే ఎక్కువగా అవినీతికి పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకోవడం ప్రారంభించారు. నెల్లూరు జిల్లా కలువాయి మండలం చినగోపవరం పంచాయతీలో జరిగిన భారీ అవినీతిపై ఇటీవల సోషల్ ఆడిట్ తనిఖీలు నిర్వహించింది. ఆ మండలంలో రూ.60 లక్షలకు పైగా అవినీతి జరిగిందని తేల్చారు. ఒక్క చినగోపవరం పంచాయతీలోనే రూ.50 లక్షల దాకా అప్పనంగా దోచుకున్నారని గుర్తించారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులను జాబ్‌కార్డుల్లో సభ్యులుగా చేర్చి ఫీల్డ్ అసిస్టెంట్ ఎ.మహేంద్ర రూ.27.45 లక్షలను స్వాహా చేశారని నిర్ధారించారు. ఆ మండలంలో ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌గా ఉన్న శీనయ్య రూ.13.79 లక్షలు, టెక్నికల్ అసిస్టెంట్లు ఎం.వెంకటేశ్వర్లు రూ.9.63 లక్షలు, ఎంపీ ప్రసాద్ రూ.3.73 లక్షలు, ఎం.ప్రసన్న రూ.2.70 లక్షలు స్వాహా చేశారని తేల్చారు. ఇటీవల చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ భవానీ హర్ష ఆ మండలంలో పర్యటించి సమగ్ర విచారణ చేపట్టారు. సోషల్ ఆడిట్ హియరింగ్ తర్వాత అవినీతిలో భాగస్వాములైన ఫీల్డ్ అసిస్టెంట్ మహేంద్రరెడ్డి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శీనయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు వెంకటేశ్వర్లు, ప్రసన్న, ఎంపీ ప్రసాద్‌లను ఇప్పటికే సస్పెండ్ చేశారు. ఈ అవినీతిలో ఇద్దరు ఏపీఓలు, ఒక కంప్యూటర్ ఆపరేటర్ సహకారం ఉందంటూ వారిని కూడా బాధ్యులను చేస్తూ మొత్తం 8 మంది సిబ్బందిపై కేసులు నమోదు చేసేందుకు ఆదేశాలిచ్చారు. అవినీతి కేసులలో కేవలం రికవరీలతో సరిపెట్టడం కాకుండా బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు పెట్టడం ద్వారా పథకాన్ని గాడిలో పెట్టాలని భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నారు. దీంతో ఉపాధి సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

అవినీతిని వెలుగులోకి తెచ్చిన అంబుడ్స్‌మెన్

నెల్లూరు జిల్లాలో ఉపాధి పథకంలో అవినీతిపై వేటాడుతున్న అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి మొదట చిన్నగోపవరం పంచాయతీపై దృష్టి సారించారు. గ్రామంలో ఎస్సీలకు చెందిన ఉపాధి వేతనాలను కొంత మంది దోచుకోవడంపై ఉన్నతాధికారులను అలెర్ట్ చేశారు. ఆయన స్వయంగా తనిఖీ చేశారు. మండల సోషల్ ఆడిట్ హియరింగ్‌కు సోషల్ ఆడిట్ డైరెక్టర్ కలువాయి వచ్చేట్లు చేసి ఉపాధిలో జరిగిన అవినీతిని బయట పెట్టారు. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. భవానీ హర్ష దృష్టికి తీసుకెళ్లి అవినీతిపరులపై కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఆయన ఇప్పటికే కొడవలూరు మండలం తలమంచి గ్రామ పంచాయతీలోనూ జరిగిన అవినీతిపై పలువురు సిబ్బందిని ఇంటిదారి పట్టించారు.

సభా సంఘం ప్రశ్నలకు విశాఖ డెయిరీ ఎండీ మౌనం

- గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీకి నిధుల మళ్లింపుపై తెలియదంటూ సమాధానం
- హైదరాబాద్ యూనిట్‌పై అస్పష్టత
- డెయిరీ డాక్యుమెంట్లన్నీ సమర్పించాలని కలెక్టర్ ఆదేశం

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాసనసభా సంఘం ప్రశ్నలకు విశాఖ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ మౌనం దాల్చారు. కొన్నింటికి అస్పష్టమైన సమాధానం ఇచ్చారు. కోర్టుల కేసుల గురించి అడిగితే తనకు తెలియదని సమాధానం ఇచ్చారు. ఆయన తీరుపై ఆగ్రహించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్ డెయిరీకి సంబంధించిన డాక్యుమెంట్లన్నీ, ఆడిట్ రిపోర్టులు, కోర్టు కేసులతో సహా సభా సంఘానికి సమర్పించాలని ఆదేశించారు. ఇటీవల జరిగిన శాసనసభా సమావేశాల్లో పలువురు ఎమ్మెల్యేలు విశాఖ డెయిరీ అక్రమాలను ఎండగట్టగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సభా సంఘాన్ని నియమించిన సంగతి తెలిసిందే. జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన సభ్యులు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, బొండా ఉమామహేశ్వరరావు, గౌతు శిరీష, ఆర్‌వీఎస్‌కేకే రంగారావు, దాట్ల సుబ్బరాజు సోమవారం విశాఖ నగర పరిధిలోని షీలానగర్‌లో గల డెయిరీని సందర్శించారు. డెయిరీ ఎండీ ఎస్‌వీ రమణతో సమావేశమై డెయిరీ కార్యకలాపాలపై ఆరా తీశారు. ఆర్థిక వ్యవహారాలపై ప్రశ్నించారు. ట్రస్టులు, వాటిలో సభ్యులు, డెయిరీలో ఆడారి కుటుంబ సభ్యుల ప్రమేయం, సొసైటీగా ఉన్న డెయిరీని కంపెనీగా మార్చిన వైనంపై ప్రశ్నలు సంధించారు. రైతుల కోసం నిర్మించిన ఆస్పత్రి కార్పొరేట్ సంస్థకు అప్పగింత, అందులో రైతులకు అందుతున్న వైద్య సేవలపై ప్రశ్నించారు. సిబ్బందికి ఇచ్చే జీతభత్యాల్లో అసమానతలు, ప్రమోషన్లలో అడ్డగోలు విధానాలు, ఎండీగా నెలకు రూ.10 లక్షల జీతంపై ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ట్రస్ట్ నుంచి అధికార పార్టీకి నిధుల మళ్లింపుపై ప్రశ్నించగా తనకు తెలియదని ఎండీ సమాధానం ఇచ్చారు. పాల సేకరణ, రైతులకు తక్కువ ధర ఇవ్వడం వంటివి కూడా అడిగారు. హైదరాబాద్‌లో డెయిరీ యూనిట్ ఎవరి పేరున ఉందని ప్రశ్నించగా ఎండీ సమాధానం ఇవ్వలేదు. అలాగే కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న వ్యాపార కేంద్రాలు ఏమిటనే దానికి కూడా మౌనం వహించారు. ఆ తరువాత సభా సంఘం కలెక్టరేట్‌కు వెళ్లి, అక్కడకు కూడా ఎండీని పిలిపించి, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమక్షంలో ప్రశ్నించింది. అక్కడ కూడా ఎండీ సరైన సమాధానాలు చెప్పకపోవడంతో కలెక్టర్ ఆగ్రహించారు.

గంజాయి విక్రయ ముఠా అరెస్టు

- ఒడిశా నుంచి జోరుగా అక్రమ రవాణా



గంజాయిని పరిశీలిస్తున్న ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు

ఒంగోలుక్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి ఒంగోలు పరిసరప్రాంతాలకు గంజాయిని అక్రమ రవాణా చేసి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. 12 మందిని అరెస్టు చేసి 4 కిలోల గంజాయి, రూ.10వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. గంజాయి అమ్ముతున్నారన్న సమాచారం మేరకు సోమవారం ఉదయం మద్దిపాడు మండలం వెల్లంపల్లిలోని స్పిన్నింగ్ మిల్లు వద్దకు ఒంగోలు రూరల్ సర్కిల్ సీఐ శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు వెళ్లారు. అక్కడ గంజాయిని విక్రయించేందుకు ప్యాకెట్లు సిద్ధం చేస్తున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 4 కిలోల గంజాయి, రూ.10వేలు నగదును స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

12 మంది ముఠాగా ఏర్పడి..

ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రశాంత్‌కుమార్ సాహు వెల్లంపల్లిలో నివాసం ఉంటున్నాడు. అతను పనిచేస్తున్న స్పిన్నింగ్ మిల్లు మూసివేయడంతో గంజాయి అక్రమ రవాణాకు తెరలేపాడు. వెల్లంపల్లిలోనే ఉంటున్న ఒడిశాకు చెందిన సునీల్ బెహ్రా, అభినాష్ బెహ్రా, సోనూరామ్ అతనికి సహకరిస్తున్నారు. మద్దిపాడు మండలం నేలటూరుకు చెందిన వడేల వాసు, కుంచాల మణికంఠ అలియాస్ మణికుమార్, తన్నీరు అకమ్మరావు, కుంచాల వీరాంజనేయులు, ఎన్‌జీపాడు మండలం రాపర్లకు చెందిన డాకా సుబ్బారెడ్డి, ఎస్ఎన్‌పాడు మండలం తక్కెళ్లపాడుకు చెందిన గుడిపాటి దుష్యంత్, ఒంగోలు గంటాయపాలెంకు చెందిన సుంకర బాలచిరంజీవి వీరితో కలిశారు. ఒడిశా నుంచి గంజాయి తెచ్చి విక్రయించి సొమ్ము చేసుకుంటున్న వీరంతా చివరికి పోలీసులకు చిక్కారు.



భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్న వైసీపీ నేతల ఫొటోలతో ఉన్న బ్యాగు, నిషేధిత పొగాకు ఉత్పత్తులు

అపచారం కదా అమర్...!

- పాదయాత్రగా తిరుమలకు వైసీపీ ఎమ్మెల్యే ఆకేపాటి
- బృందంతోపాటు పొగాకు ఉత్పత్తులు తిరుమలకు
- వైసీపీ నేతల ఫొటోలు ఉన్న బ్యాగులతో రాక
- గోగర్భం డ్యాం వద్ద విజిలెన్స్ సిబ్బంది స్వాధీనం

తిరుమల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన తిరుమల క్షేత్రానికి నిషేధిత వస్తువులైన సిగరెట్లు, బీడీలు, ఖైనీలు, హాన్స్ వంటి పొగాగు ఉత్పత్తులు చేరాయి. తాళ్లపాక అన్నమయ్య తిరుమలకు నడిచివచ్చిన మార్గాన్ని అభివృద్ధి చేయాలనే నినాదంతో కొన్నేళ్లుగా వైసీపీ నేత, అన్నమయ్య జిల్లా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తిరుమలకు పాదయాత్రగా వస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే కడప, రాయచోటి, కోడూరు పరిసర ప్రాంతాల్లోని దాదాపు మూడు వేల మంది భక్తులతో ఆయన సోమవారం సాయంత్రం పాదయాత్రగా తిరుమల చేరుకున్నారు. అయితే పాదయాత్ర బృందంలో వచ్చిన కొంతమంది సిగరెట్లు, బీడీలు, ఖైనీలు, హాన్స్ వంటి పొగాకు ఉత్పత్తులు కూడా తమతో తీసుకొచ్చారు. గోగర్భం డ్యాం వద్ద విజిలెన్స్ అధికారులు, సిబ్బంది.. తనిఖీల్లో వీటిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కొంతమంది వైసీపీ గుర్తులు, పేర్లు, జగన్మోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఫొటోలతో కూడిన బ్యాగులను కూడా తిరుమలకు తీసుకువచ్చారు.



మద్యం నిల్వలను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

అనంతలో రూ. 44 లక్షల గోవా మద్యం పట్టివేత

- నలుగురిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

రాప్తాడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన గోవా మద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం నగరానికి చెందిన అబుసలేహ, దస్తగిరి హుసేన్, కిశోర్, వాచ్‌మన్ ఆనంద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంటకశివకుమార్‌రెడ్డి పరారయ్యాడు. అక్రమ మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం రావడంతో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ మునిస్వామి, రాప్తాడు పోలీసులతో కలిసి సోమవారం సాయంత్రం రాప్తాడు రైల్వే గేటు సమీపంలోని ఓ తోటలో దాడులు నిర్వహించారు. 474 బాక్సుల గోవా మద్యాన్ని గుర్తించారు. గొర్రెల పెంపకం పేరిట ఓ రైతు నుంచి షెడ్డును లీజుకు తీసుకుని, మద్యం నిల్వల కోసం వినియోగిస్తున్నట్టు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.44 లక్షలు ఉంటుందని నాగమద్దయ్య తెలిపారు. గోవా నుంచి మద్యాన్ని తీసుకువచ్చి అనంతపురం సమీప ప్రాంతాల్లోని బెల్టు షాపులకు విక్రయిస్తున్నారని తెలిపారు. వెంకశివకుమార్‌రెడ్డి పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని తెలిపారు.

వంశీ అనుచరులపై చర్యలు తీసుకోండి

- టీడీపీ ప్రజావేదికలో బాధితుల ఫిర్యాదు

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో బాధితులు పెద్దఎత్తున బయటకి వస్తున్నారు. వారి కష్టాలను టీడీపీ నేతల వద్ద ఏకరవు పెడుతున్నారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు ప్రజావేదికలో అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరుల అక్రమాలను బాధితులు ఏకరువు పెట్టారు. వంశీకి బినామీలుగా ఉంటూ, టీడీపీ కార్యాలయంపై దాడి చేయడంతో పాటు రౌడీయిజం, సెటిల్‌మెంట్లు, భూ కబ్జాలు, ఇతర అక్రమాలకు పాల్పడిన నిమ్మగడ్డ బ్రాహ్మణి, తోడేటి బెంజిమన్, తోడేటి విజయ్‌కుమార్, చిలువూరి జయరాజు, చిలువూరి జాన్, దొండపాటి ప్రభాకర్, గొడ్డళ్ల రామారావు, పింద్రాల పుల్లయ్యలపై చర్యలు తీసుకోవాలని గన్నవరం నియోజకవర్గానికి చెందిన బొడ్డు విజయ్‌కుమార్, హరీష్ తదితరులు ఫిర్యాదు చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు సాయి ప్రతాప్‌రెడ్డి, బాలనాగిరెడ్డి అనుచరులు నాగరాజు, ఉరుకుందప్ప తమను వేధిస్తున్నారని కర్నూలు జిల్లా పెద్దతుంబలం గ్రామానికి చెందిన మహదేవప్ప గోడు వెళ్లబోసుకున్నారు. టీటీడీలో, రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కృష్ణమూర్తి అనే వ్యక్తి తమ వద్ద రూ.కోటి ముప్పై లక్షలు కొట్టేశాడని తిరుపతి జిల్లా రేణిగుంటకు చెందిన లీలావతి, తదితరులు వాపోయారు. తాను పదేళ్ల నుంచి నివాసం ఉంటున్న ఇంటిని కూల్చేస్తామంటూ వైసీపీ నేతలు బెదిరిస్తున్నారని తిరుపతి జిల్లా కరకంబాడికి చెందిన సంపూర్ణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రగిరికి చెందిన కుమార్‌బాబు అనే వ్యక్తి నుంచి తనకు రావాల్సిన రూ. 2 లక్షలు ఇప్పించాలని పోలీసులను ఆశ్రయిస్తే.. డబ్బులివ్వాల్సిన వ్యక్తి వెనుక వైసీపీ నేతలున్నారని, వారితో మాట్లాడు కోవాలని పోలీసులు సలహా ఇస్తున్నారని కడప జిల్లా పులివెందులకు చెందిన ఫక్రుద్దీన్ ఫిర్యాదు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సిరియా...కొత్త భయాలు

నిరంకుశుడైన పాలకుడు గద్దెదిగితే సంతోషించాల్సిందే. అధికారం కోసం లక్షలాదిమందిని జైళ్ళలోకి నెట్టి, చిత్రహింసలుపెట్టి, ఊచకోతలు కోసినవాడైతే మరీనూ. నిర్దాక్షిణ్యంగా శత్రుసంహారం చేస్తూ దశాబ్దాలుగా అధికారాన్ని నిలబెట్టుకుంటూ వచ్చిన సిరియా అధ్యక్షుడు బషర్–అల్ అసద్ కోట ఇంత సునాయసంగా కూలుతుందని, పెళ్ళాం పిల్లలతో సహా పుతిన్ పంచన చేరుతాడని ఎవరూ అనుకొని వుండరు. అధికారంలో ఉన్నంతకాలం నియంతలను మించి నిరంకుశంగా కనిపించిన అసద్ ఇలా కూలిపోవడం, పిరికివాడిలాగా పారిపోవడం చాలామందికి నచ్చింది. అసద్ కుటుంబం ఉక్కుపిడికిలినుంచి ఐదు దశాబ్దాల తరువాత సిరియా బయటపడింది, నవశకం ఆరంభమవుతోంది. నిరంకుశపాలన అంతమైనందుకు సంతోషించాల్సిందే కానీ, రేపటిదాని ప్రయాణం ఏ దిశగా ఉంటుందన్నది భయపెడుతున్న ప్రశ్న.

నియంతృత్వం పోయినంతమాత్రాన ప్రజాస్వామ్యం నెలకొంటుందని హామీ ఏమీ లేదు. సిరియా మరో కొత్తసంక్షోభం వైపు ప్రయాణిస్తున్నదని, అది ప్రపంచానికి ప్రమాదం తేవచ్చునని కొందరు విశ్లేషకుల అభిప్రాయం. అసద్‌ను కూల్చడానికి అవసరార్థం ఒక్కటైన శక్తులన్నీ తమ దీర్ఘకాలిక ఎజెండాలు, ప్రయోజనాలను తాత్కాలికంగా పక్కనబెట్టి ఒక్కటిగా సాగే ప్రయత్నాలైతే చేస్తున్నాయి. ఎవరిపాత్ర ఎంతో నిర్దిష్టంగా నిర్వచించుకొని ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని, ఘర్షణలకు తావులేని పాలన అందిస్తామని, ప్రజాస్వామికంగా నడుస్తామని, పొరుగుదేశాల్లో కాళ్ళూవేళ్ళూ పెట్టబోమని తిరుగుబాటుదారులు ప్రపంచానికి హామీ ఇస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. అంతర్జాతీయ సమాజం ఆమోదంకోసం, అగ్రరాజ్యాల సాయం కోసం ఆ మాత్రం చేయవలసిందే. అసద్ నిష్క్రమణ పశ్చిమాసియాకు మాత్రమే కాక, యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేసే పరిణామం. ఇరాన్, హిజ్బొల్లా, రష్యా సాయంతో శత్రువులను దశాబ్దాలుగా తట్టుకొని నిలిచిన అసద్, ప్రధానంగా పుతిన్ వైఖరిలో మార్పుతో ఒక్కసారిగా ఒంటరి అయిపోయాడు. ఇరాన్ బలహీనపడటం, ఇజ్రాయెల్ బలపడటం, ఉక్రెయిన్ యుద్ధం ముగింపు, టర్కీనుంచి లక్షలాదిమంది శరణార్థులు తిరిగి సిరియాకు వెనక్కు పోవడం ఇత్యాది భావి పరిణామాలను విశ్లేషకులు అంచనావేస్తున్నారు.

భారత్–సిరియా మధ్య దౌత్యసంబంధాలు ఏర్పడి వచ్చే ఏడాదికి డెబ్బైఐదేళ్ళవుతాయి. 1957లో అమెరికా వెడుతూ మార్గమధ్యంలో నెహ్రూ సిరియాలో దిగితే, ఆ సందర్భంగా అక్కడ ఒక వీధికి ఆయన పేరుపెట్టిన గతాన్ని మీడియా ఇప్పుడు గుర్తుచేస్తోంది. లౌకికవాదానికి కట్టుబడిన అసద్ కుటుంబం అధికారంలో ఉన్నంతకాలం భారత దేశానికి తమనుంచి ఏ ఇబ్బందీ రానివ్వలేదు. కశ్మీర్‌సహా కీలకమైన విషయాల్లో అంతర్జాతీయ వేదికలమీద సైతం సిరియా మనపక్షాన నిలబడింది. కశ్మీర్‌కు ప్రత్యేకప్రతిపత్తిని తొలగించినప్పుడు కూడా అది భారత్ అంతర్గత విషయమని సిరియా తేల్చేసింది. అంతర్జాతీయ వేదికలమీద మనపై విరుచుకుపడే టర్కీ ఎర్దొగాన్ కంటే అసద్ ఉత్తమం. రష్యాతో మన సాన్నిహిత్యం వల్లనో, పుతిన్ కారణంగానో మన పక్షాన ఉంటూవచ్చిన సిరియా ఇప్పుడు ప్రధానంగా ఇస్లామిక్ స్టేట్ అనుబంధ సంస్థ (హెచ్‌టీఎస్) సహా వివిధ రకాలైన తిరుగుబాటుదారుల చేతుల్లోకి పోవడం ప్రమాదకరమే. అసద్‌కు వ్యతిరేకంగా పోరాడిన శక్తుల్లో పాకిస్థాన్‌నుంచి వెళ్ళిన కొన్ని ముఠాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి.


తనకు గ్లోబల్ ఎజెండాలు లేవని, సిరియాకు మాత్రమే పరిమితంగా కార్యకలాపాలు ఉంటాయని హెచ్‌టీఎస్ అంటున్నప్పటికీ, అది ఒక ఇస్లామిస్టు సంస్థ అన్నది నిజం. మానవ, మహిళా, మైనారిటీ హక్కులకు హామీ ఇస్తున్న ఆ సంస్థ అధికారంలో కుదురుకున్న తరువాత ఏ విధంగా వ్యవహరిస్తుందో చూడాలి. భిన్న మతాలు, తెగలు, విభజనలు ఉన్న సమాజాన్ని సయోధ్యతో కాక, అణచివేతతో ఏలాలని ప్రయత్నించిన అసద్ వంటివారు ఎప్పటికైనా కూలిపోక తప్పదు. అసద్ పతనం, అతడి విగ్రహాల కూల్చివేత తదితర దృశ్యాలు చూసిన వారికి ఇరాక్ గత పాలకుడు సద్దాం హుస్సేన్ గుర్తుకొచ్చాడు. అణ్వాయుధాలున్నాయన్న ఆరోపణతో, ఇరాక్‌లో చొరబడి సద్దాంను అమెరికా దించివేసిన అనంతరం పలు ఉగ్రసంస్థలు పడగవిప్పి ప్రపంచాన్ని వణికించిన విషయం తెలిసిందే. సిరియాలో అధికారమార్పిడి అలాంటి ఒక కొత్తసమస్య తెచ్చిపెట్టకపోతే అదేచాలు.

కాలం తాకిడిలో సోషలిజం స్ఫూర్తి

దేశ సర్వోన్నత న్యాయస్థానం – సుప్రీంకోర్టు రాజ్యాంగ వజ్రోత్సవం ముందురోజైన నవంబర్ 25న ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని చెప్పాలి. రాజ్యాంగం అవతారిక (ప్రియాంబుల్)లో 42వ సవరణ ద్వారా చేర్చిన సెక్యులర్, సోషలిస్ట్ పదాలను తొలగించాలంటూ దాఖలైన కేసును కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజయ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో.. ఆ రెండు పదాల స్ఫూర్తిపై గత కొంత కాలంగా కొందరు చేస్తున్న అసంబద్ధ వాదనలను, వారు వ్యాప్తి చేసిన అయోమయాన్ని పటాపంచలు చేసినట్లయింది.

దేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని అనుసరిస్తూ రాజ్యాంగ పీఠికలో 'సోషలిజం' అని, కొన్ని మతాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ 'సెక్యులర్' అని పేర్కొనడం హిపోక్రసీ (కపటత్వం) అని కొందరి వాదన. అందువల్ల ఆ రెండు పదాలను తొలగించాలంటూ 2020లో సుప్రీంకోర్టులో ఓ వ్యక్తి రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దానికి అనుబంధంగా మాజీ రాజ్యసభ సభ్యులు సుబ్రమణ్యస్వామి కూడా మరొక దావా వేశారు. ఈ రెండింటిని కలిపి విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం సరైన సమయంలో సరైన తీర్పును ఇచ్చింది.

తెలుగులో స్వామ్యవాదంగా పేర్కొనే సోషలిజం పెట్టుబడిదారీ విధానానికి పూర్తి వ్యతిరేకమని చాలామంది భావన. పెట్టుబడిదారీ విధానంలో సామాన్యులు నష్టపోతారని, సంపన్నులకే లాభం అని, అదే సోషలిస్ట్ సమాజంలో అయితే వర్గ విబేధాలు లేకుండా ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవిస్తారని అనేక సంవత్సరాలపాటు ప్రచారం జరిగిన మాట నిజం. నిజానికి 'సోషలిజం'కు విస్తృతార్థం ఉంది. దానిని గ్రహించలేనివారు దానిని తప్పుగా అన్వయించుకొని ఆ పదాన్ని, అదేవిధంగా సెక్యులర్ అనే పదాన్ని రాజ్యాంగ పీఠిక నుంచి తొలగించాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై తీర్పు వెలువరించిన న్యాయమూర్తులు సోషలిజం లేదా సోషలిస్ట్ అనే పదాల విస్తృతార్థాన్ని చక్కగా విడమర్చి వివరిస్తూ.. "సంక్షేమ రాజ్యానికి కట్టుబడి ఉండటం, సమాన అవకాశాలకు భరోసా ఇవ్వడం సోషలిజం విధానంగా చూడాలి. రాజ్యాంగ పీఠికలో 'సోషలిస్ట్' అనే పదం ఉన్నంత మాత్రాన ఏదో ఒక ప్రత్యేక ఆర్థిక విధానాన్ని అనుసరించాలని నిర్దేశించడం కాదు" అని చెప్పారు.



న్యాయకోవిదుడు నానీ పాల్కీవాలా చెప్పినట్లు 'సోషలిజం' 4 ప్రధాన లక్ష్యాలను నిర్దేశిస్తుంది. అవి : దేశ స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల, ప్రతి ఒక్క పౌరుడికి పని కల్పించడం, ఆదాయాల పంపిణీలో తగిన న్యాయం జరగడం, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడం. ఇదే భారత రాజ్యాంగ స్ఫూర్తి. ఈ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పనిచేసినప్పుడు ప్రతి ఒక్కరికీ ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం సమకూరుతుంది.

సోషలిజం అనే భావనను చాలామంది పొరపాటుగా అర్థం చేసుకోవడం వెనుక చారిత్రక నేపథ్యం ఉంది. ముఖ్యంగా, బ్రిటన్, అమెరికాలు అనుసరించిన ఆర్థిక విధానాన్ని పెట్టుబడిదారీ విధానంగా, సోవియట్ రష్యా అనుసరించిన విధానాన్ని సోషలిస్ట్ విధానంగా పిలుచుకోవడం జరిగింది. 20 శతాబ్ది ప్రథమార్థంలో, అంటే భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు, బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత్‌తోసహా ప్రపంచంలోని అనేక దేశాలు పలు పోరాటాలు చేశాయి. వర్ణవివక్ష, అణచివేత, హక్కుల ఉల్లంఘన, ఆర్థిక దోపిడీకి పాల్పడిన బ్రిటీష్ పాలకుల విధానాలను ఒక్క భారత్‌లోనే కాదు.. లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా దేశాలు అనేకం తీవ్రంగా వ్యతిరేకించాయి. అదే సమయంలో సోవియట్ రష్యాలో కార్మికవర్గం సంఘటితమై జరిగిన విప్లవం ఈ దేశాలకు స్ఫూర్తి నందించింది. పేదరికం, పీడన, బానిసత్వం వదిలించుకోవడానికి ఉద్యమాలే మార్గంగా భావించి ఆ బాటనే పట్టాయి. రెండవ ప్రపంచ యుద్ధంలో 'ఫాసిజం' ఓటమి చెందడంతో సోవియట్ రష్యా అనుసరించే సోషలిస్ట్ నమూనాకు తృతీయ ప్రపంచ దేశాలలో సానుకూలత వ్యక్తం అయింది. అదొక ఆదర్శవాద విధానంగా చూడబడింది. ఆ సమయంలోనే దేశంలో ఉవ్వెత్తున ఎగసిన జాతీయోద్యమంలో పాల్గొన్న వ్యక్తులు, పార్టీల కారణంగా పలు రకాల విధానాలు, పద్ధతులు కలగలిసినప్పటికీ ప్రధానంగా స్వామ్యవాద భావనలు, స్వామ్యవాద విలువలే ప్రజల్ని ఎక్కువగా ఆకర్షించాయి. జాతీయతా భావన అందరిలో పెల్లుబుకింది. స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమిక వహించిన కాంగ్రెస్ పార్టీ 1931లో చేసిన కరాచీ తీర్మానంలో చాలా స్పష్టంగా తమ విధానాన్ని ప్రకటించింది. దేశానికి స్వాతంత్ర్యం సాధించిన తర్వాత దేశ ప్రజల సామాజిక, ఆర్థిక సమానత్వానికి కట్టుబడి పని చేస్తామని తీర్మానించింది.

స్వతహాగా సోషలిస్ట్ భావాలు గలిగిన డా బి.ఆర్. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించే బాధ్యత స్వీకరించిన సందర్భంలో "దేశ ప్రజలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యల పరిష్కారానికి సోషలిజం నిజమైన ఔషధాన్ని అందించగలదు" అని అన్నారు. రాజ్యాంగ సభలో జరిగిన వాడివేడీ చర్చల సందర్భంగా డా బి.ఆర్. అంబేడ్కర్ తన వాదన వినిపిస్తూ "ఆర్థిక విధానం ఎంచుకొనే స్వేచ్ఛను ఇవ్వకుండా భవిష్యత్ తరాల చేతులు కట్టేయడం సరికాదు" అని అన్నారు. దేశ ప్రజలకు ఆర్థిక, సామాజిక న్యాయం చేయడం అనే లక్ష్యం సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయం ద్వారానే నెరవేరుతుంది కనుక ప్రత్యేకంగా 'సోషలిస్ట్' పదాన్ని రాజ్యాంగ పీఠికలో చేర్చలేదు. అయితే, ఎమర్జెన్సీ సమయంలో నాటి దేశ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ చొరవతో పార్లమెంట్ రాజ్యాంగానికి 42వ సవరణ చేసి రాజ్యాంగ పీఠికలో సెక్యులర్, సోషలిస్ట్ అనే పదాలు చేర్చారు. ఆ సవరణ జరిగిన 44 సంవత్సరాల తర్వాత రాజ్యాంగ పీఠికలో సెక్యులర్, సోషలిజం పదాలను చేర్చడాన్ని తప్పుపడుతూ 2020లో సుప్రీంకోర్టులో కేసు వేయడంతోనే మళ్లీ 'సోషలిజం' స్ఫూర్తిపై గత 4 ఏళ్లుగా చర్చలు, వాదోపవాదాలు చోటుచేసుకొన్నాయి.

ప్రముఖ న్యాయవాది నానీపాల్కీవాలా మన దేశంలో 'సోషలిజం' తప్పుగా బ్రాండ్ అయింది అని అన్నారు 1972లో. దేశంలోని పేదరికాన్ని సమానంగా పెంచడమే 'సోషలిజం'గా చెలామణి అవుతోందని వెటకారంగా అన్నారు. 'గరీబీ హటావో' (పేదరికాన్ని పారద్రోలాలి) అని ఇందిరాగాంధీ పిలుపునిస్తే.. కొందరు అమీరీ హటావో (సంపదను పారద్రోలాలి) అని అర్థం చేసుకొంటున్నారని నానీపాల్కీవాలా చమత్కరించారు.

దేశ స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దేశంలో 'మిశ్రమ ఆర్థిక వ్యవస్థ'కు బాటలు పర్చినప్పటికీ దశాబ్దాలపాటు దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి నామమాత్రంగానే పెరిగింది. నెహ్రూ అనుసరించిన విధానాన్ని కమ్యూనిస్టు పార్టీలు వ్యతిరేకించాయి. కమ్యూనిస్టు పార్టీ రెండుగా విడిపోయిన తర్వాత ఒకరు చైనా నమూనాను, మరొకరు సోవియట్ రష్యా నమూనాను సమర్థించారు. సోషలిజం విధానమే ఆదర్శప్రాయమైందన్న అభిప్రాయాన్ని కమ్యూనిస్టులు ప్రచారం చేశారు. 'సోషలిజం' పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకమని.. పెట్టుబడిదారీ వ్యవస్థలో పేదవాళ్ల శ్రమ దోపిడీకి గురవుతుందని బలమైన ప్రచారం జరిగింది. పరిశ్రమలన్నీ పెట్టుబడిదారీ యాజమాన్యం నుంచి కార్మికుల యాజమాన్యం క్రిందికి రావడమే సంపూర్ణ సోషలిజం లక్ష్యం అనే నినాదాలు దేశంలో చాలా కాలం వినిపించాయి. పరిశ్రమల్ని జాతీయం చేయాలని కొందరు కమ్యూనిస్టులు తరచుగా పిలుపునిచ్చేవారు. పెట్టుబడిదారీ వ్యవస్థను వ్యతిరేకించేవారందరూ అభ్యుదయ వాదులుగా పిలవబడ్డారు. సంపన్నులంతా దుర్మార్గులని, సామాన్యులు మంచివారనే నెరేటివ్‌లతో మెజార్టీ నవలలు, సినిమాలు కూడా వచ్చాయి. దీంతో సామాన్య ప్రజల్లో అనేక అపోహలు ఏర్పడ్డాయి.

అయితే, ఒక్క తూటా పేలకుండా, ఏ ఒక్క వ్యక్తి మరణించకుండా ఎప్పుడైతే సోషలిస్ట్ సోవియట్ యూనియన్ తనకుతానుగా కుప్పకూలిందో, అప్పట్నుంచీ సోవియట్ రష్యాలో అమలైన 'సోషలిజం' విధానాలకు నిజమైన అర్థమేమిటన్న అంతర్మథనం భారత్‌తో సహా చాలా దేశాలలో మొదలయింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో సోషలిస్టు దేశాల ఆర్థిక వ్యవస్థల్లోని లోపాలు అంతర్జాతీయ సమాజానికి వెల్లడయ్యాయి. దాంతో, ఏ దేశమూ తనకున్న పరిమిత ఆర్థిక వనరులతో అభివృద్ధి శిఖరాలు అధిరోహించలేదని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానం కావడం అనివార్యం అని చాలా దేశాలు గ్రహించాయి.

భారత్‌కు సంబంధించినంతవరకు 1991లో మొదలైన మొదటి దశ ఆర్థిక సంస్కరణలు దేశ ఆర్థికాభివృద్ధికి కీలకంగా పని చేశాయి. అప్పటివరకు దేశంలో రాజ్యమేలిన లైసెన్స్‌రాజ్‌కు మంగళం పాడి.. ప్రజలందరికీ సమాన అవకాశాలను పొందే విధంగా అనేక రంగాల ద్వారాలను తెరవడం జరిగింది. దాంతో ప్రజలకు నిత్యావసరాలుగా మారిన వంటగ్యాస్, టెలిఫోన్ సౌకర్యం వంటివి సామాన్యులకు సైతం దక్కాయి. అదే సమయంలో అందుబాటులోకి వచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం తోడు కావడంతో ఆర్థిక వ్యవస్థ గాడిలో పడి పరుగుపెట్టింది. దేశంలోకి పెట్టుబడులు రావాలని, పరిశ్రమల స్థాపన జరగాలని, దేశ సంపద పెరగాలని, పెరిగిన సంపద అన్ని వర్గాలకు చేరాలని.. అదే భారత రాజ్యాంగం ప్రవచించిన ఆర్థిక, సామాజిక న్యాయం అని పాలకులకు అర్థం అయింది. కనుకనే, దాదాపుగా అన్ని రాజకీయ పార్టీలు తమకు అధికారం ఇస్తే ఆ పంథానే అనుసరిస్తామని ఎన్నికలలో హామీలిస్తున్నాయి. అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలు హామీ ఇచ్చిన విధంగానే సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ.. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు ఇవ్వడంలో ఇంకా తాత్సారం చేస్తున్నాయి.

నానీ పాల్కీవాలా చెప్పినట్లు 'సోషలిజం' 4 ప్రధాన లక్ష్యాలను అందిస్తుంది. అవి – దేశ స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల, ప్రతి ఒక్క పౌరుడికి పని లభించడం, ఆదాయాల పంపిణీలో తగిన న్యాయం జరగడం, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడం. భారత రాజ్యాంగ స్ఫూర్తి ఇదే. ఈ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పనిచేసినప్పుడు దేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం జరిగి సంపూర్ణ సోషలిజం అమలవుతుంది.

▪ సి. రామచంద్రయ్య
ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడు

టీకప్పులో తుఫాను!

ప్రాంతం, భాష, కులం తదితర ప్రాతిపదికల మీద ఏర్పడే సంఘాలు ఎక్కడైనా సరే– తమ అస్తిత్వ పరిరక్షణ కోసం పుడతాయి. ఐక్యంగా ఉంటూ ఒకరికొకరు తోడుగా నిలవడం ద్వారా బలపడతాయి. ఆ సంఘాలు ఎదిగిన తర్వాత వాటి కార్యక్షేత్రం విస్తరిస్తుంది. అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం, తమ సంఘానికి మూలమైన లక్షణాన్ని మరింత సుసంపన్నం చేసుకునే దిశగా అడుగులు వేయడం చేస్తాయి. అమెరికాలో తెలుగువారు స్థిరపడడం మొదలైన తర్వాత, తమను తాము ఐక్యంగా ఉంచుకుంటూ, బలంగా ఆత్మవిశ్వాసంతో కనిపించడానికి తొలి తెలుగు సంఘంగా తానా (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) ఆవిర్భవించింది. తర్వాతి కాలంలో ఇతర సంఘాలు అనేకం యావత్తు అమెరికా కార్యక్షేత్రంగానూ, అమెరికాలో వివిధ ప్రాంతాలవారీగానూ కూడా పుట్టుకొచ్చాయి. అనేక తెలుగు సంఘాలు తమదైన మార్గాల్లో కార్యశీలతను నిరూపించుకుంటున్నాయి. అయితే అందరి సమష్టి లక్ష్యం మాత్రం ఒక్కటే. అమెరికాలోని తెలుగువారికి అండగా ఉండడం, అలాగే తెలుగు ప్రాంతాల్లో సుస్థిర అభివృద్ధికి తమవంతు చేయూతను అందించడం.

అమెరికాలోని తెలుగువారికి ఏ ఆపద వచ్చినా మొదటగా గుర్తుకు వచ్చేది తానా. ఇది అమెరికాలో ఆవిర్భవించిన తొలి తెలుగు సంస్థ. తొలినాటి నుంచి ఇవాళ్టివరకు అటు అమెరికాలోనూ, ఇటు తెలుగు నేల మీదా నిరుపమానమైన సేవలు అందిస్తూనే ఉంది. అలాంటి తానాలో నిధుల వినియోగానికి సంబంధించి ఇప్పుడు టీకప్పులో తుఫాను లాంటి ఒక వివాదం రేగింది. అది సర్దుకునే క్రమంలో యావత్ అమెరికాలోని తెలుగు సంఘాల మీద బురద చల్లి వికృతానందం పొందే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగు సంఘాల పాత్రను, సేవా ప్రస్థాన క్రమాన్ని గుర్తుచేసుకోవడం అవసరం.



'పళ్ల చెట్టుకే రాళ్ల దెబ్బలు' అని సామెత. పని చేసే సంఘాలకే చిన్న చిన్న ఇబ్బందులు కూడా ఎదురవుతుంటాయి. ఇటీవల తానాలో పుట్టిన నిధుల దుర్వినియోగపు దుమారం కూడా అలాంటిదే.

ఇక్కడి తెలుగువారికి అనేక రీతులుగా అండగా ఉండడంతో పాటూ, సామాజిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటూ– ప్రమాదవశాత్తూ తెలుగువారు ఎవరైనా వివిధ కారణాలతో చనిపోయినప్పుడు వారిని స్వదేశానికి పంపించడంలో అనేక సంవత్సరాలుగా తానా టీమ్ స్క్వేర్ చేస్తున్న కృషి ఎనలేనిది. బాధితులు దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు అందించే అనుపమాన సాయం ఇది. అదేవిధంగా తానా రెండు తెలుగు రాష్ట్రాలకు అనేక సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తున్నది. రహదారుల నిర్మాణం, పాఠశాలలకు కంప్యూటర్లు, ఉచిత వైద్యశిబిరాలు, చైతన్య స్రవంతి పేరుతో రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇలా అనేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అదేవిధంగా నాట్స్, ఆటా, నాటా మొదలైన తెలుగు సంస్థలు అమెరికాలో తెలుగు సంస్కృతిని కాపాడడంలో ఎనలేని కృషి చేస్తున్నాయి.

అమెరికాలోని తెలుగు సంఘాలు సాహిత్య, భాషాసేవలో చేస్తున్న కృషి ప్రత్యేకమైనది. ఈ విషయంలో తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న కృషి కంటె విశిష్టమైన కృషి అమెరికాలోని ఈ తెలుగు సంఘాలు నిర్వహిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. తానా అమెరికాలోని విద్యార్థులకు తెలుగు నేర్పడానికి తానా పాఠశాలను నిర్వహిస్తోంది. కళాశాల పేరుతో కర్ణాటక సంగీతం, కూచిపూడి, భరతనాట్యం మొదలైన సాంప్రదాయ నృత్యాలను నేర్పిస్తున్నారు.

చిన్న పిల్లలకు తెలుగు భాషలో శిక్షణ ఇవ్వడంలో సిలికానాంధ్ర చేస్తున్న ప్రయత్నాల్ని, నిర్వహిస్తున్న పాఠశాలల్ని ప్రత్యేకంగా ప్రస్తావించాలి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎల్‌కేజీ నుంచి పూర్తిగా ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో చదువుతూ పిల్లలు తెలుగు భాషకు దూరమవుతున్న పరిస్థితిలో– అమెరికాలో సిలికానాంధ్ర నిర్వహిస్తున్న పాఠశాలలు ఆ పాత్రను నిర్వర్తిస్తున్నాయి. అమెరికాలోని భవిష్యత్తరాలకు చెందిన ఏ తెలుగు యువతరం పూర్తిగా తెలుగు భాషకు దూరం కాకూడదనే సంకల్పంతో సిలికానాంధ్ర ఇలాంటి తెలుగు భాషా పాఠశాలలను నిర్వహిస్తోంది.

సాహిత్య సేవలో కూడా అమెరికాలోని ప్రతి తెలుగు సంఘమూ ఏదో ఒక స్థాయిలో తమ పాత్రను నిర్వర్తిస్తూనే ఉన్నది. తానా, ఆటా సంస్థలు ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే తెలుగు నవలల పోటీలు ఇప్పటి దాకా ప్రపంచవ్యాప్తంగా అతి ప్రతిష్ఠాత్మకమైన నవలల పోటీలుగా గుర్తింపు తెచ్చుకున్నాయి. తెలుగు నవలకు అత్యధిక పారితోషికం ప్రకటించి పోటీలు నిర్వహిస్తున్న సంస్థలు కూడా ఇవే. వీరి ప్రయత్నాల ద్వారా ప్రతి ఏడాదీ తెలుగులో అత్యుత్తమ నవలా సాహిత్యం క్రమం తప్పకుండా వెలుగులోకి వస్తున్నదంటే అతిశయోక్తి కాదు. నాటా వంటి అనేక సంస్థలు తమ వార్షికోత్సవాల సందర్భంగా పోటీలు నిర్వహించి ఉత్తమ సాహిత్యానికి పురస్కారాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నాయి. తెల్సా వంటి సంస్థ లక్ష రూపాయల విలువైన బహుమతులతో పోటీలు ప్రకటించి తీరా పోటీలు పూర్తయిన సమయానికి మూడు లక్షల రూపాయల విలువైన బహుమతులు ఇవ్వడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. కొన్ని సంస్థలు కేవలం భారత్‌కు వెలుపల ఉన్న తెలుగు సాహిత్యకారుల నుంచి మాత్రమే రచనల్ని ఆహ్వానిస్తూ పోటీలు నిర్వహిస్తున్నాయి. తద్వారా విదేశాలలో స్థిరపడిన తెలుగు సాహిత్యాసక్తి గలవారిలో సృజన ఎప్పటికీ పలచబడిపోకుండా కాపాడుతున్నాయి.

తెలుగు సంఘాలు కళా సాంస్కృతిక రంగాల్లో అందిస్తున్న సేవలది ఒక ప్రత్యేక అధ్యాయం. గిన్నిస్ బుక్ రికార్డులు సాధించే స్థాయిలో కూచిపూడి నృత్య భారీ ప్రదర్శనలు ఏర్పాటు చేసిన ఘనత సిలికానాంధ్రదే. భరతనాట్యం, కూచిపూడి, శాస్త్రీయ సంగీతం నేర్చుకోదలచిన అమెరికాలోని వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. అలాగే నేర్చుకున్నవారు ప్రదర్శనలు ఇవ్వడానికి తెలుగు సంఘాలే ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాయి. అమెరికాలో ఏ తెలుగు సంఘం వార్షికోత్సవాలు, వేడుకలు జరిగినా సరే తెలుగు ప్రాంతాల నుంచి కళాకారులను పిలిపించడం, వారి ప్రదర్శనలను ఏర్పాటు చేయడం అనేది ఒక సాంప్రదాయంగా కొనసాగుతోంది. కేవలం శాస్త్రీయ కళలు మాత్రమే కాదు, జానపద కళారూపాలకు కూడా అమెరికాలోని తెలుగు సంఘాల నుంచి అందుతున్న ప్రోత్సాహం అనల్పమైనది.

'పళ్ల చెట్టుకే రాళ్ల దెబ్బలు' అని సామెత. పనిచేసే సంఘాలకే చిన్న చిన్న ఇబ్బందులు కూడా ఎదురవుతుంటాయి. ఇప్పుడు తానాలో పుట్టిన నిధుల దుర్వినియోగపు దుమారం కూడా అలాంటిదే. కొన్ని సంఘాలలో కొందరివల్ల చిన్న చిన్న ఆటంకాలు కొన్నిసార్లు కలుగుతాయి. వాటి గురించి ఎక్కువగా భయపడడం మంచిది కాదు. వ్యక్తుల వల్ల ఏర్పడే ఒడిదొడుకుల వల్ల తెలుగు సంఘల ప్రతిష్ఠకు, మనుగడకు ఎలాంటి ప్రమాదం లేదు.

○ కృష్ణమోహన్ దాసరి
జర్నలిస్టు, డల్లాస్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్ editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

హక్కుల దన్నుతోనే ఆత్మగౌరవం

ఈ ఏడాది 'అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం'ను "మన హక్కులు, మన భవిష్యత్తు" అనే నినాదంతో జరుపుకుంటున్నారు. కులం ఆధారంగా మనుషులపై వివక్ష చూపడం భారతదేశంలో శతాబ్దాలుగా కొనసాగింది. ఇప్పటికీ జైల్లో కూడా కుల వివక్షత కొనసాగుతుంది. ఈ విషయాన్ని ఇటీవల సుప్రీంకోర్టు తప్పుపట్టింది. షెడ్యూల్డ్ కులాల ఖైదీల చేతనే మరుగుదొడ్లు కడిగించడం, ట్యాంకులు శుభ్రం చేయించడం వంటి పనులు చేయించడంపై ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అగ్ర కులాల ఖైదీలకు సులభమైన వంట పనులు అప్పగించడం ముమ్మాటికీ వివక్షే అవుతుందని పేర్కొన్నది. అలాగే దేశంలో స్త్రీలు, బాలికలు, వృద్ధులపై హింస పెరుగుతున్నదని నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో పేర్కొనడం ఆందోళనకరం. భారత్‌లో మానవ హక్కుల కమిషన్ మరింత సమర్థవంతంగా పనిచేయాలి. కాలం చెల్లిన చీకటి చట్టాలు, సెక్షన్ల వలన ప్రజల వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కలుగుతుంది. కావున, వీటిని పునఃసమీక్షించి రద్దు చేయాలి. ప్రభుత్వాలు ప్రజాస్వామ్యిక వాతావరణాన్ని ప్రోత్సహించాలి. అప్పుడే హక్కులు కాపాడబడి, ప్రజలు ఆత్మగౌరవంతో జీవించగలరు.

– ఎస్. విశ్వతేజ
సామాజిక కార్యకర్త

(నేడు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం)

భూమాఫియాకు వరంగా 'అసైన్మెంట్' చట్టసవరణ!

వ్యవసాయానికి పనికివచ్చే ప్రభుత్వ బంజరు భూములను గ్రామీణ పేదలకు ఇచ్చే పట్టాలను 'అసైన్మెంట్ పట్టా' అంటారు. దీనికి రెవెన్యూ శాఖ వారి తెలుగు పేరు 'అతుకుబడి పట్టా'. తెలంగాణలో 'లావని పట్టా', రాయలసీమలో 'డీఎమ్‌కె పట్టా', కోస్తా ఆంధ్రలో 'డీ ఫారం పట్టా' అని పేర్లు.

జిరాయితీ పట్టా లేక ప్రైవేటు పట్టాకూ, డీ–ఫారం పట్టాకూ తేడా ఏమిటి? దస్తావేజు లేఖకుల పరిభాషలో చెప్పాలంటే జిరాయితీ పట్టాదారుకు 'దాన, విక్రయాది సమస్త హక్కులు' ఉంటాయి. అతుకుబడి పట్టాదారుకు అనుభవ హక్కు తప్ప మరే హక్కులు ఉండవు. అతుకుబడి పట్టా అనేది షరతులతో ఇచ్చే పట్టా. అవి ఆ పట్టాలోనే ఉంటాయి. అందులో ఈ మూడు ముఖ్యమైనవి: 1) పట్టాదారు వంశపారంపర్యంగా అనుభవించాలి, అన్యాక్రాంతం చేయరాదు. 2) ప్రభుత్వానికి అవసరమైనప్పుడు నష్టపరిహారం చెల్లించకుండానే భూమిని స్వాధీనం చేసుకోవచ్చు 3) తప్పుడు సమాచారం, నిబంధనలకు విరుద్ధంగా ఇవ్వబడిందని రుజువైతే పట్టా రద్దు చేయవచ్చును.

ప్రభుత్వ బంజరు భూమిని ఎవరికి ఇవ్వాలి, ఎలా మంజూరు చేయాలి అన్నదానికి సంబంధించిన పద్ధతులు బ్రిటిష్ హయాంలో రూపొందిన బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్‌లో వున్నాయి. ఇవి కార్యనిర్వాహక ఆదేశాలు. ప్రభుత్వ భూములను సాగుకు ఇవ్వడం ద్వారా భూమి శిస్తు పెంచుకోవడం బ్రిటిష్ పాలకుల ప్రధాన లక్ష్యం. అదే సమయంలో సామాజిక న్యాయ కోణాన్ని కూడా వారు పాటించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ భూమిని వ్యవసాయ కూలీలు, ముఖ్యంగా దళిత వర్గాలకు మంజూరు చేయడానికి స్టాండింగ్ ఆర్డర్స్‌లో తగిన ఏర్పాటు చేశారు. తమ నేతృత్వంలో సర్వే సెటిల్మెంట్స్ జరిగిన (రైత్వారీ/ప్రభుత్వ) గ్రామాలలో కొన్ని భూములను దళిత వర్గాలకు 'రిజర్వు' చేశారు కూడా. షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) అని ఇప్పుడు పిలుస్తున్న వారిని అప్పుడు డిప్రెస్డ్ క్లాసెస్ (డీసీ) అన్నారు. సెటిల్మెంట్ రికార్డులలో భూములను 'డీసీ రిజర్వుడ్' అంటూ కేటాయించారు. ఆ భూములను వారికి మాత్రమే మంజూరు చేయాలని దాని అర్థం. వాటికి 'పంచమి భూములు' అని కూడా పేరు.

(ఉమ్మడి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదలకు భూముల పంపిణీ జరిగిందంటే, అది భూసంస్కరణల ద్వారా భూస్వాముల నుంచి మిగులు భూములు స్వాధీనం చేసుకుని చేసినది కాదు, తమ స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూముల పంపిణీ ద్వారానే జరిగింది. కోనేరు రంగారావు కమిటీ, 1960 నుంచి లెక్కగట్టి ఉమ్మడి రాష్ట్రంలో 64 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి పంపిణీ జరిగినట్లుగా గుర్తించింది.

అతుకుబడి పట్టాలో అన్యాక్రాంతం చేయరాదన్న షరతు వున్నప్పటికీ పేదల నుంచి భూములు పెద్దవారి చేతికి వెళ్తున్నాయని ప్రభుత్వ పెద్దలు గుర్తించి, దానిని అరికట్టడానికి 1977లో అసైన్మెంట్ భూముల బదలాయింపు నిషేధ చట్టాన్ని తెచ్చారు. ఈ చట్టంలో 'అన్యాక్రాంతం' అనే మాటను నిర్వచించారు. కొనుగోలు, తనఖా, కౌలు, కానుక, మార్పిడి, మరే రూపంలో జరిగిన అది అన్యాక్రాంతమే, అది చెల్లదన్నారు. చట్టానికి విరుద్ధంగా అన్యాక్రాంతం పొందిన వ్యక్తికి రెండు వేల రూపాయల జరిమానా, ఆరు నెలలు జైలు అని కూడా అన్నారు.

ప్రభుత్వ బంజరు భూములతో పాటు, వ్యవసాయ కమతాల గరిష్ఠ పరిమిత చట్టం కింద స్వాధీనం చేసుకుని పంచిన భూములు కూడా అతుకుబడి పట్టా భూములే. కోనేరు నివేదిక ప్రకారం అవి 5 లక్షల 82 వేల ఎకరాలు. ప్రభుత్వ భూమి, సీలింగ్ మిగులు భూములు రెండు కలిపితే (ఉమ్మడి రాష్ట్రం లెక్క ప్రకారం) సుమారుగా 70 లక్షల ఎకరాలు అతుకుబడి పట్టా రూపంలో పేదల చేతిలో ఉంది, ఉండాలి. అన్యాక్రాంతం చేయరాదని పట్టాలో ఉన్నా, 1977లో చట్టం వచ్చినా అది ఎన్నడూ ఆగలేదు. అతుకుబడి పట్టా భూములలో 'గణనీయమైన భాగం అన్యాక్రాంతం' అయ్యిందని కోనేరు కమిటీ అన్నది. చట్టం వచ్చిన ఈ 47 ఏళ్లలో ఎందరికి ఆరునెలల జైలు శిక్ష పడింది?

1977 నుండి 2008 వరకు 30 సంవత్సరాలలో ఈ చట్టంలో ఎలాంటి మార్పులు లేవు (అమలు కూడా లేదు!). 2008 నుంచి 2023 మధ్యలో ఐదుసార్లు సవరించారు. 2008లో రాజశేఖర్‌రెడ్డి మొదటి సవరణలు తెస్తే, 2023లో సవరణ తెచ్చింది వారి సుపుత్రుడు జగన్మోహన్‌రెడ్డి. ఈ మార్పులన్నీ చట్టాన్ని పటిష్టం చేసి పేదల భూములు కాపాడటం కోసం జరిగినవి కాదు. 1977లోని ఆరు నెలల జైలు, రెండు వేలు జరిమానాలను ఏ సవరణ చట్టమూ పెంచలేదు. 2023 తాజా సవరణ గురించి ఇప్పుడు చూద్దాం.

జగన్మోహన్‌రెడ్డికి ఎవరైన సలహా ఇచ్చారో లేక ఆయన పుర్రెకే పుట్టిందో, అతుకుబడి పట్టా భూములను అమ్ముకోవడానికి, పెద్దవారు ఎలాంటి ఆటంకమూ భయ సంకోచాల్లేకుండా భూములను కొట్టేయడానికి ఒక స్కీం తెచ్చారు. దాన్ని 'ఫ్రీ హోల్డ్ రైట్స్' అన్నారు (ఇలాంటి పేర్లు ఎలా తడతాయో!). మరి ఏమి కొంపలు మునిగిపోతున్నాయనో, ఈ 2023 సవరణను ముందు ఆర్డినెన్స్‌గా తెచ్చారు. అతుకుబడి పట్టా భూములను లాగేయడానికి ఇక ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకూడదని ఏలిన వారి ఉద్దేశం కావచ్చు. ఆర్డినెన్స్ గెజిట్‌లో ప్రకటితమైన తేదీ 31-07-2023 నుండి ఇరవై సంవత్సరాల వెనక్కి, అనగా తేదీ 31-07-2003కి ముందు ఇచ్చిన డీ ఫారం పట్టా భూములను కొనుగోలు చేసుకోవచ్చు.

1977 చట్టం ప్రత్యేకత ఏమిటంటే, చట్టం వెనుక కాలానికి కూడా వర్తిస్తుంది. అతుకుబడి పట్టా భూముల అన్యాక్రాంతాన్ని చట్టం నిషేధించడంతో బాటు నేరంగా కూడా ప్రకటించిందని ముందు చెప్పుకున్నాం. అయితే 1977కు ముందు అమ్మకం జరిగి, కొన్నవారు కూడా పేదవారై ఉండి, మోసం, దగా చేయకుండా, సదుద్దేశంతో (good faith), సరైన నగదు చెల్లించి (valuable consideration) కొనుగోలు చేసి ఉంటే దానికి మాత్రం చట్టం నుంచి మినహాయింపు ఉంది. అది కూడా విచారణలో ఆ సంగతులు నిరూపణ అయిన తరువాత. 1977కు ముందు భూమిని కొన్న ఆ పేదవాడు అతుకుబడి పట్టాదారవుతాడా లేక సమస్త హక్కులుగల జిరాయితీ పట్టాదారవుతాడా? అతను కూడా డీ ఫారం పట్టాదారే అవుతాడు. డీ ఫారం పట్టాలోని షరతులన్నీ తుచ తప్పకుండా అతడికి వర్తిస్తాయి.

జగన్మోహన్‌రెడ్డికి ఎవరైనా సలహా ఇచ్చారో లేక ఆయన పుర్రెకే పుట్టిందో, అతుకుబడి పట్టా భూములను అమ్ముకోవడానికి, పెద్దవారు ఎలాంటి ఆటంకమూ భయ సంకోచాల్లేకుండా భూములను కొట్టేయడానికి ఒక స్కీం తెచ్చారు. దాన్ని 'ఫ్రీ హోల్డ్ రైట్స్' అన్నారు. భూమిని కొన్నవాడికి లేదా కొందాం అనుకున్నవాడికి – ప్రభుత్వ అధికారులకూ మధ్య వ్యవహారంగా దీన్ని మార్చేసారు. డీ పట్టా భూములను అదివరకే కొనుగోలు చేసినవారు, మండల స్థాయిలో భూ మాఫియా ఇక రంగంలోకి దిగిపోయారు. ఇది నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకునే పథకంలా మారింది.



డీ ఫారం పట్టా భూములకు పూర్తి హక్కులు ఇవ్వాలంటే, ఇరవై సంవత్సరాల కిందట ఇచ్చిన అతుకుబడి పట్టాలను ముందుగా గుర్తించాలి. మండల రెవిన్యూ కార్యాలయాలలో రికార్డుల స్థితిగతులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కొందరు కలెక్టర్లు ఇదే విషయాన్ని ప్రభుత్వం వారికి చెప్పుకున్నారు కూడా. అసైన్మెంట్ తేదీ నిర్ధారణకు కీలకమైన డీ.ఆర్. ఫైల్స్ కనబడటం లేదని వారు వాపోయారు. నిజానికి చట్ట సవరణ లక్షలాది గ్రామీణ పేద కుటుంబాలతో ముడిపడి ఉన్న విషయం. గత ప్రభుత్వంలో పెద్దలు వారిలోవారు మాట్లాడుకుని సవరణ చట్టం తెచ్చేశారు. పౌర సమాజంతో, గ్రామీణ పేదలతో పనిచేస్తున్న వారిని కనీసం సంప్రదించే ఆసక్తిని కూడా చూపలేదు.


భూమి శిస్తు కమిషనర్ జిల్లా కలెక్టర్లు ఇచ్చిన ఆదేశాల ప్రకారం, 'ఫ్రీ హోల్డ్ రైట్స్' ఇవ్వాలంటే, 1) 31-07-2003కు ముందు అతుకుబడి పట్టా ఇచ్చి ఉండాలి 2) ఇప్పటికీ ఆ పట్టాదారు లేదా అతని/ ఆమె చట్టబద్ధ వారసులే సాగు అనుభవంలో వుండాలి. రికార్డులు అలా లేవు. సాగుబడి రిజిస్టర్‌లో వాస్తవ సాగుదారుల నమోదు ఆగిపోయి ఏళ్లు గడిచిపోయింది.

'ఫ్రీ హోల్డ్ రైట్స్' విషయంలో అతుకుబడి పట్టదార్ల నుండి దరఖాస్తులు అడగలేదు. మీ భూమికి పూర్తి హక్కులు ఇచ్చామంటూ వారి చేతిలో ఎలాంటి రికార్డు పెట్టలేదు. ఆలా చేసినా వారికి సమాచారం తెలిసేది. అలా గాకుండా సబ్–రిజిస్ట్రార్ కార్యాలయంలోని 22ఎ అనే నిషేధ జాబితా నుంచి 'ఫ్రీ హోల్డ్ రైట్స్' సర్వే నెంబర్లు తీసేయమన్నారు. అంటే భూమిని కొన్నవాడికి లేదా కొందాం అనుకున్నవాడికి – ప్రభుత్వ అధికారులకూ మధ్య వ్యవహారంగా దీన్ని మార్చేసారు. డీ పట్టా భూములను అదివరకే కొనుగోలు చేసినవారు, మండల స్థాయిలో భూ మాఫియా ఇక రంగంలోకి దిగిపోయారు. ఇది నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకునే పథకంలా మారింది. ఈ ప్రభుత్వం కొన్ని జిల్లాలలో కలెక్టర్లతో ప్రాథమిక విచారణ జరిపించింది. ఇది స్వతంత్ర విచారణ కాదు. అయినా పెద్ద సంఖ్యలో అవకతవకలు జరిగాయని కలెక్టర్లు నివేదికలు ఇచ్చారు.

అతుకుబడి పట్టాలకు పూర్తిస్థాయి (జిరాయితీ) పట్టా హక్కులు ఇవ్వడంపై, సామాజిక కార్యకర్తలు, గ్రామీణ కార్మిక సంఘాలలో భిన్నాభిప్రాయలు ఉన్నాయి. అలా ఇస్తే పేదల భూములు వారి చేతి నుంచి పోతాయని కొందరూ, డీ– పట్టాదారు ఎన్ని దశాబ్దాలైన పూర్తి హక్కులు లేకుండా అలానే ఉండిపోవాలా అని మరికొందరు స్పందించారు. వ్యవసాయం గిట్టుబాటు కావటంలేదు, నగదు అవసరాలు పెరిగాయి, వ్యవసాయేతర ఉపాధులపై ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందు పెడుతున్న కొన్ని సూచనలు ఇలా ఉన్నాయి:

1) అతుకుబడి పట్టాలు ఉన్న వారిని ఆధారాలతో దరఖాస్తు చేసుకోమని కోరాలి. వారికి విషయం తెలుస్తుంది. 2) ప్రతి దరఖాస్తుకు ఒక శాశ్వత (ఆర్‌సీ) ఫైల్ తెరవండి. అందులో వీఆర్వో, ఆర్ఐ, మండల సర్వేయర్ల నివేదికలు, తహసీల్దార్ ఆదేశాలు ఉండాలి. 3) ప్రతి కేసులోను తహసీల్దార్ స్పీకింగ్ ఆర్డర్, ఇంక సంతకంతో ఇవ్వాలి. 4) ప్రభుత్వం డీ – పట్టాదారుకు తన వద్ద ఉన్న టైటిల్‌ను రిజిస్టర్ చేసి ఇవ్వాలి. 5) అతుకుబడి పట్టా స్థానంలో కొత్త పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడ్ పట్టాదారుకు ఇవ్వండి. 6) ఫ్రీ హోల్డ్ రైట్స్ ఇచ్చిన భూములను అమ్ముకోవాలంటే, కనీసం మొదటి రిజిస్ట్రేషన్‌కు ఆర్డీఓ/ సబ్ కలెక్టర్ స్థాయి అధికారి, పట్టాదారు సమ్మతితో జరుగుతున్నట్లుగా నిర్ధారించాలి (ఏజెన్సీ ప్రాంతాల భూ బదలాయింపు నిషేధ చట్టం 1917లో ఉన్న ఏర్పాటు లాంటిది) 7) ఆదివాసీలు ఉన్న రెవిన్యూ గ్రామాలలో 'ఫ్రీ హోల్డ్ రైట్స్' ఇచ్చే సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

• పి.ఎస్. అజయ్‌కుమార్



ఎంత ఘాటు ప్రేమో..



దుర్గగుడి ఘాట్‌రోడ్డు టోల్, పార్కింగ్‌లో కాంట్రాక్టర్‌కు అధికారుల దాసోహం

- రెండేళ్లకు టెండర్.. ఒక ఏడాదే చెల్లింపులు
- మరో ఏడాది ఉచితంగా నెట్టుకొచ్చే ప్రయత్నాలు
- దేవస్థానానికి కాంట్రాక్టర్ చెల్లించాల్సినది రూ.2.06 కోట్లు
- ఈ చెల్లింపులేమీ లేకుండా 'ఉచిత' అవకాశం
- ఆరు నెలల ఉచితంతో పాటు కార్పొరేషన్ స్థలంలో పార్కింగ్ ఫ్రీ
- స్వయంగా దేవదాయ కమిషనర్‌కు దుర్గగుడి అధికారుల లేఖ
- తాజాగా మరో రెండు నెలలు ఉచితం కావాలట..!



శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం టోల్‌గేట్, పార్కింగ్ వసూలు కాంట్రాక్ట్ సంస్థపై అధికారులు 'ఘాటు'ప్రేమను చూపిస్తున్నారు. దేవస్థానానికి చెల్లించాల్సిన సొమ్మును ముక్కుపిండి వసూలు చేయాల్సిన అధికారులు.. కాంట్రాక్ట్ సంస్థపై ప్రేమను పెంచుకుని 'ఉచిత' వెసులుబాటు కల్పించారు. కాంట్రాక్ట్ నిర్వాహకులు చేసిన ప్రతిపాదనలను పరిశీలించుకోకుండా, వాటిపై పునరాలోచన లేకుండా తలలూపడమే కాదు.. సదరు ప్రతిపాదనలను కమిషనర్ కార్యాలయానికి పంపి ఆమోదముద్ర కూడా వేయిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కనకదుర్గానగర్‌లోని పార్కింగ్, ఘాట్‌రోడ్డు టోల్ వసూలు కాంట్రాక్టును దక్కించుకున్న సంస్థపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారుతోంది. ఘాట్‌రోడ్డులో ఓం మలుపునకు ముందు, కనకదుర్గానగర్‌లో వాహనాల పార్కింగ్‌ను కాంట్రాక్టుకు ఇస్తుంటారు. దీనికి 2023, మార్చి 15న నోటిఫికేషన్ ఇచ్చారు. 27న ఈ-టెండర్లు, సీల్డు టెండర్లు, బహిరంగ వేలం నిర్వహించారు. నోటిఫికేషన్‌లో మొత్తం 34 షరతులు పెట్టారు. రెండేళ్ల కాలపరిమితికి టెండర్ నిర్వహించారు. సీల్డు టెండర్‌లో నగరానికి చెందిన వీఎల్‌డీ ఏజెన్సీ అధినేత పీవీఎల్ దేవి రూ.కోటీ58లక్షల99వేల999కు టెండరును దక్కించుకున్నారు. దీనికి 18 శాతం జీఎస్టీ కలిపి రూ.కోటీ87లక్షల61వేల998 చెల్లించాలి. ఈ మొత్తం చెల్లించాకే అధికారులు పార్కింగ్ ఫీజు వసూలుకు ఆదేశాలిస్తారు. రెండో సంవత్సరం అప్పటి వరకు చెల్లించిన మొత్తానికి పదిశాతం పెంచి, 18 శాతం జీఎస్టీని కలిపి చెల్లించాలి. రెండో ఏడాది రూ.కోటీ74లక్షల89వేల998, 18 శాతం జీఎస్టీ రూ.31లక్షల48వేల199వేలు కలిపి మొత్తం రూ.2కోట్ల06లక్షల38వేల197 చెల్లించాలి. ఇక్కడే కాంట్రాక్టర్ అతి తెలివి ఉపయోగించారు.

షరతులు ఉల్లంఘించి..

టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసే సమయంలో అందులో పాల్గొనే

మిగతా 6లో..

స్థలంతో పాటు ఆరు నెలలు ఉచితంగా..

పార్కింగ్ కాంట్రాక్టు రెండేళ్ల మొత్తంలో ఒక ఏడాది సొమ్మును దేవస్థానానికి చెల్లించిన కాంట్రాక్టర్ రెండో ఏడాది చెల్లించాల్సిన మొత్తానికి పంగనామాలు పెట్టి, ఉచితంగా కాలం గడిపేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో కాంట్రాక్టర్ వేసిన స్కెచ్‌ను అధికారులు అమలు చేస్తున్నారు. కాంట్రాక్టర్ దేవి రెండో ఏడాది రూ.2కోట్ల06లక్షల38వేల197 చెల్లించాలి. ఈ మొత్తాన్ని చెల్లించమని అధికారులు పలుమార్లు అడిగారు. ఒకసారి నోటీసు జారీ చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. కొద్దినెలల క్రితం కాంట్రాక్టర్ అధికారుల వద్దకు వెళ్లి ఓ ప్రతిపాదన చేశారు. కొండచరియలు విరిగినప్పుడు ఘాట్‌రోడ్డును మూసివేశారని, కనకదుర్గానగర్‌లో అభివృద్ధి పనులు చేపట్టడం వల్ల పార్కింగ్ ప్రదేశం తగ్గిపోయిందని అధికారులకు విన్నవించారు. దీనివల్ల మొదటి ఏడాది బాగా నష్టపోయామని చెప్పుకొచ్చారు. కాబట్టి తనకు ఆరు నెలల ఉచిత అవకాశం ఇప్పించాలని విన్నవించుకున్నారు. ఈ విషయాన్ని అధికారులు ఆగమేఘాలపై దేవదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రూపంలో తెలియజేశారు. వివిధ కారణాల రీత్యా ఘాట్‌రోడ్డును నాలుగు నెలలు మూసివేశామని, కాబట్టి కాంట్రాక్టర్‌కు ఆరు నెలలు ఉచితం ఇవ్వాలని ప్రతిపాదన పంపారు. ఇందుకు అధికారులే ఆమోదముద్ర వేయించారు. గత జూన్ ఒకటో తేదీ నుంచి నవంబరు 30 వరకు దేవస్థానానికి రూపాయి చెల్లించకుండా పార్కింగ్‌ను నిర్వహించుకోవచ్చని దుర్గగుడి అధికారులు సెప్టెంబరు 9న ఉత్తర్వులు ఇచ్చారు. కనకదుర్గానగర్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నందున సీతమ్మవారి పాదాల వద్ద ఉన్న వీఎంసీకి చెందిన ఖాళీ స్థలాన్ని కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఇక్కడ పార్కింగ్‌ను నిర్వహించుకునేలా వీఎంసీ అధికారులతో దుర్గగుడి అధికారులే మాట్లాడటం గమనార్హం. సరిగ్గా ఆరు నెలల ఉచిత గడువు ముగుస్తుందన్న సమయానికి కాంట్రాక్టర్ మరో ప్రతిపాదనను అధికారుల ముందు ఉంచారు. తనకు మరో రెండు నెలల ఉచిత గడువు కావాలని కోరారు. అప్పటికే ఆరు నెలలు ఉచితంగా ఇచ్చిన విషయం బయటపడటంతో రెండు నెలలు పొడిగించడానికి అధికారులు తటపటాయిస్తున్నారు. ఇక కాంట్రాక్టర్ కోర్టు మెట్లెక్కి.. గడువు ముగిసినా పార్కింగ్‌పై కాసులను వెనుకేసుకుంటున్నారు. అయినా దేవస్థానం అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కోర్టులో దీనిపై కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయలేదు.

సాగర్ కమిటీ చైర్మన్ పీఠంపై ఉత్కంఠ

- జిల్లాలోనే అత్యధిక కమిటీలు, డీసీలు
- చైర్మన్ పదవిపై కన్నెత్తి చూడని జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సీనియర్లు

89 మంది మహిళల మిస్సింగ్ కేసులు నెల రోజుల్లో పరిష్కారం

- సీపీ రాజశేఖరబాబు

8లో

ప్రతి ఇల్లూ సూర్య ఘర్ కావాలి

పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై సమీక్షలో కలెక్టర్

ఐదు ఆదర్శ గ్రామాల గుర్తింపు.. వెల్లడి

6లో



● సంప్రదాయ కట్టు.. అదిరేట్టు..



నగరంలోని సిద్దార్థ మహిళా కళాశాలలో ఫెట్-2024 కార్యక్రమం సోమవారం సందడిగా జరిగింది. పలు పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మోడరన్ దుస్తులతో పాటు సంప్రదాయ కట్టూ బొట్టుతో ర్యాంప్‌వాక్ చేసి ఆకట్టుకున్నారు.

అర్ధరాత్రి అక్రమాలు



వరదలకు జారిపడిన జక్కంపూడి కొండచరియలు స్వాహా

- వైసీపీ హయాంలోని అక్రమార్కులే సూత్రధారులు
- అర్ధరాత్రి రహస్యంగా తరలింపు
- రియల్ వెంచర్లకు విక్రయం
- అడ్డుకున్న షాబాద గ్రామస్తులు
- రెవెన్యూ తనిఖీలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బుడమేరు వరదల కారణంగా విరిగిపడిన జక్కంపూడి కొండచరియలను కూడా అక్రమార్కులు వదలట్లేదు. అనుమతులు లేకున్నా రాత్రికిరాత్రే గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎవరైతే అక్రమంగా గ్రావెల్ దందా సాగించారో వారే ఈ తంతు నిర్వహించారు. ఓపక్క క్వారీలపై ఆడిట్ పూర్తయ్యే వరకు అనుమతులు ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తుండగా, మరోపక్క అధికారికంగా అనుమతులు లేవని తెలిసి కూడా గ్రావెల్ మాఫియా బరి తెగిస్తోంది.

అక్రమార్కులకు కలిసొచ్చిన వరదలు

ఇటీవల బుడమేరుకు భారీగా వరద వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో షాబాద పరిధిలో ఉండే జక్కంపూడి కొండ సర్వే నెంబర్ 88 ప్రాంతం ముంపునకు గురైంది. టిడ్కో ఇళ్ల కోసం కొండను తొలచటం వల్ల నాని పోయి ఉన్న కొండ కొంతమేర విరిగి పడింది. కొన్ని లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ కలిగిన కొండ విరిగి కిందకు జారింది. రూ.లక్షలు ఖర్చుపెట్టి బ్లాస్టింగ్‌లు చేయకుండానే గ్రావెల్ కిందకు జారటంతో అక్రమార్కుల కన్ను దీనిపై పడింది. ఈ గ్రావెల్‌ను తన్నుకుపోవటానికి స్కెచ్ వేశారు. ఈ మట్టిని మూడో కంటికి తెలియకుండా తవ్వుకోవటానికి పథకం వేశారు. ప్రభుత్వ శాఖలు పనిచేయని సెలవు రోజుల్లో,

మిగతా 6లో..

ముగ్గురూ ముగ్గురే..

టాస్క్‌ఫోర్స్‌లో కానిస్టేబుళ్ల త్రయం

పేకాట శిబిరాలపై దాడులు

నిర్వాహకులతో తెరవెనుక ఒప్పందాలు

ఆరోపణలు వచ్చిన ముగ్గురి బదిలీ

అంతర్గత విచారణకు ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సిటీ టాస్క్‌ఫోర్స్ (సీటీఎఫ్).. ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్‌లో అత్యంత కీలకమైన విభాగం. ఇందులో ఉన్న అధికారులు, సిబ్బంది పోలీసు కమిషనర్ ఆధీనంలో ఉంటారు. ఈ విభాగంలో విధులు నిర్వర్తించే ముగ్గురు కానిస్టేబుళ్లపై సీపీ రాజశేఖరబాబు వేటు వేశారు. వారిని టాస్క్‌ఫోర్స్ నుంచి వివిధ విభాగాలకు బదిలీ చేశారు. అశోక్‌క్రాంతి, రామకృష్ణ, మొజాహిద్‌లను టాస్క్‌ఫోర్స్ నుంచి మార్పు చేశారు. అశోక్ క్రాంతిని ట్రాఫిక్ విభాగానికి, రామకృష్ణను మహిళా పోలీస్‌స్టేషన్‌కు, మొజాహిద్‌ను సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ ముగ్గురి పనితీరుపై పలు ఫిర్యాదులు అందడం, ఆరోపణలు రావడమే ఇందుకు కారణం.

అసలేం జరిగిందంటే..

టాస్క్‌ఫోర్స్‌లో ఈ ముగ్గురు నాలుగున్నరేళ్లకు పైబడి పనిచేస్తున్నారు. వీరు కేవలం పేకాట పైనే సమాచారం సేకరిస్తుంటారు. జిల్లాలో ఎక్కడ పేకాట శిబిరాలు నిర్వహించినా ఈ ముగ్గురికే సమాచారం వస్తుంది. ఇటీవల వీరితో పాటు మరికొంతమంది కలిసి రెండుచోట్ల పేకాట శిబిరాలపై దాడులు చేశారు. ఈ సమయంలో వీరు వ్యవహరించిన తీరుపై అనేక అభియోగాలు వచ్చాయి.

● కొద్దిరోజుల క్రితం జి.కొండూరులోని పొలాల్లో కొంతమంది పేకాడుతున్నట్టు సమాచారం అందింది. రాత్రిపూట జరిగే ఈ పేకాట శిబిరంపై దాడి చేయడానికి ఎస్‌ఐ శివరాంబాబుతో కలిసి ఈ ముగ్గురు కానిస్టేబుళ్లు వెళ్లారు. ఈ టీమ్ అక్కడికి వెళ్లే సమయానికి పేకాట ముగిసిపోయింది. డబ్బు పోగొట్టుకున్న వారు నీరసంగా బయటకు వచ్చారు. డబ్బు సంపాదించిన వారు హుషారుగా బైకులెక్కారు. ఈ టీమ్ శిబిరం వద్దకు వెళ్తుండగా, మార్గంమధ్యలో కొంతమంది కనిపించారు. మొత్తం 13 మందిని అదుపులోకి తీసుకుని రూ.1.52 లక్షలు సీజ్ చేసినట్టు చూపించారు. వాళ్లందరినీ పేకాడుతుండగా పట్టుకున్నట్టు చూపించారు. దాడిచేసిన టీమ్‌లో జి.కొండూరు ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ కూడా ఉన్నారు. ఈ నిందితులను స్టేషన్‌లో అప్పగించారు. వాస్తవానికి ఈ 13 మందిని మార్గంమధ్యలో అరెస్టు చేశారు. ఈ శిబిరాన్ని నిర్వహించిన నిర్వాహకుడి గురించి మాత్రం ఆరా తీయలేదు. ఒక నిందితుడ్ని పట్టుకున్న అశోక్‌క్రాంతి అతడి ఫోన్‌ను పరిశీలించి నిర్వాహకుడి గురించి తెలుసుకున్నాడు. ఆ తర్వాత నిర్వాహకుడి పేరు నిందితుల జాబితాలో లేదు. అతడు ఎవరో తమకు తెలియదన్నట్టు వ్యవహరించారు. దీనివెనుక నిర్వాహకుడితో లోపాయికారి ఒప్పందాలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. రాత్రి 11 గంటలకు మొదలైన ఈ టాస్క్ తెల్లవారుజామున 4 గంటల వరకు సాగడంతో పోలీసు వర్గాల్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. పేకాట శిబిరంపై దాడి చేసి, నిందితులను సంబంధిత స్టేషన్‌లో అప్పగించడానికి ఇంత సమయం పడుతుందా.. అనే ప్రశ్న వచ్చింది. ఈ లోపాయికారి వ్యవహారంలో అశోక్‌క్రాంతి క్రియాశీలకంగా వ్యవహరిస్తే, దానికి రామకృష్ణ, మొజాహిద్‌లు భాగస్వాములుగా వ్యవహరించారనేది ప్రధాన ఆరోపణ.

● నందిగామ మండలం రామిరెడ్డిపల్లి వద్ద భారీగా

మిగతా 6లో..

8లో



గోల్డ్ డాన్

- వన్‌టౌన్‌లో గోల్డ్ మాఫియా డాన్
- ఇతర ప్రాంతాల నుంచి దొంగ బంగారం
- వైసీపీ హయాంలో జోరుగా వ్యాపారం
- ఓ మాజీమంత్రి అండదండలతోనే..
- తక్కువకు గోల్డ్ బిస్కెట్లు ఇస్తానని మాయ
- క్రైం పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ప్రతి ఇల్లూ సూర్య ఘర్ కావాలి

పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై సమీక్షలో కలెక్టర్ లక్ష్మీశ



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన (సౌర విద్యుత్) పథకం అమలుతో జిల్లాలోని ప్రతి ఇల్లూ సూర్య ఘర్ కావాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఆర్థిక చేయూతతో పాటు పర్యావరణ పరిరక్షణకు కీలకమైన ఈ పథకం ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై జిల్లాస్థాయి కమిటీ (డీఎల్‌సీ) సమావేశం జరిగింది. ఇందులో ఏపీసీపీడీసీఎల్, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో పాటు వివిధ ఏజెన్సీల ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 13న ప్రధాని ప్రారంభించిన పీఎం సూర్యఘర్ ద్వారా ఇంటి పైకప్పుపై రాయితీతో, అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొని కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. వికసిత్ భారత్ 2047, స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాల సాధనకు పునరుత్పాదక ఇంధన వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ప్రధానమన్నారు. ఈ నేపథ్యంలో పీఎం సూర్యఘర్ రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలని సూచించారు. రూ.2 లక్షల విలువైన 3 కేడబ్ల్యూ సోలార్ ప్యానెల్‌ను రూ.78 వేల రాయితీతో ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈనెల 14 నుంచి 20 వరకు జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాల నేపథ్యంలో సూర్యఘర్‌పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

ఐదు ఆదర్శ సౌర గ్రామాల గుర్తింపు

జిల్లాలో బూదవాడ (జగ్గయ్యపేట), వెల్వడం (మైలవరం), పరిటాల (కంచికచర్ల), కంభంపాడు (ఎ.కొండూరు), షేర్ మహ్మద్ పేట (జగ్గయ్య పేట) గ్రామాలను ఆదర్శ సౌర గ్రామాలుగా గుర్తించారు. దేశంలో సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఐదు వేలకు పైబడి జనాభా ఉన్న గ్రామాలను గుర్తించి, ఆదర్శ సౌర గ్రామాల కాంపొనెంట్‌ను అమలు చేస్తున్నారు. ఈ గ్రామాల్లో పునరుత్పాదక ఇంధన వినియోగంలో పోటీతత్వాన్ని పెంచి, త్వరితగతిన 100 శాతం లక్ష్యాన్ని చేరుకొన్న గ్రామాలకు రూ.కోటి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం అందుతుంది. విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ.మురళీ మోహన్, నోడల్ అధికారి ఎం.భాస్కర్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాస రావు, డీపీఓ పి.లావణ్య కుమారి, ఎన్ఆర్ఈడీసీఏపీ కో ఆర్డినేటర్ మురళి పాల్గొన్నారు.

జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖలో ఖాళీల భర్తీ

ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి

కృష్ణలంక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వన్ స్టాప్ సెంటర్ నందు ఖాళీగా ఉన్న సెంటర్ అడ్మినిస్ట్రేషన్ పోస్టు, సోషల్ కౌన్సిలర్ పోస్టులను భర్తీ చేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి జి.ఉమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పై పోస్టులను కాంట్రాక్టు లేదా అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండి 42 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన స్థానిక మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన మహిళలకు ఐదు సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల గరిష్ఠ వయస్సు సడలింపు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం నుంచి 18వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ ఏర్పాటుకు చర్యలు

- జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కేసుల పరిశీలన, విచారణ నిమిత్తం
- ఐదుగురు సభ్యులు గల కమిటీ పరిమితి రెండేళ్లు
- కమిటీ సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ లీగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అత్యాచార కేసుల పరిశీలన, విచారణ చర్యల నిమిత్తం జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకొంటున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ కమిటీలో షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగలకు చెందిన ఐదుగురిని సభ్యులుగా నియమించనున్నట్లు పేర్కొన్నారు. కమిటీ సభ్యుల కాలపరిమితి రెండు సంవత్సరాలు మాత్రమే ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలు జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫీసర్ వారి కార్యాలయం, సాంఘిక సంక్షేమ శాఖ, మారుతీ నగర్, పంటకాలువ రోడ్డు, ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ నందు తీసుకోవాలని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తులను తగిన ధృవపత్రాలతో ఈ నెల 14వ తేదీ లోగా పైన తెలిపిన కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు 70756 24856కు ఫోన్ నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

'పీఎం పోషణ'కు రూ.1.63 కోట్లు విడుదల

పార్లమెంట్‌లో ఎంపీల ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సమాధానం

వన్‌టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత అయిదు సంవత్సరాల్లో ప్రధాన మంత్రి పోషణ పథకం కింద రాష్ట్రానికి రూ.1.63 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి చెప్పారు. పార్లమెంటులో ఎంపీలు కేశినేని శివనాథ్, బి.కె.పార్థసారథి, దగ్గుమళ్ల ప్రసాదరావు వేసిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు బదులిచ్చింది. గత అయిదు సంవత్సరాల్లో ప్రధాన మంత్రి పోషణ శక్తి నిర్మాణ పథకం కింద మొత్తంగా రూ.1.63 కోట్లు విడుదల చేసినట్లు జయంత్ చౌదరి వెల్లడించారు. 2023-2024కు రూ.25,342.88 మంజూరైనట్లు పేర్కొన్నారు. కాగా, ఈ పథకం కింద రాష్ట్రంలో మొత్తం 2,24,751 పాఠశాలలు నమోదు అయ్యాయని, 2023-2024లో 44,150 పాఠశాలలు నమోదైనట్లు తెలిపారు. హిందూపురం నియోజకవర్గంలో 2,098, చిత్తూరు నియోజకవర్గంలో 2,514 పాఠశాలలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు ప్రభుత్వ అనుబంధ ప్రీ ప్రైమరీ విద్యార్థులకు పాఠశాలల పనిదినాలలో భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. గత అయిదేళ్లలో ఈ పథకం కింద 1,55,90,312 మంది విద్యార్థులు లబ్ధి పొందారని చెప్పారు. 2023-2024లో 520 పర్యాయాలు సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు.

ఎంత 'ఘాటు'ప్రేమో..

(5వ పేజీ తరువాయి)

గుత్తేదారులకు దేవస్థానం కొన్ని షరతులు విధిస్తుంది. దేవస్థానంలోని అన్ని విభాగాల్లో టెండర్లు ఆహ్వానించేటప్పుడు ఈ ప్రక్రియ ఉంటుంది. ఆ విధంగా పార్కింగ్‌కు సంబంధించిన టెండర్లలో పాల్గొనే గుత్తేదారులకు 34 షరతులు విధించారు. ఇందులో 13వ షరతు చాలా కీలకమైంది. లైసెన్స్ కాలంలో ప్రకృతి వైపరీత్యాలు, సమ్మెలు, బంద్‌లు వంటి కారణాల వల్ల ఘాట్‌రోడ్డును మూసివేస్తే వాటితో దేవస్థానానికి ఎలాంటి సంబంధం ఉండదని ప్రస్తావించారు. దీనికి కాంట్రాక్టర్ బాధ్యత వహించి, ఆ మొత్తాన్ని చెల్లించాలని స్పష్టంగా పేర్కొన్నారు. దీనిప్రకారం కాంట్రాక్టర్ మొత్తం సొమ్మును చెల్లించాలి. ఈ షరతు ప్రకారం కాంట్రాక్టర్‌కు ఉచితంగా పార్కింగ్‌ను నిర్వహించుకునే అవకాశం ఇవ్వడం ద్వారా అధికారులు రూపొందించుకున్న నిబంధనలను వాళ్లే ఉల్లంఘించారు. నిబంధనల ప్రకారం ఘాట్‌రోడ్డుపైకి కార్లు, ద్విచక్రవాహనాలు, మినీ టూరిస్టు బస్సులనే అనుమతించి టోల్ వసూలు చేయాలి. ఆటోలకు ప్రవేశాన్ని నిషేధించారు. అయినా కాంట్రాక్టర్ సంస్థ ఆటోలను ఘాట్‌రోడ్డులోకి అనుమతించి టోల్ వసూలు చేస్తున్నా అధికారులకు కనీసం కనిపించట్లేదు.

గుడివాడ నియోజకవర్గంలో బుడమేరు గట్టు పటిష్ఠం చేసేందుకు చేపట్టిన పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. ఇటీవల వచ్చిన వరదలకు గట్టుకుంగిపోయింది. విద్యుత్ స్తంభాలు సైతం పక్కకు ఒరిగిపోయాయి. భారీ వర్షాలు, వరదలు వస్తే గట్టు తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



జారిపోయిన బుడమేరు గట్టు

బుడమేరు గట్టుకు ప్రమాదం!

వైసీపీ పాలనలో రూ.30 లక్షలతో పటిష్ఠత పనులు

- నిర్లక్ష్యంగా పనులు నిర్వహించిన కాంట్రాక్టర్!
- జారిపోతున్న మట్టి.. ఒరిగిపోతున్న స్తంభాలు
- ఆందోళనలో రైతులు



అరిపిరాల సప్తా పక్కన బుడమేరు గట్టు దుస్థితి

ఆంధ్రజ్యోతి-గుడివాడ: గత వైసీపీ ప్రభుత్వంలో బుడమేరు గట్టు పటిష్ఠతకు 2022-2023 సంవత్సరంలో రూ.30 లక్షలతో పనులు చేపట్టారు. మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరుడు పాలడుగు రాంప్రసాద్‌కు అత్యంత సన్నిహితుడైన వ్యక్తికి ఈ పనుల కాంట్రాక్టును అప్పగించారు. అప్పట్లో గట్టు పటిష్ఠతలో నాణ్యత లోపించిందని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ నేత, వెంకట రాఘవపురం సర్పంచ్ కాకరాల సురేష్ ఫిర్యాదు చేశారు. అప్పటి టీడీపీ ఇన్‌చార్జి రావి వెంకటేశ్వరరావు సైతం డ్రైనేజీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. ఆనాడు మాజీ మంత్రి కొడాలి నాని చెప్పిందే వేదంగా అధికారులు నడుచుకున్నారు. టీడీపీ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని కొట్టిపారేసారు.

వరదలతో మరింత బలహీనం

మొన్నటి బుడమేరు వరదలకు నందివాడ మండలం అరిపిరాల సప్తా సమీపంలో గట్టు బుడమేరులోకి జారిపోయింది. విద్యుత్ స్తంభాలు సైతం ఒరిగిపోయాయి. మరో పర్యాయం బుడమేరుకు వరదలు వస్తే గట్టు తెగిపోయి ఊళ్లను ముంచేసే ప్రమాదం నెలకొని ఉందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గట్టును పటిష్ఠం చేయాలని కోరుతున్నారు.

బుడమేరు మట్టిని అమ్మేసుకుని

నందివాడ మండలం చేదుర్తిపాడు, గన్నవరం మండలం కొయ్య గూరపాడు గ్రామాల మధ్య బుడ మేరులో యథేచ్ఛగా మట్టిని తవ్వేసుకుని అమ్మేసుకున్నారు. అమ్ముకున్న మట్టి విలువ సుమారు రూ.1.50 కోట్లు ఉంటుందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. బుడమేరు గట్టు పటిష్ఠత పనులు చేపట్టిన కాంట్రాక్టర్ గత వైసీపీ హయాంలో మాజీ మంత్రి కొడాలి నాని చెప్పిందే వేదంగా నడుచుకున్నారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముగ్గురు కూటమి ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు టీడీపీ వర్గాల్లో వినికిడి. వీరిని ప్రసన్నం చేసుకుని కాంట్రాక్టులు చేపట్టాలని ప్లాన్ చేసుకున్నట్లు సమాచారం.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపండి

మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ

మచిలీపట్నం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం)లో వచ్చే అర్జీలను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం జేసీ గీతాంజలిశర్మ, ఏఎస్పీ వీవీ నాయుడు, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి, ఆర్డీవో కె.స్వాతి తదితరులతో కలసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉయ్యూరు మండలం రొయ్యూరు గ్రామానికి చెందిన రైతు లుక్కా ఓంకారం తన కుమారుడికి, తనకు చెందిన 477 బస్తాల ధాన్యం మిల్లుకు వెళ్లకుండా పొలం వద్దనే ఉండిపోయాయని, ధాన్యం విక్రయించేందుకు వెళితే అధికారులు పట్టించుకోవడం లేదని, వాతావరణంలో మార్పులతో ఆందోళన చెందుతున్నామని, ధాన్యం కొనుగోలు చే సేలా చర్యలు తీసుకోవాలని అర్జీ అందజేశారు. పెడన పురపాలక సంఘం 10వ వార్డుకు చెందిన మల్లా శాంతి తన కుమారుడు పుట్టుకతోనే అంధుడని, ప్రస్తుతం రూ.6వేలు పింఛను వస్తోందని, నెలకు రూ.15వేల పింఛను ఇప్పించాలని కోరుతూ అర్జీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కన్నమనాయుడు పాల్గొన్నారు.

పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు రక్షణ

పనిచేసే ప్రదేశాలలో మహిళలకు రక్షణ కల్పించేందుకు లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిహారం చట్టం-2013 అమలులోకి వచ్చిందని కలెక్టర్ బాలాజీ తెలిపారు. ఈ చట్టంపై అవగాహన కల్పించేలా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రూపొందించి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన బోర్డును కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. కార్యాలయాలు, కర్మాగారాలు, స్వయం ఉపాధి ప్రదేశాలలో పది మంది కంటే అధికంగా మహిళలు ఉంటే అక్కడ ఈ చట్టం అమలు చేసేందుకు ప్రత్యేక అంతర్గత కమిటీలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మహిళలు లైంగిక వేధింపులకు గురైన ఘటనలపై విచారణ చేసి, ఈ కమిటీలు నివేదికలు సమర్పిస్తాయని చెప్పారు. ఈ నివేదికల ఆధారంగా బాధ్యులపై చట్టప్రకారం శిక్షలు, జరిమానాలు అమలు చేస్తారని తెలిపారు. ఐసీడీఎస్ పీడీ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలకు పరిష్కారం

కృష్ణలంక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లక్ష్మీశ, జేసీ నిధి మీనా, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాస రావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ప్రతి అర్జీని క్షుణంగా పరిశీలించి ఎస్ఓపీ ప్రకారం నాణ్యతతో పరిష్కరించాలని చెప్పారు. ఇందుకు జిల్లాస్థాయి అధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అర్జీల న్నింటిని నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని వివరించారు.



ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ లక్ష్మీశ

ఇక మామిడి పంటలకు బీమా సౌకర్యం

ఎన్టీఆర్ జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్

కృష్ణలంక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలో మామిడి పంటలకు ప్రభుత్వం వాతావరణ ఆధారిత బీమా పథకంలో అవకాశం కల్పించిందని ఎన్టీఆర్ జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రీమియం, గడువు, బీమా వర్తింపు అంశాలు వెల్లడించారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్సు కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో బీమా చెల్లింపునకు ఒప్పందం చేసుకొందని తెలిపారు. రైతులు బీమా ప్రీమియం ఎకరాకు రూ.2,050 చొప్పున ఈ నెల 15 లోగా చెల్లించాలని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతింటే ఎకరాకు రూ.41 వేలు వర్తిస్తుందని తెలిపారు. ఈ బీమా పథకాన్ని ఈ సంవత్సరం డిసెంబరు 15 నుంచి వచ్చే ఏడాది మే 31 వరకు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో అధిక వర్షం, గాలిలో తేమ శాతం, వాతావరణం వ్యత్యాసం, అధిక గాలులు తదితర కారణాలతో నష్టం వాటిల్లితే, ప్రభుత్వ నిబంధనల మేరకు అంచనా వేసి బీమా వర్తింపు చేస్తారని తెలిపారు. ప్రీమియం చెల్లించే రైతులు తమ బ్యాంకు అకౌంట్ జిరాక్సు, ఆధార్ కార్డు జిరాక్స్, భూమి పాస్ బుక్ జిరాక్సు, పంట నష్టం వేసినట్లు ధృవీకరణ పత్రాలను వెంట తీసుకెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పథకం ఐదేళ్ల వయస్సు ఉన్న చెట్లకే బీమా వర్తిస్తుందని, రైతులు మీసేవ లేదా దగ్గరలో ఉన్న బ్యాంకు ద్వారా లేక నేరుగా పీఎంఎఫ్‌బీవై పోర్టల్‌లో మొబైల్ ద్వారా ప్రీమి యం రూ.2,050 చెల్లించవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు మీ దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో గానీ, ఉద్యాన అధికారులను గానీ సంప్రదించాలని కోరారు.

నేడు సీపీఎస్ ఉద్యోగుల చలో విజయవాడ!

- * ఏపీసీపీఎస్ఈఏ నేతృత్వంలో ధర్నాచౌక్‌లో ఆందోళన
- * డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నారా లోకేష్‌లకు ఆహ్వానం
- * కార్యక్రమానికి ఉభయులు దూరం
- * చలో విజయవాడకు తాము పిలుపు ఇవ్వలేదు
- * జాగరూకతతో వ్యవహరించాలి
- * ఏపీసీపీఎస్ఈఏ (ఏపీజీఈఏ) అనుబంధం సంఘం

విజయవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ పథకం (ఓపీఎస్) పునరుద్ధరణ కోరుతూ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఏపీసీపీఎస్ఈఏ మంగళవారం 'చలో విజయవాడ'ను తలపెట్టింది. ధర్నాచౌక్‌లో నిర్వహించే చలో విజయవాడలో వేలాది మంది సీపీఎస్ ఉద్యోగులు పాల్గొనబోతున్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌లను ఆహ్వానించటం జరిగింది. ఈ కార్యక్రమంలో వీరిద్దరూ పాల్గొనే అవకాశం లేదని తెలుస్తోంది. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో దగాకు గురైన సీపీఎస్ ఉద్యోగులు పాత పెన్షన్ స్కీమ్‌ను సాధించుకునేందుకు చలో విజయవాడ వంటి పోరాటాల స్ఫూర్తితో ముందుకు సాగుతామని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కోరుకొండ సతీష్ తెలిపారు. ఇది ప్రభుత్వంపై చేస్తున్న పోరాటం కాదని, కేవలం తమ న్యాయబద్ధమైన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకురావటం కోసం చేస్తున్న ఆందోళన మాత్రమేనన్నారు. కిందటి ప్రభుత్వ ఓపీఎస్ ఇస్తామని నమ్మించి జీపీఎస్ పేరుతో సీపీఎస్ ఉద్యోగులను మోసం చేసిందన్నారు. నమ్మక ద్రోహానికి పాల్పడిన కిందటి ప్రభుత్వానికి సీపీఎస్ ఉద్యోగులు తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గతంలో ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీలు వంటివి సాధించుకోవటం జరిగింది. కూటమి ప్రభుత్వంపై తమకు సంపూర్ణ నమ్మకం ఉందని, తమ ఆవేదన చెప్పుకోవటానికే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

మేము ఆందోళనలకు పిలుపు ఇవ్వలేదు.. ప్రభుత్వానికి ఏడాది సమయం ఇస్తున్నాం

-కరిమి రాజేశ్వరరావు

ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం తరపున తాము ఎలాంటి ఆందోళనలకు పిలుపునివ్వలేదని ఏపీసీపీఎస్ఈఏ (ఏపీజీఈఏ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావులు తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ అధికారం వచ్చిన నాటి నుంచి తమకు ఒక ఏడాది సమయం ఇవ్వాలని ప్రభుత్వం కోరటం జరిగిందని తెలుపుతూ తాము ఏ విధమైన ఆందోళనలకు ప్రకటన చేయలేదని తెలిపారు. గతంలో సీఎం ఇంటి ముట్టడి పేరుతో అత్యుత్సాహం ప్రదర్శించటంతో వేలాది మందిపై కేసులు నమోదయ్యాయని రాజేశ్వరరావు చెప్పారు.

వక్ఫ్‌బోర్డులోకి ఇద్దరు మహిళా సభ్యులు

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వక్ఫ్ బోర్డులో ఇద్దరు మహిళా సభ్యులను ప్రభుత్వం నియమించింది. ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, హైకోర్టు న్యాయవాది అఫీయను రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యులుగా నియమిస్తూ సోమవారం ఈ మేరకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఎండీకి ఎన్ఎంయూఏ లేఖ

విజయవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ ఎండీకి ఏపీపీటీడీ ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై శ్రీనివాసరావులు సోమవారం లేఖ రాశారు. సంస్థలో పనిచేసే అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, డీఈవోలు, ఆన్‌కాల్ డ్రైవర్లు, హైర్ బస్ డ్రైవర్ల సమస్యలను తమ లేఖలో ప్రస్తావించారు. సంస్థ కోసం అహర్నిశలూ పనిచేస్తున్న వీరికి ఉద్యోగ భద్రత లేకపోవటం ఆందోళనకరమని తెలిపారు. ఆర్టీసీలోని అవుట్‌సోర్సింగ్ కేటగిరీ ఉద్యోగులను కూడా ఆప్కాస్ పరిధిలోకి తీసుకురావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

గురుకుల విద్యార్థులకు నాణ్యమైన వైద్యం

ఎయిమ్స్, సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఎంవోయూ

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. గురుకుల పాఠశాలల విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించేందుకు మంగళగిరి ఎయిమ్స్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. సోమవారం సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ సెక్రటరీ ప్రసన్న వెంకటేష్, ఎయిమ్స్ రిసెర్చ్ డీన్ డాక్టర్ దీప్తి ఎంఓయూపై సంతకాలు చేశారు. బిల్డింగ్ హెల్తీ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఎంపవరింగ్ అడోలెసెంట్స్ ప్రాజెక్టులో భాగంగా గురుకులాల్లో పోషకాహార లోపం, రక్తహీనత, దీర్ఘకాలిక వ్యాధులున్న విద్యార్థులను గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందిస్తారు. మొదటగా రాష్ట్ర వ్యాప్తంగా 40 పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా దీన్ని అమలు చేయనున్నారు.

బీసీ హాస్టళ్ల పర్యవేక్షణపై మరింత శ్రద్ధ

ఏబీసీ వెల్ఫేర్ అధికారుల పరిధుల మార్పు

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టళ్ల పర్యవేక్షణ మరింత మెరుగుపరిచేందుకు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పాయింట్లను సర్దుబాటు చేస్తూ బీసీ సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 747 ప్రీమెట్రిక్, 362 పోస్టు మెట్రిక్‌లతో కలిపి రాష్ట్రంలో 1109 బీసీ సంక్షేమ వసతి గృహాలున్నాయి. ఈ హాస్టళ్లను రెండు స్థాయిల్లో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తుంటారు. 1109 బీసీ సంక్షేమ హాస్టళ్లు 26 జిల్లాల్లో ఉన్నప్పటికీ అన్ని జిల్లాల్లో సమానంగా హాస్టళ్లు లేవు. జిల్లాల విభజనతో అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 8 హాస్టళ్లు ఉంటే శ్రీకాకుళం జిల్లాలో 81 హాస్టళ్లున్నాయి. మొదటి స్థాయి సూపర్‌వైజర్లుగా ఉన్న అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ల పాయింట్లను సర్దుబాటు చేయడం ద్వారా హాస్టళ్లను మరింత మెరుగ్గా పర్యవేక్షించే అవకాశముంటుందని ప్రభుత్వం భావించి ఈ మేరకు సర్దుబాటు చర్యలు చేపట్టింది.

అర్ధరాత్రి అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

అర్ధరాత్రిపూట ఈ గ్రావెల్‌ను తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. గుట్టుచప్పుడు కాకుండా నెల రోజులుగా ఈ తంతు సాగిస్తున్నారు. ఇక్కడి మట్టి అంబాపురంలోని శ్రీసిటీ వెంచర్‌కు తరలిపోతోంది. అలాగే, రియల్ వెంచర్లకు, ఇతర ప్రాంతాలకు భారీగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలోని మాఫియానే ఇందులోనూ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ అడ్డగోలు వ్యవహారాన్ని షాబాద గ్రామస్తులు అడుకున్నారు. ఆ తర్వాత రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగటంతో ఈ అక్రమం వెలుగుచూసింది. అక్రమంగా క్వారీయింగ్ జరుపుతున్న ప్రాంతంలో రెవెన్యూ అధికారులు తనిఖీ చేసి ఒక ఎక్స్‌కవేటర్, లారీని స్వాధీనం చేసుకున్నారు.

ముగ్గురూ ముగ్గురే..

(5వ పేజీ తరువాయి)

పేకాట శిబిరం నిర్వహించారు. ఈ సమాచారం అందుకున్న అశోక్‌క్రాంతి, రామకృష్ణ, ముజాహిద్‌లు అధికారులకు విషయం చెప్పారు. భారీ శిబిరమని అధికారులు వాహనాల్లో నందిగామ వద్దకు వెళ్లారు. అంతకుముందే శిబిరం వద్దకు వెళ్లిన ఈ ముగ్గురూ.. అధికారులకు ఆ ప్రాంతమెక్కడో చెప్పలేదు. కట్ చేస్తే.. కాసేపటికి శిబిరం నుంచి అంతా పారిపోయారని సమాచారమిచ్చారు. ఈ విషయంలోనూ ఈ త్రయంపై ఆరోపణలు బలంగా వచ్చాయి. ఈ ముగ్గురి పరిస్థితిపై లోగడ పనిచేసిన అధికారులకు పలువురు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. దీనిపై మరింత చెలరేగిపోయారు. ఈ రెండు పేకాట శిబిరాల వద్ద జరిగిన వ్యవహారాల కథలు పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు వద్దకు వెళ్లాయి. తొలుత అశోక్‌క్రాంతి, రామకృష్ణ, ముజాహిద్‌లను టాస్క్‌ఫోర్స్ నుంచి బదిలీ చేశారు. దీనిపై అంతర్గత విచారణకు ఆదేశించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

'ఏపీఈఆర్‌సీ అడ్వైజరీ కమిటీ'కి దరఖాస్తుల ఆహ్వానం

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లోని వారి నుంచి సలహాలు, సూచనల తీసుకునేందుగాను 21 మంది మించకుండా వేసే రాష్ట్ర సలహా సంఘం కోసం దరఖాస్తులు పంపాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ప్రకటన విడుదల చేసింది. పరిశ్రమలు, వాణిజ్యం, వ్యవసాయం, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, రవాణా, కార్మికులు, పరిశోధన తదితర సంస్థలకు చెందినవారు ఈ నెల 21వ తేదీలోగా కమిషన్‌కు దరఖాస్తులు పంపాలని ఏపీఈఆర్‌సీ వెబ్‌సైట్ ద్వారా కోరింది.

నేటి నుంచి రంగా వర్సిటీలో ఎన్నారై కోటా సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల్లో బీఎస్సీ అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్, ఎన్నారై కోటా కింద బీఎస్సీ అగ్రికల్చర్ సీట్లకు మంగళవారం నుంచి ఈ నెల 13 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ రామచంద్రరావు తెలిపారు. వర్సిటీలోని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

కళా ఉత్సవ్ పోటీలు ప్రారంభం

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రాచీన కళలను ప్రోత్సహించాలని, కళలను సహ పాఠ్యాంశాలుగా మార్చుకుని విద్యార్థులు రాణించాలని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. రెండు రోజుల 'కళా ఉత్సవ్' పోటీలను సోమవారం విజయవాడలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతోపాటు కళలను నేర్చుకోవడం ద్వారా ప్రశాంతత పెరుగుతుందని, ఆహ్లాదకర వాతావరణం అలవాటు అవుతుందని అన్నారు. కళలను ప్రోత్సహించడం వల్ల వారసత్వ సంపదను కాపాడుకోవచ్చన్నారు. కాగా, విద్యార్థులకు గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, థియేటర్, దృశ్య కళలు, కథలు చెప్పడం ఆరు విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి, 200 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విదేశీ వైద్య పట్టాలను వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలి

ఆటోనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి కార్యాలయం వద్ద 120 మంది విదేశీ వైద్య విద్యార్థులు సోమవారం నిరసన ప్రదర్శన చేశారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న శాశ్వత రిజిస్ట్రేషన్‌ను వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో విదేశీ వైద్య పట్టా కలిగిన విద్యార్థుల అభ్యర్థనలను రెండు వారాలకే పూర్తి చేస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే రిజిస్ట్రేషన్‌లో జాప్యం జరుగు తుందన్నారు. స్పందించిన ఏపీఎంసీ రిజిస్ట్రార్ నూతనంగా జారీ చేసిన నేషనల్ మెడికల్ కౌన్సిల్ నోటిఫి కేషన్ ప్రకారం విదేశీవైద్య పట్టాలకు సంబంధించి ఆయా దేశాల ఎంబసీల నుంచి ధ్రువీకరణ తప్పనిసరిని తెలిపారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్ర బాబు దృష్టికి తీసుకెళ్లి వాటిలో సాధ్యమైనన్ని సమస్యలను పరిష్కరించేలా చూస్తానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో రాష్ట్ర వీరవసంత దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 32వ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమా నికి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారని వివరించారు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో చెప్పిన విధంగానే రూ.3వేలు ఉన్న దివ్యాంగుల పింఛన్ రూ.6వేలుకు పెంచారని, రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించడం, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు నష్ట పరిహారం అందజేయడం వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. వీరవసంత దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల లక్ష్మీనారాయణ మాటాడుతూ



ఎమ్మెల్యే గద్దెకు సమస్యలు వివరిస్తున్న అధ్యక్షుడు మల్లెల లక్ష్మీనారాయణ

దివ్యాంగుల పింఛన్లు రూ.6వేలకు పెంచినందుకు సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చేయడమే కాకుండా వ్యక్తిగతంగా వారి జీవనోపాధికి సహాయం చేస్తానన్న ఎమ్మెల్యే గద్దెకు లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో సంఘ కార్యదర్శి షేక్ నూర్ అహ్మద్, సంఘం రాష్ట్ర నాయకులు బొమ్మన బోయిన రమేష్, మహిళా నాయకురాలు బేబి సరోజిని, ఏసుగంటి కృష్ణారావు, అమ్ములు, వీరభద్రం, సతీష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అభినందనలు

కార్యకర్తలే టీడీపీకి పెట్టని కోట అని, అంకిత భావంతో పనిచేసిన కార్యకర్తలను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అభినందనల్లో ముంచెత్తారు. తూర్పులో టీడీపీ యాప్‌ను చురుగ్గా వినియోగిస్తూ టీడీపీ కోసం ఒక డిజిటల్ సైనికుడిలాగా పనిచేసిన ఏడుగురు కార్యకర్తలకు రాష్ట్ర పార్టీ బహుమ తులను అందజేసింది.

సదరు గిఫ్ట్ ప్యాకెట్‌లను అడపా శివనాగేంద్రరావు, మందల రాజ్యలక్ష్మి, బొల్లు ధన్యశ్రీ, పెరసాని వసంత్, వీఎంఎస్‌రావు, కొత్తా మురళీ, కోగంటి రాంబాబులకు గద్దె రామ్మోహన్ అందజేశారు.

వ్యాసరచన పోటీల విజేతలకు అభినందన



మొగల్రాజపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సంస్థల విద్యా విభాగం ఆధ్వర్యంలో జరిగిన వ్యాసరచన పోటీల్లో నగర స్థాయిలో తమ విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారని పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన విద్యార్థినులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ వ్యాసరచన పోటీల్లో తెలుగు విభాగంలో డిగ్రీ విద్యార్థిని ఎలిజిబెత్ రాణి ప్రథమ బహుమతి, ఆంగ్ల విభాగంలో మోహన ద్వితీయ బహుమతి సాధించారని చెప్పారు. విద్యార్థినులను కళాశాల యాజమాన్యం అధ్యాపకేతర, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

అవినీతి .. సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్య

ఏఎండీ ఇంతియాజ్

విజయవాడ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అవినీతి అనేది ప్రపంచ దేశాలన్నింటినీ ప్రభావితం చేస్తున్న ఒక సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్య అని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసి యేషన్, ఆంధ్ర లయోలా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఆంధ్రా లయోలా కళాశాలలో 'అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం' సందర్భంగా 'అవినీతి అంతం-అదే మన పంతం' అనే అంశంపై కవిసమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ ప్రజా స్వామ్య సంస్థల పునాదుల్ని ఈ అవినీతి బలహీన పరుస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ



కవులను అభినందిస్తున్న మాజీ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్, డాక్టర్ సమరం తదితరులు

జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సమరం మాట్లాడుతూ అవినీతి ప్రజాస్వామ్య వ్యవస్థల్ని బలహీనపరుస్తుందన్నారు. విజయనగరం జిల్లా గుర్ల మండలానికి చెందిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ బి.కామేశ్వరరావు చేస్తున్న సేవల కు, ఆయన నిజాయితీని అభినందిస్తూ ఉత్తమ సేవా పురస్కారం అందచేశారు. ఈ కార్యక్రమానికి వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అంతర్జాతీయ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా సభాధ్యక్షులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీఏపీ కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, గాంధీ దేశం వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఆర్.ఆర్.గాంధీ నాగరాజన్ పాల్గొన్నారు. 13 మంది రచయితలు తమ కవితలతో సభను ఉత్తేజపరిచారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్ రాజు, తెలుగు శాఖాధ్యక్షుడు డాక్టర్ కె.శేఖర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఆర్.రవీంద్రభాస్, డాక్టర్ డి.కృపారావు, బి.వెంకటేశ్వరరావు, స్నేహల విమల్ శుక్ల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- కలెక్టర్‌కు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్ వినతి



కృష్ణలంక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో వున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యాలు ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని అంటున్నారని, వచ్చే నెలలో డిగ్రీ, ఇంజినీరింగ్ పరీక్షలు మొదలవుతున్నాయని, గతంలో పెండింగ్‌లో వున్న బకాయిలు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని కళాశాల యాజమాన్యాలు చెబుతున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీ యింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని సాయికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కార్తీక్, రంజిత్, జగదీష్, సురేష్, ప్రమోద, అవినాష్, మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మొగల్రాజపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూబ్లీ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ గిరిపురం ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, మెయింటినెన్స్ నిమిత్తం మధుగార్డెన్ ఏరియా, విగ్నేష్ ఆసుపత్రి ఏరియా, శిఖామణి సెంటర్, బ్లోసం ఆసుపత్రి, నెహ్రూనగర్, అంబేడ్కర్ వీధి, రామశాస్త్రి వీధి, ప్రజాశక్తినగర్, గిరిపురం, గాస్పెల్ హాల్ ఏరియాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

అలరించిన ఘంటసాల పాటలు



కళాకారులను అభినందిస్తున్న పీవీఎస్ఎన్ శర్మ, విజయ కుమార్ తదితరులు


విజయవాడ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీ ఘంటసాల సంగీత కళా సమితి ఆధ్వర్యంలో గాన గంధర్వ శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి వేడుకలు గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.కృష్ణమాచార్యులు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు, సాహితీవేత్త స్వర్ణ మంగళంపల్లి, శాస్త్రీయ, లలిత, సినీ గాయనిలకు ఘంటసాల అవార్డు-2024 బహూకరించారు. నారుమంచి శ్రీనివాసమూర్తి(డ్రమ్స్ వాయిద్యకారులు), రాజగోపాలచారి, (తబలా వాయిద్యకారులు)లకు ఆత్మీయ సత్కారం చేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా జరిగిన సినీ సంగీత విభావరిలో స్వర్ణ, దుర్గా సౌజన్య, పద్మజ, స్వాతి, పీవీఎస్ఎన్ శర్మ, పి.విజయ కుమార్, శ్రీహరి, కేవై ప్రసాద్, పవన్‌కుమార్, ప్రసాదరెడ్డిలు ఆలపించిన ఘంటసాల పాటలు ఆహూతులను ఆద్యంతం అలరించాయి.

ఎన్ఆర్ఐలో అధ్యాపక నైపుణ్యాభివృద్ధి సదస్సు



సదస్సులో పాల్గొన్న లెక్చరర్లు, ఎన్ఆర్ఐ కళాశాల చైర్మన్ వెంకట్రావు

విజయవాడ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లి సమీపంలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సోమవారం ఏఐసీటీఈ అటల్ ప్రాయోజిత అధునాతన స్థాయి అధ్యాపక నైపుణ్యాభివృద్ధి సదస్సు జరిగింది. ఈ సదస్సులో కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్.వెంకట్రావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విద్యుత్ వాహనాల వినియోగం మరింత పెరుగుతుందని దానికి తగినట్లుగా అధ్యాపకులు విద్యుత్ వాహనాలపై మరింత పరిశోధన చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాగభాస్కర్ మాట్లాడుతూ విద్యుత్ వాహనాల పనితీరును మరింత అభివృద్ధి పరిచేలా అధ్యాపకులు తగు పరిశోధన చేసి పేటెంట్స్ పొందాలని సూచించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ పి.శంకర్ మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వాహనాలలో పవర్ ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఎలా ఉపయోగించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఈఈ విభాగాధిపతి అండ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, సదస్సు కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.సాంబశివరావు ఈఈఈ అధ్యాపకులు, వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.



రేవులపల్లి మల్లికార్జునరావు గీసిన పెయింటింగ్

వారెవ్వా..వాగ్గేయకారుల పెయింటింగ్

విజయవాడ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కృష్ణవేణి సంగీత నీరాజనం ఉత్సవాల్లో ప్రముఖ ఆర్టిస్ట్ సాంస్కృతిక శాఖ మాజీ డైరెక్టర్ డాక్టర్ రేవులపల్లి మల్లికార్జునరావు చిత్రించిన వాగ్గేయకారుల పెయింటింగ్ ఆకర్షణీయంగా నిలిచింది. అన్నమయ్య, త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్, పురందరదాసు, శ్యామశాస్త్రి చరిత్రలను తెలియ జేస్తూ పెయింటింగ్ గీశారు. అది నచ్చిన కేంద్ర పర్యాటక మంత్రి సురేష్ గోపి అడిగి మరీ తీసుకెళ్లారు. దాని తాలూకా చిత్రాన్ని బ్యానర్‌పై ప్రింట్ వేసి ప్రదర్శనలో ఉంచారు

వాహనచోదకులు ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలి

సీపీ ఎస్వీ రాజశేఖరబాబు



ప్రధాన కూడళ్లను క్షేత్రస్థాయిలో సందర్శించిన సీపీ ఎస్వీ రాజశేఖర బాబు

గుణదల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ రోజు రోజుకు పెరిగి పోతున్న తరుణంలో వాహన చోదకులు ట్రాఫిక్ ఆంక్షలు విధిగా పాటించాలని నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి నగర పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు ట్రాఫిక్ సీఐలు, ఎస్ఐల సమక్షంలో సోమవారం నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద రద్దీని పరిశీలించి అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఫ్రీలెఫ్ట్ సౌలభ్యం, డివైడర్ కటింగ్ ఏర్పాటు, ప్రధాన జంక్షన్ల వద్ద నిర్మించిన గ్రీనరీ ఐలాండ్ల కుదింపు, జంక్షన్లలో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ఏర్పాటు తదితర అంశాలపై ఆయన దృష్టి పెట్టారు. స్క్యూబ్రిడ్జి వద్ద బెంజిసర్కిల్ నుంచి రామలింగేశ్వర్ నగర్ వెళ్లేందుకు డివైడర్ కటింగ్ ప్రతిపాదనపై అధికారులతో చర్చించారు. రామవరప్పాడు వద్ద తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ట్రాఫిక్ ఉన్నత అధికారులతో సమాలోచనలు చేశారు. ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రదేశాల్లో వాహనాలు పార్క్‌చేసి వెళ్లిపోయే వారిని ఉపేక్షించవద్దని ఆదేశించారు. నోపార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు పార్క్‌చేసే వారికి జరిమానాలు విధించాలన్నారు. ఫుట్‌పాత్‌లపై పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా వ్యాపారాలు చేసే వారిపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. నగరంలో తిరిగే సర్వీస్ ఆటోల్లో చెవులు హోరెత్తించేలా ఏర్పాటు చేస్తున్న సౌండ్‌సిస్టంలను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని చెప్పారు. కమిషనర్ వెంట ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ఏ.వి.ఎల్ ప్రసన్న కుమార్, ట్రాఫిక్ సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఫాదర్ ప్రకాష్, చిన్నారులు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

మొగల్రాజపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆరవ డివిజన్ ఫాతిమా దేవాలయం ఆర్సీఎం చర్చిలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఫాదర్ ఎం.ప్రకాష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ గొప్పతనం మనిషి మరో మనిషికి సాయంగా ఉండాలనే భావన ప్రతి ఒక్కరిలో ఉండాలనే ఉద్దేశంతో, పిల్లల్లో ఐకమత్యం, మత సామరస్యం వెల్లివిరియాలని సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం దేవుని ప్రార్థన, క్రిస్మస్ ఔచిత్యాన్ని వివరించారు. చిన్నారులు, నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, క్రిస్మస్ తాత వేషంలో, దేవ దూతల అలంకరణలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సిస్టర్ కుచేలమ్మ, ఫ్రాన్సిస్ రాజ్‌కుమార్, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతకు సూచిక క్రిస్మస్ ట్రీ అలంకరణ



నోవాటెల్ హోటల్‌లో అలంకరించిన క్రిస్మస్ ట్రీ

ఆటోనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ చెట్టు దీపాల అలంకరణ కేవలం ఒక వేడుక మాత్రమే కాదని ఐక్యతకు సూచికని, స్ఫూర్తితో మన సమాజం కలిసి రావాల్సిన తరుణమిదని నోవాటెల్ హోటల్ మేనేజర్ మనీష్ పాఠక్ అన్నారు. సోమవారం నోవాటెల్ హోటల్‌లో క్రిస్మస్ ట్రీ కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఎంతో ప్రతిష్ఠాత్మకమైన సంప్రదాయానికి నాంది పలుకుతుందన్నారు. క్రిస్మస్ కేక్‌లు, బెల్లం హౌస్ ప్రదర్శనలతో లాబీలను అలంకరించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హోటల్ సిబ్బంది పాల్గొన్నారు.



అన్నవరం రామస్వామి వాయులీన కచేరీ

వీనులవిందుగా రామస్వామి వాయులీన కచేరీ

విజయవాడ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గాయక సార్వభౌమ సంగీత పరిషత్ సంస్థ, స్వరఝరి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 141 జయంతి ఉత్సవాలలో భాగంగా ఐదో రోజు సోమవారం సత్యనారాయణపురం శివరామకృష్ణ క్షేత్రంలో వాయులీన విద్వాంసులు అన్నవరం రామస్వామి వాయులీన కచేరీ జరిగింది. ఈ కచేరీలో పెరవలి నందకుమార్ గుంటూరు-జతవాద్యం సహకారంతో పారుపల్లి సుబ్బారాయ ఫల్గున్-మృదంగంతో, హరిబాబు ఘటం వాయిద్యంతో సహకారం అందించారు. కార్యక్రమాన్ని మోదుమూడి సుధాకర్, అంజనాదేవిలు పర్యవేక్షించారు.

89 మంది మహిళల మిస్సింగ్ కేసులు

నెల రోజుల్లో పరిష్కారం

గుణదల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల్లో 89 మహిళా మిస్సింగ్ కేసులను చేధించడం జరిగిందని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు తెలిపారు. ఉమెన్ మిస్సింగ్ కేసుల పురోగతిపై చర్చించేందుకు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో జూమ్ మీటింగ్ సోమవారం నిర్వహించారు. ఉమెన్ మిస్సింగ్ కేసుల పరిష్కారం నిమిత్తం ఈ ఏడాది నవంబరు 10న డీసీపీ గౌతమి షాలి ఆధ్వర్యంలో సీఐ చంద్రశేఖర్, మహిళా ఎస్ఐ యు.హైమావతితో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రత్యేక బృందం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఈ మిస్సింగ్ కేసులను చేధించినట్టు తెలిపారు. ఈ మహిళలను వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చామన్నారు. అదేస్ఫూర్తితో మిగిలిన కేసులను కూడా త్వరగా ఛేదించాలన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

పెనమలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ శివారు పెనమలూరు మండలంలోని ఒక కార్పొరేట్ కళాశాలలో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకొంటున్న విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన జరిగింది. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నంద్యాలకు చెందిన బణావత్ పరమేష్ నాయక్ (19) అనే విద్యార్థి పోరంకిలోని ఒక కార్పొరేట్ కళాశాల వసతి గృహంలో నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకొంటున్నాడు. ఆదివారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి క్యాంపస్‌లో సినిమా చూసి నిద్రకు ఉపక్రమించాడు. తెల్లవారు జామున విద్యార్థులు నిద్ర లేచి చూసేసరికి బట్టలు ఆరేసుకొనే ఇనుపరాడ్‌కు ఉరేసుకొని ఉన్నాడు. అప్రమత్తమైన కళాశాల యాజమాన్యం విద్యార్థిని ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెదినట్టు వైద్యులు తేల్చారు. విద్యార్థి మృతి వార్త తెలుసుకొన్న అతడి తల్లిదండ్రులు కళాశాల వద్దకు వచ్చి కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు మృతి చెందాడని ఆందోళన వ్యక్తం చేశారు.

కొత్తూరు తాడేపల్లి, నున్నలో క్వారీల తనిఖీ

వన్‌టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు తాడేపల్లి, నున్న అటవీ శాఖ బీట్ పరిధిలో ప్రైవేట్ భూముల్లో గ్రావెల్స్ కోసం యజమానులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) ఇవ్వచ్చునా లేదా అన్న దానిపై సోమవారం క్షేత్రస్థాయిలో భౌతిక పరిశీలన చేశారు. ఆయా బీట్ పరిధిలో సుమారు 33 మంది గ్రావెల్ తవ్వకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే కొంతమంది గ్రావెల్ తవ్వకాలను ప్రారంభించారు. అవి ఏ మేరకు అనుమతించదగినవా? కాదా అనే దానిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్క్వాడ్ డీఎఫ్‌వో టి.శ్రీనివాసరావు, స్క్వాడ్ రేంజర్ రాజా స్థానిక డీఎఫ్‌వో పోతురాజు, కొత్తూరు తాడేపల్లి బీట్ ఆఫీసర్ శంకర్‌తో కలిసి ఆయా బీట్ల పరిధిలో క్వారీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ నివేదికను స్క్వాడ్ అధికారులు పై స్థాయి అధికారులకు పంపించనున్నారు.

శిక్షణకు 50 మంది తిరువూరు యువత

వన్‌టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ యువతకు నిర్వహిస్తున్న ఉపాధి అవకాశాల అవగాహన సదస్సుకు విజయవాడ పార్లమెంట్ పరిధిలోని తిరువూరు నుంచి 50 మంది యువత పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన చేసింది. హైదరాబాద్ రాజేంద్ర నగర్‌లోని జాతీయ గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. ఎంపీ శివనాథ్ ఆధ్వర్యంలో మొదటి విడతగా తిరువూరు నుంచి 50 మంది పాల్గొన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ జి.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ రంగంలో నిధులు, పథకాలపై వివరించారు. 15కు పైగా స్వయం ఉపాధి పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.

రేపు క్యారమ్స్ జట్ల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా స్కూల్ గేమ్స్ అండర్ -19 పర్యవేక్షణలో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని క్యారమ్స్ అసోసియేషన్ హాల్లో ఎస్‌జీఎఫ్ బాలబాలికల క్యారమ్స్ జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి వీ రవి కాంత ఒక ప్రకటనలో తెలిపారు. పీఈటీ పీడీలు ఈ విషయాన్ని గమనించి జిల్లా ప్లేయర్ ఎంట్రీ ఫారంలో పెన్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఇతర వివరాలను పూర్తి చేసుకుని ఆ రోజు హాజరు కావాలని ఆమె తెలిపారు.

సాగర్ కమిటీ చైర్మన్ పీఠంపై ఉత్కంఠ

- ఎన్టీఆర్ జిల్లాలోనే అత్యధిక కమిటీలు, డీసీలు
- చైర్మన్ పదవిపై కన్నెత్తి చూడని జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న జిల్లా సీనియర్ నేతలు

ఆంధ్రజ్యోతి-నందిగామ: ప్రతిష్టాత్మకమైన నాగార్జున సాగర్ (ఎన్ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పదవి పీఠంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొని ఉంది. మెజారిటీ ఆయకట్టు, ఎక్కువ డిస్ట్రిబ్యూటరీ కమిటీలున్న ప్రాంతాన్ని వీడి ప్రాజెక్ట్‌లో నామమాత్రపు ప్రాతినిధ్యం గల ప్రాంతానికి చైర్మన్ పదవి కట్టబెడుతున్నారన్న సమాచారం పెద్దయెత్తున విమర్శలకు దారి తీస్తోంది. పదవులు కేటాయింపులో సామాజిక, ప్రాంతీయత వంటి అంశాలనూ నిశితంగా పరిశీలించే టీడీపీ ప్రాజెక్ట్ కమిటీ విషయంలోనూ ఆచితూచి నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని పార్టీ నేతలు అభిప్రాయ పడుతున్నారు. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల పరిధిలోని ప్రాజెక్ట్ కమిటీ పదవిని అత్యధిక డీసీలు, అత్యధిక ఆయకట్టు గల ఎన్టీఆర్ జిల్లాకు కేటాయించాల్సి ఉందని అభిప్రాయపడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాకు మంత్రి పదవి కూడా కేటాయించని ప్రభుత్వ పెద్దలు కనీసం జిల్లా స్థాయిదైన ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పదవినైనా కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.


మరమ్మతులకు నోచుకోని ఎన్ఎస్‌పీ కాలువలు

జిల్లాల వారీగా డీసీ పదవులు

ప్రాజెక్ట్ కమిటీ పరిధిలో మొత్తం 17 డిస్ట్రిబ్యూటరీ కమిటీలున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో 13 కమిటీలుండగా, కృష్ణా, ఏలూరు జిల్లాల పరిధిలో రెండేసి చొప్పున డిస్ట్రిబ్యూటరీ కమిటీలున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలోని జగ్గయ్యపేట పరిధిలో రెండు డీసీలు, నందిగామ పరిధిలో 4 డీసీలు, మైలవరం పరిధిలో 4 డీసీలు, తిరువూరు పరిధిలో 3 డీసీలున్నాయి. మూడు వంతులకు పైబడి డీసీలు కలిగి ఉన్న ఎన్టీఆర్ జిల్లా అదే స్థాయిలో ఆయకట్టు కూడా కలిగి ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో 13 డీసీల పరిధిలో సుమారు రెండున్నర లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా, ఏలూరు జిల్లాలో 35 వేలు, కృష్ణాజిల్లాలో 35 వేల ఎకరాలు మాత్రమే ఆయకట్టు ఉంది. దీన్నిబట్టి ప్రాజెక్ట్ కమిటీలో అత్యధిక భాగం కలిగి ఉన్న ఎన్టీఆర్ జిల్లాకు చైర్మన్ పదవి కేటాయించడమే సముచితమని రైతులు భావిస్తున్నారు.

కాలువల విస్తరణ, నీటి పంపిణీ

ఎన్ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ కమిటీ పరిధిలోని ఆయకట్టుకు తెలంగాణ నుంచి 3528 క్యూసెక్కుల నీరు విడుదలౌతుంది. ఈ నీటి ప్రవాహానికి చివరి భూములు కూడా ఎన్టీఆర్ జిల్లాలోనే ఉన్నాయి. ఇదిలా ఉండగా, నందిగామ పరిధిలో సుమారు 68 ఎత్తిపోతల పథకాలున్నాయి. వీటి నుంచి భారీగా నీరు విడుదలౌతుంది. జగ్గయ్యపేట, మైలవరం పరిధిలోనూ పలు ఎత్తిపోతల పథకాలు నీటిని తోడి పోస్తున్నాయి. సాగర్ నీటి కంటే అధిక మొత్తంలో నీరు ఎత్తిపోతల పథకాల నుంచి వస్తుంది. ఎన్ఎస్‌పీ కాలువల ద్వారానే ఈ నీటి పంపిణీ జరుగుతుంది. ఈ లెక్కన కమిటీ తన విధులను 90శాతం ఎన్టీఆర్ జిల్లాలోనే చేపట్టాలి. వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురై కునారిల్లుతున్న కాలువలకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఈ అంశాలను పరిగణంలోకి తీసుకుంటే కమిటీ చైర్మన్ పదవిని ఎన్టీఆర్ జిల్లాకే కేటాయించాలి.

నిర్లక్ష్యమెందుకో...

90 శాతం జిల్లాలో అంతర్భాగమై ఉన్న ప్రాజెక్ట్ కమిటీ పదవిని దక్కించుకొనేందుకు ఎన్టీఆర్ జిల్లా ప్రజాప్రతినిధులు ఏమాత్రం దృష్టి సారించకపోవడం విస్మయం కలిగిస్తోంది. గతంలో నామినేటెడ్, పార్టీ పదవులతో పాటు ఏవైనా జిల్లాస్థాయి పదవులుంటే ఎమ్మెల్యేలు ఎవరికి వారు తమ నియోజక వర్గాలకు దక్కాలని ఆరాటపడేవారు. ఎవరికి వారు పోటీపడి అధిష్టానం వద్ద పావులు కదిపేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎమ్మెల్యేలు, ఎంపీ లైట్ తీసుకున్నట్టు తెలుస్తోంది. ఏలూరు జిల్లాకు చెందిన ఒక నేతకు ఈ పదవిని కట్టబెడుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై జిల్లాలోని పలువురు సీనియర్ నేతలు పెదవి విరుస్తున్నారు. సదరు నేతకు పార్టీ అధిష్టానం ఆశీస్సులేమైనా ఉన్నాయా లేక తమకెందుకులే అని జిల్లా ప్రజాప్రతినిధులు వదిలేశారా అన్న చర్చ సాగుతుంది. మెజారిటీ ప్రాంతానికే ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పీఠం అందేలా ఎమ్మెల్యేలు, ఎంపీతో పాటు పార్టీ పెద్దలు చర్యలు చేపట్టాలని కూటమి ద్వితీయ శ్రేణి నేతలు డిమాండ్ చేస్తున్నారు. సముచిత నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.

చోరీ కేసులో నిందితురాలి అరెస్టు

- రూ.12.50 లక్షల బంగారం స్వాధీనం

తిరువూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బంగారం చోరీకేసులో నిందితురాలిని అదుపులోకి తీసుకొని ఆమె నుంచి రూ.12.50 లక్షల బంగారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో విజయవాడ రూరల్ డీసీపీ మహేశ్వరరాజు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 7న విజయవాడ భవానీపురం నుంచి కంచి నవ్యశ్రీ ఆమె బంధువులు తిరువూరులోని ఫ్యాక్టరీ సెంటర్‌లో బస్సు దిగి ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కగా వీరినే అనుసరిస్తూ వచ్చిన ఇద్దరు మహిళలు వీరితో పాటు ఆటో ఎక్కి, బ్యాగుల్లోని బంగారం అపహరించి వెళ్లిపోయారన్నారు. బాధితులు ఇంటికి వెళ్లి చూసుకోగా బ్యాగులో బంగారం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ గిరిబాబు నేతృత్వంలో 3 టీమ్‌లు దర్యాప్తు చేపట్టారు. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం సమ్మెటవారిగూడెంకు చెందిన మేకల లక్ష్మి పట్టణ శివారు ఆంధ్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా సీఐ, ఎస్సైలు అదుపులోకి తీసుకొని సోదా చేశారు. ఆమె వద్ద బంగారం దొరకడంతో విచారించగా ఆటోలో బంగారం తానే అపహరించినట్టు చెప్పడంతో ఆమెను అరెస్టుచేసి బంగారం స్వాధీనం చేసుకున్నామని, మరో నిందితురాలి కోసం గాలిస్తునట్టు తెలిపారు. చోరీ జరిగిన 24 గంటల్లో కేసు చేధించిన పోలీసు సిబ్బందిని డీసీపీ అభినందించారు.

నిందితురాలిపై పలు కేసులు

బంగారం చోరీ కేసులో నిందితురాలు మేకల లక్ష్మిపై ఖమ్మం, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్ జిల్లాలో పలు కేసులు నమోదైనట్టు డీసీపీ తెలిపారు. వీఎం బంజరు, కల్లూరు, విస్సన్నపేట, చింతలపూడి పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదైనట్టు వివరించారు. మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు, సీఐ గిరిబాబు, ఎస్సైలు కేవీజీవీ సత్యనారాయణ, వెంకట్రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


బంగారు వస్తువులు పరిశీలిస్తున్న డీసీపీ మహేశ్వరరాజు


అంధ బాలబాలికలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఒంగోలు జిల్లా జడ్జి రాములు

నాదీ మీ బడే.. ఇక్కడ చదివే పైకొచ్చా..!

- లక్ష్యసాధనకు వైకల్యం అడ్డుకారాదు: న్యాయాధికారి రాములు

గుణదల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'ఉన్నత శిఖరాలే లక్ష్యంగా ఎంచుకుని విద్యాభ్యాసం చేస్తే వైకల్యమనేది లక్ష్యసాధనకు అడ్డు కానేకాదని, చిన్నప్పుడు తాను కూడా మిషనరీ స్కూల్‌లోనే చదువుకున్నానని' ఒంగోలు జిల్లా న్యాయాధికారి రాములు అన్నారు. గుణదల్లోని విజయమేరి అంధ పాఠశాలను ఆయన సందర్శించారు. క్రిస్టియన్ మిషనరీ సంస్థ అంధ బాలబాలికలకు వసతి, విద్యాబోధన అందించడం గర్వించదగిన విషయమన్నారు. తన విద్యాభ్యాసం మొత్తం విఎషనరీ పాఠశాలలు, కళాశాలల్లోనే సాగిందని నేడు తానీ స్థాయిలో ఉన్నానంటే దానికి లయోల విద్యాసంస్థలే కారణమన్నారు. అంధులు నేడు చాలామంది ఉన్నతస్థాయిలో ఉన్నారని దానికి కారణం వారిలో పట్టుదల పోటీతత్వమే ప్రధాన కారణమన్నారు. కడుపేదరికంలో ఉన్నవారికి సైతం క్రిస్టియన్ మిషనరీ సంస్థలు ఆశ్రయం కల్పించి విద్యా, వైద్యం అందించడం గర్వించదగిన విషయమన్నారు. ఇలాంటి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. చిన్ననాటి నుంచి పోటీతత్వం అలవర్చుకుంటే మంచి ప్రయోజకులవుతారన్నారు. పోటీతత్వంతోపాటు ఓటమిని అంగీకరించడం విజయసాధనకు కృషి చేయడం అలవర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకుంటే మంచిమార్గంలో నడుస్తారన్నారు. విజయమేరీ అంధ బాలబాలికల పాఠశాలలో 130 మంది వసతి పొందడం విద్యనభ్యసించడం చాలా ఆనందంగా ఉందన్నారు. మీకు ఏ అవసరం ఉన్నా అండగా నిలబడతానని అభయమిచ్చారు. ఒక్కొక్క చిన్నారిని దగ్గరకు తీసుకుని సాధకబాదలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలబాలికల ప్రార్థనలో పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ తరశిల్లా పాల్గొన్నారు.

వేతన బకాయి విడుదల చేయాలి

- కలెక్టర్‌కు వెలుగు యానిమేటర్స్ సంఘం సభ్యుల విన్నపం



కృష్ణలంక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెలుగు డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న డ్వాక్రా వీవోఏ (వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం)లకు మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ వారి మెడకు ఉరితాడులా మారిందని, 5 నెలల వేతన బకాయిలు ఇవ్వలేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పనిచేస్తూ ఇదే ఉపాధిగా చేసుకొని జీవనం సాగిస్తున్నారని, డ్వాక్రా సంఘాల్లోని పేద మహిళలను కూడగట్టడంలో, బ్యాంకు లావాదేవీల్లో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో, కొత్తగ్రూపులను ఏర్పాటు చేయడంలో, వీవోఏలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అలాంటి వారికి ఈ సర్క్యులర్ అమలు వలన, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ఈ సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 13న జరిగే రాష్ట్ర ధర్నాలో పెద్దసంఖ్యలో వీవోఏలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షురాలు కమల, వీఏవో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్‌కే చాంద్ బేగం, జిల్లా నేతలు సుజాత, వీరులపాడు సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్‌కే లాల్ అహ్మద్ గౌస్ పాల్గొన్నారు.


దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణకు చిత్రపటం, శేషవస్త్రం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు

దుర్గమ్మ సన్నిధిలో దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

వన్‌టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సత్యనారాయణ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం డిప్యూటీ ఈవో రత్నరాజు ఆయనకు చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. వేద పండితులు ఆశీస్సులందజేశారు.


ఓవరాల్ చాంప్‌తో ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లు

జాతీయ ఆక్వాటెక్స్‌లో ఓవరాల్ చాంప్ ఎన్టీఆర్


విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఆర్‌కే బీచ్‌రోడ్డులోని స్విమ్మింగ్‌పూల్‌లో ఈ నెల 7, 8న జరిగిన 9వ సబ్‌జూనియర్, జూనియర్ వింటర్ ఆక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఎన్టీఆర్ జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. జిల్లా నుంచి 41 మంది స్విమ్మర్లు బరిలో దిగగా, 24 స్వర్ణాలు, 22 రజతాలు, 13 కాంస్యాలతో మొత్తం 199 పాయింట్లతో అగ్రభాగాన నిలిచారు. ఎం సాయిత్ 25 పాయింట్లు, యు ప్రేమామృత 25 పాయింట్లు, ఎన్ పావని సరయు 25 పాయింట్లను వశం చేసుకున్నారన్నారు. పతకాలను సాధించిన స్విమ్మర్లను జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, ట్రెజరర్ కే రమేష్, సెక్రటరీ ఐ రమేష్‌తో పాటు కోచ్‌లు ఎం మాల్యాద్రి, ఏ లక్ష్మణ్, ఎస్‌కే రఫీ, ఎన్ నితీష్‌కుమార్, గౌతమ్ అభినందించారు.


విజేతలతో నిర్వాహకులు

జాతీయ కరాటేలో సత్తా

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఆదివారం రాత్రి హోరాహోరీగా సాగిన ఇన్విటేషనల్ సీఎం కప్ 15వ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో విజేతలను నిర్వాహకులు జే హరినాథ్ ప్రకటించారు. బ్రహ్మం షిటోరియా కరాటే అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో జేకే గోజుర్యో కరాటే అకాడమీ విద్యార్థులు పలువురు విజేతలుగా నిలిచారు. వీరిని జేకే ఫౌండర్ జే శ్రీనివాసులు అభినందించారు. నిర్వాహకులు జే దినేష్, టీవీ సాయికుమార్, నర్సింహారెడ్డి, హర్ష, బ్రహ్మానందం, విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విజేతలను అభినందించారు.

స్వర్ణాలు సాధించిన వారు: కే భువనసాయి, చార్వి అగర్వాల్, టీ హర్షిత, బీ లిప్సిక, డీ శరణ్య, జెనీత్, యస్విన్ సదాశివ, చుజిత్ మనీశ్వర్, వెంకట నాగ సాయి ప్రసాద్‌రెడ్డి, ఈశ్వర్ కృష్ణ సాధించగా, జే పునీష్ రెడ్డి, జే పుష్కర్‌రెడ్డి, ఎండీ అయాన్ రజతాలను వశం చేసుకున్నారు. జోష్విత, కే హేమంత్ కాంస్యాలను సాధించారని హరినాథ్ వివరించారు.


బోల్తాకొట్టిన ఆటోలో నుంచి బయటపడిన గాయపడ్డ కూలీలు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

- పది మందికి స్వల్పగాయాలు

పామర్రు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పామర్రు- విజయవాడ ప్రధాన జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలవడంతోపాటు మరో 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. గూడూరు మండలం మల్లవోలు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు ఆటోలో పనుల నిమిత్తం మండల పరిధిలోని కనుమూరు గ్రామానికి వసున్నారు. అలా వస్తు న్న ఆటో కురుమద్దాలి పై ఓవర్ వంతెన సమీపిస్తున్న సమయంలో టైర్ పేలడంతో ఆటో బోల్తాకొట్టింది. దాంతో దీంతో తీవ్రగాయాలపాలైన ముగ్గురిని 108 అంబులెన్స్ ద్వారా బందరు ప్రభుత్వాసుపత్రికి చికిత్సకు తరలించారు. పేర్లు, వివరాలు వెల్లడి కాలేదు. కేసు ఎస్సై సీహెచ్ అనినాష్ దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్లో గోల్డ్ మాఫియా డాన్!

- ఇతర ప్రాంతాల నుంచి అనధికారికంగా బంగారం తరలింపు
- వైసీపీ ప్రభుత్వంలో జోరుగా దొంగ బంగారం వ్యాపారం
- పలువురి నెత్తిన టోపీ.. డబ్బులిస్తానని హోటల్‌కు రమ్మని పరార్

వన్‌టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య వ్యాపార కేంద్రమైన విజయవాడ వన్‌టౌన్‌లో బంగారం వర్క్‌షాపు నిర్వహిస్తున్న ఓ వ్యాపారి గోల్డ్ మాఫియా డాన్‌గా అవతారం ఎత్తాడు. బంగారం వ్యాపారులకు తక్కువ ధరకు బంగారం బిస్కెట్లు అమ్ముతానని మాయమాటలు చెప్పి మోసగించటంతో బాధితులు లబోదిబోమంటున్నారు. బాధితులకు డబ్బులిస్తామని కాలయాపన చేస్తూ కనిపించకుండా తిరగటంతో పలువురు రహస్యంగా క్రైం పోలీసులను ఆశ్రయించినట్టు తెలుస్తుంది. అక్కడి అధికారుల్లో కొందరు పరిచయం ఉండటంతో ఎలాంటి చర్యలు తీసుకోకుండా సెటిల్ చేసుకోమంటూ సూచనలిస్తున్నట్టు తెలుస్తోంది. కండ్రిక ప్రాంతానికి చెందిన 'ఆర్‌కే' అనే వ్యక్తి సుమారు 15ఏళ్ల క్రితం వన్‌టౌన్ మార్వాడీ వీధిలో బంగారం వ్యాపారి వద్ద గుమస్తాగా పనిచేశాడు. అనంతర కాలంలో ఆ వ్యాపారి వ్యాపారాన్ని ఆపేయడంతో అక్కడ పనిచేసిన ఆర్‌కే మాత్రం వన్‌టౌన్‌లో బంగారు ఆభరణాల వర్క్‌షాపును ప్రారంభించాడు. బంగారం బిస్కెట్లను ఇతర ప్రాంతాల నుంచి రహస్యంగా తెచ్చి పలువురు వ్యాపారులకు అమ్మటం ప్రారంభించాడు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ట్యాక్స్‌లను ఎగ్గొట్టి రోజుకు నాలుగైదు బిస్కెట్లు అమ్ముతూ బిస్కెట్‌పై రూ.60 నుంచి రూ.70వేల వరకు సంపాదిస్తున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు. వన్‌టౌన్‌లో మరో మూడు వర్క్‌షాపులు, రాధానగర్‌లో రూ.కోట్ల విలువైన రెండు బిల్డింగ్‌లను కొనుగోలు చేశాడు. ఈ ఏడాదిలో ఓ నేరస్థుడిని క్రైం పోలీసులు పట్టుకోగా, దొంగిలించిన బంగారాన్ని ఆర్‌కే అనే వ్యాపారికి అమ్మినట్టు విచారణలో బయటపడినట్టు సమాచారం. వైసీపీ ప్రభుత్వంలో ఓ మాజీ మంత్రికి ముఖ్య అనుచరుడిగా ఉంటూ అడ్డగోలుగా వ్యాపారం చేసిన ఈ డాన్ తనపై పోలీసు నిఘా ఉంటుందనే జాగ్రత్తతో ఓ అధికార పార్టీలోకి జంప్ అవ్వాలని ప్రయత్నించగా ఇతడి గురించి తెలుసుకున్న పార్టీ నేతలు చివాట్లు పెట్టి మళ్లీ కనిపించొద్దంటూ హెచ్చరించటంతో ఉత్తరాంధ్రలోని ఓ ఎంపీని, ఎమ్మెల్యేను కలిసి అధికార పార్టీలోకి రావటానికి ప్రయత్నాలు చేసినట్టు తెలుస్తోంది. ఈ డాన్ ఆగడాలతో తమ వ్యాపారం తగ్గిపోతోందని వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

సీసీ రోడ్డుపై మరో సీసీ రోడ్డు

- కృష్ణా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు.. అధికారులపై ఆగ్రహం.. విచారణకు ఆదేశం

తోట్లవల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అధ్వాన్న రోడ్లను వదిలేసి చక్కగా ఉన్న రోడ్లపైనే పై పూతగా మళ్లీ రోడ్డు నిర్మిస్తున్న వైఖరిపై గరికపర్రుకు చెందిన రైతు మైనేని తారాచంద్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని గరికపర్రు శివారు వేణుగోపాలపురంలో సూరపనేని బాపయ్య ఇంటి నుంచి సూరపనేని వెంకట కృష్ణయ్య ఇంటి వరకు 2017లో రూ 3.50 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మించారని, ఈ రోడ్డు ఎక్కడా చెక్కు చెదరకుండా ఉందని, ఇదేరోడ్డుపై తాజాగా ఉపాధిహామీ నిధులు రూ.7.50 లక్షలు కేటాయించి ఆదివారం సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారని తారాచంద్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి భర్త కాంట్రాక్టరుగా మారి ఈ రోడ్డు నిర్మిస్తూ నిధులను దుర్వినియోగం చేస్తున్నాడన్నారు. గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఏరియాల్లో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచని రోడ్లున్నాయని, వాటిని విస్మరించి మంచిగా ఉన్న రోడ్డుపైనే మరో రోడ్డు వేయటం వెనుక అవినీతి దాగుందని తెలిపారు. ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ బాలాజీ ఉన్నతాధికారులను తక్షణమే పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిపారు. నిధుల కొరతను ఎదుర్కొంటున్న తరుణంలో రోడ్డుపై రోడ్డు ఎలా వేయిస్తారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు ఆయన తెలిపారు.


బాగున్న సీసీరోడ్డుపై కొత్తగా మరో సీసీ రోడ్డు నిర్మిస్తున్న కార్మికులు

నవ ఆవిష్కరణలకు వేదిక పాలీటెక్ ఫెస్ట్

రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ జేడీ పద్మారావు

కృష్ణలంక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నవ ఆవిష్కరణలకు పాలీటెక్ ఫెస్ట్ ఓ గొప్ప వేదికని, యువ మెదళ్ల నుంచి వచ్చిన కొత్త ఆలోచనలకు ప్రతిరూపంగా విద్యార్థుల ప్రాజెక్టులున్నాయని రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ జేడీ వి.పద్మారావు అన్నారు. సోమవారం విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రీజనల్ పాలీటెక్ ఫెస్ట్-2024ను పద్మారావు, ఎస్‌బీటీఈటీ కార్యదర్శి జీవీ రామచంద్రరావు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ రీజనల్ పాలీటెక్ ఫెస్ట్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని 5 ప్రభుత్వ, 10 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు 129 ప్రాజెక్టులను ప్రదర్శనకు ఉంచినట్టు తెలిపారు. మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కొత్త ఆలోచనలకు ఆచరణ రూపమిచ్చి ప్రాజెక్టులను రూపొందించడం అభినందనీయమన్నారు. 8వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయసారథి, వివిధ విభాగాధిపతులు, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న పద్మారావు

ఏషియన్ రోలర్ స్కేటింగ్‌కు సహకరిస్తాం

- శాప్ చైర్మన్ రవినాయుడు హామీ

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2027 సెప్టెంబర్‌లో జరిగే 21వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌కు శాప్ నుంచి సహాయ సహకారాలను అందిస్తామని చైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ పీఎస్ గిరిషా హామీ ఇచ్చారు. ఈ చాంపియన్‌షిప్‌ను భారత్‌కు ఎలాట్ చేయగా, రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్‌కు కేటాయిస్తూ తన సమ్మతిని తెలిపింది. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ ఇలాంటి అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌ను రాష్ట్రానికి కేటాయించడం ఆనందంగా ఉందని, దీనికి కృషి చేసిన ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ సెక్రటరీ థామస్‌ను సత్కరించారు. టోర్నీలో 11 విభాగాల్లో 42 దేశాలకు పైగా 3000 మంది ప్రపంచస్థాయి స్కేటింగ్ క్రీడాకారులు జూనియర్, సీనియర్ ఏజ్ కేటగిరిలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ టోర్నీని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు చంద్రబాబు సహకారంతో ముందుకెళ్తామన్నారు.


వినతిపత్రం అందుకుంటున్న శాప్ చైర్మన్ రవినాయుడు, గిరిషా



ఉల్లాసంగా ఉత్సాహంగా..

- సిద్ధార్థలో ఘనంగా ఫెట్

లబ్బీపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని వ్యాపార, నైపుణ్యాతా విలువలు వెలికి తీయడానికి ఇలాంటి ఫెట్‌లు దోహదం చేస్తాయని ఆంధ్రప్రదేశ్ క్రాఫ్ట్ కౌన్సిల్ చైర్ పర్సన్ సూరెడ్డి రంజన అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో ఫెట్-2024 సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల మాజీ డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ కళాశాల 30 ఏళ్లుగా ఈ ఫెట్‌ను ఘనంగా నిర్వహిస్తోందని, విద్యార్థులెంతో ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తారన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఏపీ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మౌలానా ముస్తాక్ అహ్మద్

అధినేత నమ్మకాన్ని వమ్ముచేయను

» మౌలానా ముస్తాక్ అహ్మద్

విజయవాడ (వన్‌టౌన్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా మౌలానా ముస్తాక్ అహ్మద్ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ ఎండీ యాకూబ్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా మౌలానా ముస్తక్ అహ్మద్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అనేక సవాళ్లను, కేసులను ఎదుర్కొన్న ప్రతి కార్యకర్తకూ న్యాయం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానంటూ చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి మాజీ చైర్మన్ అహ్మద్ షరీఫ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, నక్కా ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

డ్రోన్, ఫైబర్ నెట్ కార్పొరేషన్లకు ఈడీలు

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డ్రోన్, ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లను నియమిస్తూ మౌలిక సదుపాయల కల్పన శాఖ కార్యదర్శి సురేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వు జారీ చేశారు. డ్రోన్ కార్పొరేషన్ ఈడీగా డిప్యూటీ కలెక్టర్ వాకా శ్రీనివాసులు రెడ్డిని, ఫైబర్‌నెట్ ఈడీలుగా డిప్యూటీ కలెక్టర్‌లు ఎస్.రాజశేఖర్, కె.రమేశ్‌నాయుడులను నియమించారు.

క్షేత్రస్థాయిలోనే చెక్ పడాలి!

పంపిణీ దగ్గరే బ్రేకులు వేయాలి
పోర్టుల్లో తనిఖీలతోనే ఏమీకాదు

రేషన్ డీలర్లు దారి మళ్లిస్తేనే కేసులు
కానీ, కార్డుదారులే ఇచ్చేస్తున్నారు
అక్రమ బియ్యంపై పోలీసుల నివేదిక సిద్ధం

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందజేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఉండాలంటే పోర్టులో చర్యలతోనే సరిపెడితే కుదరదు. క్షేత్రస్థాయిలోనే చెక్ పడాలి! ముందు అసలు బియ్యం సరఫరాలోనే దుర్వినియోగం ఆపాలి. మిల్లర్లు, ఎగుమతిదారులకు రేషన్ బియ్యం చేరకుండా ఉండాలంటే డీలర్లు, లబ్ధిదారుల నుంచే సంస్కరణ మొదలు పెట్టాలి. అధికారుల లంచాలు, ప్రజాప్రతినిధుల మామూళ్లు, మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట పడాలంటే ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసు శాఖ గట్టిగా సూచించనుంది. రాష్ట్రం నుంచి రేషన్ బియ్యం అక్రమ ఎగుమతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగిపోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సీఎస్, డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్ ఇతర ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాకినాడ పోర్టు నుంచి లక్షల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని ఆఫ్రికా దేశాలకు అక్రమంగా రవాణా చేస్తూ వేలకోట్లు దోచుకొంటున్న మాఫియా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ తన పరిశీలనతో నివేదికను సిద్ధం చేసింది. 1.48లక్షల కుటుంబాలకు ఏటా 12,800కోట్లు ఖర్చు చేసి పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా సరఫరా చేస్తున్నాయి. ఈ బియ్యాన్ని కాకినాడ పోర్టు నుంచి విచ్చలవిడిగా ఆఫ్రికా దేశాలకు అక్రమంగా ఎగుమతి చేస్తున్న మాఫియా కట్టడికి ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రయత్నించడం జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. బియ్యం అక్రమ ఎగుమతులు, అక్రమార్కుల దోపిడీపై తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి వెళ్లి పవన్ కల్యాణ్ చర్చించారు. కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయి పేదల ఆకలి తీరకపోగా, మాఫియా ప్రమాదకరంగా తయారయ్యే అవకాశం ఉందని వివరించారు. అనంతరం సీఎస్ నీరబ్‌కుమార్, డీజీపీ ద్వారకా తిరుమల రావు, ఇంటెలిజెన్స్ అధిపతి మహేశ్ చంద్ర లడ్హాతో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ ఎగుమతులు ఆగిపోవాల్సిందేనని, అందుకు అవసరమైన చర్యలు ఏమేమి తీసుకోవాలో ఉన్నతస్థాయిలో చర్చించి సూచనలు చేయాలని ఆదేశించారు. దీంతో జిల్లాల నుంచి సమాచారాన్ని తెప్పించుకున్న పోలీసు ఉన్నతాధికారులు మొత్తం చైన్‌పై సమీక్షించారు. రేషన్ మాఫియా కట్టడికి ఇబ్బందులు, సవాళ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదిక సిద్ధం చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు...



ఖాతాలో నగదు లేదా సన్న బియ్యం సరఫరా

రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులే స్వచ్ఛందంగా డీలరుకు ఇచ్చి డబ్బు తీసుకొంటున్నారు. వీధి చివరల్లోకి బియ్యం తీసుకొచ్చే వాహనం దగ్గరికి వెళ్లి కిలో పది నుంచి పన్నెండు రూపాయలకు ఇచ్చేస్తున్నారు. మరి కొన్ని చోట్ల ఆటోలు తీసుకుని చిరు వ్యాపారులు ఇళ్లకు వెళ్లి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. వాటిని ఒక గోడౌన్‌కు చేర్చి రైస్ మిల్లర్‌కు విక్రయిస్తే అక్కడ పాలిష్ చేసి ఎగుమతిదారులకు విక్రయిస్తున్నారు. అయితే, లబ్ధిదారుల నుంచి ఎగుమతిదారు వరకూ అందరిపై చర్యలు తీసుకోవడం కష్టం. ప్రభుత్వం పేదలకు ఉచితంగా సరఫరా చేస్తున్న బియ్యాన్ని రేషన్ డీలర్ పక్కదారి పట్టిస్తే ఐపీసీ 409(బీఎన్ఎస్ 316) కింద పోలీసులు కేసు నమోదు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఎక్కువ మంది లబ్ధిదారులు బియ్యం వద్దు.. డబ్బులు ఇవ్వండి అంటున్నారు. క్షేత్రస్థాయిలో బియ్యం వద్దని స్వచ్ఛందగా వదులుకొంటున్న తెల్ల రేషన్ కార్డు దారులకు ఖాతాలో నగదు జమ చేయడం లేదా సన్న బియ్యం సరఫరా చేస్తే ఫలితం ఉండొచ్చు. కృష్ణా, గోదావరి డెల్టా నుంచి కాకినాడకు.. కర్నూలు, అనంతపురం నుంచి కర్ణాటకకు ఇడ్లీరవ్వ, దోసె పిండికి; ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు నుంచి తమిళనాడుకు ఇడ్లీ రవ్వ కోసం వెళుతోందని నివేదికలో వివరించినట్లు తెలిసింది.

ప్రజా ప్రతినిధులు, అధికారులకు మామూళ్లు..

బియ్యం వ్యాపారులు, ఎగుమతిదారుల నుంచి ఎక్కడికక్కడ ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులకు మామూళ్లు అందుతున్నాయి.. పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులకు రేషన్ మాఫియా తగిన స్థాయిలో చేతులు తడుపుతోంది. బియ్యం వ్యాపారంపై ఆటోలు, లారీల నుంచి షిప్పుల వరకూ రవాణా రంగం ఆధారపడింది. జిల్లాల్లో దీనిపైనే ఆధారపడి బతికే వర్గం ఉంది. పోర్టులో పదిహేను వేల మంది ఉపాధికి ఇబ్బందులు ఎదురైతే నిరసన వ్యక్తమయ్యే అవకాశం ఉంది. వాణిజ్యం పెరగాలన్న ప్రభుత్వ లక్ష్యం అధిగమించేందుకు సవాళ్లు ఎదురవ్వచ్చు. వ్యాపార వర్గాలు, రైస్ మిల్లర్ల నుంచి ఒత్తిళ్లు రావొచ్చు. రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు విషయంలోనూ రకరకాల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. వీటన్నింటితోపాటు ఆహార ధాన్యాల ధరల స్థిరీకరణపైనా ప్రభావం పడొచ్చని నివేదించినట్లు సమాచారం.

మాఫియాకు రెడ్ సిగ్నల్.. సాఫీ వ్యాపారానికి పచ్చజెండా..

రేషన్ బియ్యం ఎగుమతి చాలాకాలంగా ఉంది. గడిచిన ఐదేళ్లలో అదొక మాఫియాగా తయారైంది. ఆ మాఫియాను కట్టడి చేసి సాఫీగా వ్యాపారం చేసుకోవడానికి అనుమతివ్వొచ్చు. లబ్ధిదారుల అభిప్రాయాలు తీసుకుని పది రూపాయలకు విక్రయించే కిలో బియ్యానికి 20రూపాయలు ఇస్తామని ప్రభుత్వం చెప్పొచ్చు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్ కార్డుతో సంబంధం లేదని చెబితే స్వచ్ఛంధంగా వాటిని వదులుకునే వారు ఉన్నారు. దీంతో 43రూపాయల భారం ప్రభుత్వంపై నుంచి తగ్గుతుంది. డీలర్లను బెదిరించి లంచాలు తీసుకునే అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఇందులో విజిలెన్స్, పోలీసు అధికారులకు మామూళ్లు అందినా వెంటనే ఏసీబీ రంగంలోకి దిగాలి. రైతుల ప్రయోజనాలు, సాఫీ వ్యాపారాన్ని అడ్డుకోకూడదు. ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే ఈ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉందని తన నివేదికలో పోలీసు శాఖ వివరించినట్లు తెలిసింది.

ఇలా చేస్తే...

- ఎక్కువ మంది లబ్ధిదారులు బియ్యం వద్దు.. డబ్బులు ఇవ్వండి అంటున్నారు. బియ్యం స్వచ్ఛందంగా వదులుకొంటున్న కార్డు దారుల ఖాతాలో నగదు జమ చేయడం లేదా సన్న బియ్యం సరఫరా చేస్తే ఫలితం ఉండొచ్చు.
- లబ్ధిదారుల అభిప్రాయాలు తీసుకుని పది రూపాయలకు విక్రయించే కిలో బియ్యానికి 20రూపాయలు ఇస్తామని ప్రభుత్వమే ముందుకురావచ్చు.
- ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్ కార్డుతో సంబంధం లేదని చెబితే స్వచ్ఛందంగా వాటిని వదులుకునే వారు చాలామంది ఉంటారు.
- రేషన్ డీలర్లను బెదిరించి లంచాలు తీసుకునే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- అక్రమ బియ్యం కట్టడి చేసే క్రమంలో రైతుల ప్రయోజనాలను, సాఫీ వ్యాపారాన్ని అడ్డుకోకూడదు.

'సిట్' అనగానే అవినీతిపరుల పరుగు

గత ఐదేళ్లలో పేదల బియ్యం కోసం 80 వేల కోట్ల ఖర్చు.. సింహభాగం అక్రమార్కులకే : లంకా దినకర్

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'పేదల బియ్యం దోపిడీపై రాష్ట్ర ప్రభుత్వం సిట్ అనగానే కలుగులో ఉన్న అవినీతిపరులు స్టాండ్, అటెన్షన్ అండ్ రన్ అనే పరిస్థితికి వచ్చారు. సిట్, పేదల బియ్యం దోపిడీ ముఠా ఆట కట్టిస్తుంది. కాకినాడ పోర్టులో కూలీలకు పని కల్పించడం అంటే అక్రమ బియ్యం వ్యాపారంతో కాదు. సక్రమమైన ఎగుమతులు, దిగుమతుల వ్యాపారంతో మాత్రమే అని గుర్తుంచుకోవాలి' అని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. అమరావతి సచివాలయంలోని తన చాంబర్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో రమారమీ రూ.80 వేల కోట్లు ఖర్చయింది. 2019-24 మధ్య పేదలకు అందాల్సిన రూ.80 వేల కోట్ల ఉచిత బియ్యంలో సింహభాగం అవినీతిపరులకు ఆదాయమార్గంగా మారింది. 2019-24 మధ్య పౌర సరఫరాల శాఖ రూ.20,931 కోట్లు అదనపు అప్పు చేసింది. సిట్ నివేదిక అందిన వెంటనే పేదల బియ్యం రీసైక్లింగ్ చేసి, అవినీతి చేసిన వారిపైన రాష్ట్ర ప్రభుత్వం చట్ట పరంగా చర్యలు తీసుకుంటుంది' అని లంకా దినకర్ స్పష్టం చేశారు.

రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగాయి

» ఎన్‌హెచ్‌ఆర్సీ, ఎస్సీ కమిషన్లకు వైసీపీ ఫిర్యాదు

న్యూఢిల్లీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులపై దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ ఎన్‌హెచ్‌ఆర్సీ, జాతీయ ఎస్సీ కమిషన్లకు వైసీపీ సోమవారం ఫిర్యాదు చేసింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరింది. అనంతరం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆ పార్టీ ఎంపీలు గురుమూర్తి, గొల్ల బాబూరావు, మాజీ ఎంపీ మార్గాని భరత్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులను బెదిరించి దాడులకు పాల్పడుతోందని అన్నారు. రాజమండ్రిలో దళితుడు పులి సాగర్‌ను పోలీసులు దుస్తులు తొలగించి సెల్‌లో పెట్టారని ఆరోపించారు. ఒక మహిళా కానిస్టేబుల్ సమక్షంలో ఈ దారుణానికి పాల్పడ్డారని చెప్పారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్‌హెచ్‌ఆర్సీ, ఎస్సీ కమిషన్లు భరోసా ఇచ్చాయని తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టి.. 2.5 కి.మీ. ఈడ్చుకెళ్లి..!

మద్యం మత్తులో లారీ డ్రైవర్ బీభత్సం

మద్దిపాడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ట్రాన్స్‌పోర్టు లారీ డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. ఈ ప్రమాదంలో చిన్నారి మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఒంగోలు నుంచి రాజమండ్రికి వెళుతున్న క్రాంతి ట్రాన్స్‌పోర్టు లారీ అతివేగంతో వస్తూ ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం సీతారాంపురం వచ్చేసరికి రోడ్డుపై స్టాపర్లను ఢీకొంది. అదే వేగంతో ముందుకెళ్లి రోడ్డు దాటడానికి వేచి ఉన్న బైక్‌ను ఢీకొంది. లారీ వెనక కొక్కేనికి బైక్ ఇరుక్కుపోయింది. డ్రైవర్ లారీని ఆపకుండా ముందుకు పోతూ రోడ్డుపక్కన నడుస్తున్న ఇద్దరినీ ఢీకొట్టడంతో ఎగిరి పక్కన పడ్డారు. తీవ్రగాయాలైన ఇద్దరినీ ఆస్పత్రికి తరలిస్తుండగా కోస్టాల్‌కు చెందిన గోరంట్ల రష్మంత్(5) మృతిచెందాడు. తినుబండారాలు కొనేందుకు పినతండ్రి రామాంజనేయులు తీసుకుని రాగా లారీ వారిపైకి దూసుకెళ్లింది. హైవే పెట్రోలింగ్ పోలీసులు వెంబడించి, 2.5 కిలోమీటర్ల దూరం వెళ్లాక లారీని ఆపారు. లారీడ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు తెలుస్తోంది.

నవ్య | చిత్రజ్యోతి

మంచు కుటుంబంలో మంటలు

- ఊహించని మలుపులు, నిమిషానికో పరిణామం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మనోజ్
- చిన్న కొడుకు నుంచి రక్షణ కల్పించాలని సీపీని అభ్యర్థించిన మోహన్‌బాబు





మంచు కుటుంబంలో అగ్గి రాజుకుంది. సోమవారం అది ఊహించని మలుపులు తిరిగి పెద్ద మంటలా మారింది. మోహన్‌బాబు, ఆయన తనయుడు మనోజ్ .. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ పోలీస్ స్టేషన్ కు వెళ్లడంతో వివాదం మరింత ముదిరింది. ఆస్తుల పంపకాల విషయంలో మోహన్‌బాబుకు, ఆయన చిన్న కొడుకు మనోజ్‌కు మధ్య గొడవ జరిగినట్లు, ఇద్దరూ కొట్టుకున్నట్లు ఆదివారం మీడియా వర్గాల్లో వార్తలు హల్‌చల్ చేశాయి. అదంతా నిజం కాదని, అబద్ధపు వార్తలు ప్రచారం చేయొద్దని మోహన్‌బాబు ట్విటర్‌లో ప్రకటించిన కొన్ని గంటలకే బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఎంఎల్‌సీ (మెడికల్ లీగల్ సర్టిఫికెట్) చేయించిన మనోజ్ ఆ మెడికల్ రిపోర్టులతో సహా.. వెళ్లి పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, ఆదివారం పది మంది గుర్తుతెలియని వ్యక్తులు తమ ఇంటికి (జల్‌పల్లిలోని మోహన్‌బాబు నివాసం) వచ్చి గట్టిగా అరుస్తూ భయభ్రాంతులకు గురిచేశారని, వారిని అడ్డుకునే సమయంలో తన దాడి చేశారనీ, ఇంటి ఆవరణలోని సీసీటీవీ ఫుటేజీలు ఎత్తుకెళ్లారని, దుండగులను పట్టుకొని చట్ట ప్రకారం శిక్షించాలని మనోజ్ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

మనోజ్, మౌనికపై సీపీకి ఫిర్యాదు చేసిన మోహన్‌బాబు

ఇదిలా ఉంటే తన కొడుకు మనోజ్, ఆయన భార్య మౌనిక, వారి అనుచరుల ద్వారా తనకు ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని రాచకొండ సీపీకి మోహన్‌బాబు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీపీకి రాసిన లేఖను మోహన్‌బాబు మీడియాకు విడుదల చేశారు. కొంతమంది సంఘ విద్రోహ శక్తులతో కలిసి తన ఇంటిని, ఆస్తులను లాక్కోవాలని చూస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. తన కొడుకు మనోజ్, కోడలు మౌనిక ప్లాన్ ప్రకారమే ఇదంతా జరుగుతున్నట్లు నమ్ముతున్నానని వెల్లడించారు. తను 78 ఏళ్ల సీనియర్ సిటిజన్‌ననీ, తనకు రక్షణ కల్పించాలని అభ్యర్థిస్తున్నట్లు సీపీకి రాసిన లేఖలో మోహన్‌బాబు పేర్కొన్నారు. తన తండ్రి, అన్న విష్ణు అనుచరులు తనపై దాడిచేశారని మనోజ్ పోలీసు స్టేషన్‌కు వెళ్లడం, మనోజ్ దంపతులు వల్లనే తనకు ప్రాణహాని ఉందని మోహన్‌బాబు సీపీకి లేఖ రాయడం.. వంటి ఊహించని మలుపులతో కథ క్లైమాక్స్‌కు చేరింది. అసలు మోహన్ బాబు ఇంట్లో ఏం జరుగుతోందని అటు సినీ అభిమానుల్లో, ఇటు ఇండస్ట్రీలో తీవ్ర చర్చ జరుగుతోంది.

బౌన్సర్లతో నిండిపోయిన జల్‌పల్లి నివాసం..


ఆదివారం మనోజ్‌పై తన తండ్రి మోహన్‌బాబు, ఆయన అనుచరులతో పాటు.. మంచు విష్ణు ప్రధాన అనుచరుడు, మోహన్‌బాబు స్కూళ్ల పర్యవేక్షకుడు వినయ్ సహా.. కొంతమంది బౌన్సర్లు మనోజ్, ఆయన భార్య మౌనికపై దాడి చేసి గాయపరిచినట్లు తెలిసింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న మనోజ్ దంపతులు తమకు రక్షణగా సుమారు 40 మంది బౌన్సర్లను రంగంలోకి దింపినట్లు తెలిసింది. అంతేకాకుండా రాయలసీమ నుంచి భూమా అనుచరులు, కొంతమంది మహిళా బౌన్సర్లు మనోజ్ దంపతులకు రక్షణగా వచ్చినట్లు తెలిసింది. అలాగే మంచు విష్ణు కూడా తన తండ్రి మోహన్‌బాబుకి రక్షణగా పెద్ద సంఖ్యలో బౌన్సర్లను ఏర్పాటు చేశారు. దాంతో జల్‌పల్లి నివాసం బౌన్సర్లమయంగా మారిపోయింది.

అక్క మాట వినని మనోజ్

ముంబైలో ఉంటున్న మంచు లక్ష్మీ ఈ వివాదం గురించి తెలుసుకుని సోమవారం ఉదయం జల్‌పల్లిలోని ఇంటికి వచ్చారు.. తమ్ముడికి నచ్చజెప్పడానికి ఆమె ప్రయత్నించినట్లు సమాచారం. అయితే మనోజ్ తన మాట వినక పోవడంతో చేసేదేమీ లేక మంచు లక్ష్మీ వెనుదిరిగి ముంబై వెళ్లిపోయినట్లు తెలిసింది. ఆమె వెళ్లిన కాసేపటికి మోహన్‌బాబు కూడా ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఇలా తండ్రీకొడుకుల మధ్య వివాదం రాను రాను ముదురుతుండడంతో మోహన్‌బాబు కుటుంబానికి సన్నిహితులు, శ్రేయోభిలాషులు రంగంలోకి దిగి వివాదాన్ని పరిష్కరించడానికి ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. మంగళవారం సమస్యలన్నీ ఓ కొలిక్కి వచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.


- హైదరాబాద్ సిటీ/ పహాడీషరీఫ్ (ఆంధ్రజ్యోతి)

ముఫాసా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా



హాలీవుడ్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'ద లయన్ కింగ్' సినిమాకు కొనసాగింపుగా తెరకెక్కిన చిత్రం 'ముఫాసా: ద లయన్ కింగ్'. బారీ జెంకిన్స్ దర్శకత్వంలో వాల్ట్ డిస్నీ సంస్థ నిర్మించింది. ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సినిమా తెలుగు డబ్బింగ్ వెర్షన్‌లో 'ముఫాసా' పాత్రకు మహేశ్‌బాబు వాయిస్ అందివ్వనున్న సంగతి తెలిసిందే. తాజాగా, ఈ సినిమా కోసం వాయిస్ ఇవ్వడంపై మహేశ్ ఆనందం వ్యక్తం చేశారు. "ముఫాసా' ఇప్పటివరకూ వచ్చిన అత్యంత పాపులర్ పాత్రల్లో ఒకటి. ఈ ప్రాజెక్ట్‌లో భాగమవ్వడం ఎంతో సంతోషాన్నిస్తోంది. ముఫాసా తన కుటుంబాన్ని చూసుకునే విధానం అద్భుతం. ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని చెప్పారు. కాగా, 'లయన్ కింగ్' మొదటి భాగం 1994లో విడుదలై సంచలన విజయం సాధించింది. దీనిని 2019లో మళ్లీ రీమేక్ చేసిన మేకర్స్.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులని ఆకట్టుకున్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ పై డాక్యుమెంటరీ



రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్' ఆస్కార్‌తో పాటు ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రబృందం ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చింది. 'ఆర్‌ఆర్‌ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' పేరుతో ఒక డాక్యుమెంటరీని చిత్రీకరించినట్లు ప్రకటించింది. ఈ నెలలోనే రిలీజ్ చేయనున్న ఈ డాక్యుమెంటరీలో 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం తెరవెనుక ఏం జరిగింది. దీన్ని ఎలా రూపొందించారో చూపిస్తామని చిత్రబృందం పేర్కొంది. 2022లో అల్లూరి సీతారామరాజు, కొమురం భీమ్ ప్రధాన పాత్రలతో రూపొందిన ఈ కల్పిత కథ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అల్లూరి సీతారామరాజు పాత్రలో రామ్‌చరణ్, కొమురం భీమ్ పాత్రలో ఎన్టీఆర్ నటించారు.



రష్మికపై కవిత అల్లిన విజయ్

రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి నటిస్తున్న చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. సోమవారం ఈ సినిమా టీజర్‌ను హీరో విజయ్ దేవరకొండ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఇందులోని ప్రతీ విజువల్ ఆకట్టుకుంటుంది. ప్రతీ ప్రేక్షకుడిని కదిలించేలా సినిమా ఉంటుందని ఆశిస్తున్నా. నటిగా రష్మికను ఓ మెట్టు ఎక్కించే చిత్రమిది. టీమ్ మొత్తానికి ఆల్ ద బెస్ట్" అని చెప్పారు. టీజర్‌లో రష్మిక పాత్రను విజయ్ ఓ అందమైన కవితను చెప్తూ పరిచయం చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది.

రంగాచారి పాత్ర దక్కడం అదృష్టం



రాజేంద్ర ప్రసాద్

మ్యాగీ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న వెబ్ సిరీస్ 'హరికథ'. రాజేంద్రప్రసాద్, శ్రీరామ్, దివి, పూజిత పొన్నాడ, మౌనిక రెడ్డి, అర్జున్ అంబటి, రుచిర సాధినేని, శ్రీయా కొట్టం, ఉపాశ్రీ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సిరీస్ ఈనెల 13 నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవనుంది. ఈ సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'హరికథ'లాంటి గొప్ప స్క్రిప్ట్ రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఎన్టీఆర్, ఏఎన్నార్ చేయాల్సిన రోల్ నాకు దక్కడం సంతోషంగా ఉంది. హరికథలు చెబుతూ జీవితాంతం హరి నామస్మరణ చేసే రంగాచారి పాత్రలో కనిపిస్తాను' అని చెప్పారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ తెలుగు వెబ్‌సిరీస్‌లలో ఒక స్టాండర్డ్ క్రియేట్ చేసేలా 'హరికథ' ఉంటుంది' అని అన్నారు. దర్శకుడు మ్యాగీ మాట్లాడుతూ' ఈ స్క్రిప్ట్ చాలా వైవిధ్యమైనది. చాలా పెద్ద స్క్రిప్ట్. యూనిట్‌లోని ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి సక్సెస్‌ఫుల్‌గా సిరీస్ మీ ముందుకు వచ్చేలా చేశారు' అని అన్నారు.

సైలెంట్ మ్యాన్ వైలెంట్‌గా మారితే...



చియాన్ విక్రమ్ నటిస్తున్న యాక్షన్ డ్రామా 'వీర ధీర శూరన్:2'. ఎస్‌జే సూర్య, సూరజ్ వెంజరమూడు, దుషార విజయన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్‌యు అరుణ్‌కుమార్ దర్శకత్వంలో రియా శిబు నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన గ్లింప్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. సోమవారం టీజర్‌ను విడుదల చేశారు. ఇందులోని పోరాట సన్నివేశాలు.. విజువల్స్ ఆకట్టుకున్నాయి. కిరాణా కొట్టు నడుపుకొనే ఓ సాధారణ మధ్య తరగతి వ్యక్తి.. ఓ సమస్యలో చిక్కుకుని హఠాత్తుగా వయొలెంట్‌గా మారి విలన్లతో తలపడితే ఎలా ఉంటుందో ఆసక్తికరంగా చూపించారు. వచ్చే ఏడాది జనవరిలో చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎడిటర్: జీకే ప్రసన్న, సినిమాటోగ్రాఫర్: తేని ఈశ్వర్, సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్.

లీగల్ థ్రిల్లర్ సినిమా



రవి గోగుల దర్శకత్వంలో వీర్ రెడ్డి, దయానంద్ రెడ్డి, ఢిల్లీ గణేశన్, గిరిధర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లీగల్లీ వీర్'. ఎం.వీరనారాయణ రెడ్డి సమర్పణలో శాంతమ్మ మలికిరెడ్డి నిర్మించారు. ఈ చిత్రం 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రానికి సంబంధించిన గ్లింప్స్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హీరో వీర్‌రెడ్డి మాట్లాడుతూ 'మంచి సినిమా చేద్దాం అనుకున్నా. స్వతహాగా లీగల్ లాయర్‌ను కాబట్టి ఈ పాత్రను చేయడం సులభంగా అనిపించింది. ఇంతవరకు మన దగ్గర లీగల్ థ్రిల్లర్ సినిమాలు అంతగా రాలేదు. రియల్ కోర్ట్ డ్రామా ఎలా ఉంటుందో చూపించాలని అనుకున్నాను. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని తెలిపారు.

బిజినెస్

విజయవాడ ● మంగళవారం 10 డిసెంబరు 2024

టాటా మోటార్స్, కియ కార్ల ధరలు పెంపు

న్యూఢిల్లీ: టాటా మోటార్స్, కియ ఇండియా కార్ల ధరలు పెంచుతున్నట్లు ప్రకటించాయి. టాటా మోటార్స్. ఎలక్ట్రిక్ వాహనాలు సహా అన్ని ప్యాసింజర్ కార్ల ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు వెల్లడించగా కియ ఇండియా తన ఉత్పత్తుల ధరలను 2 శాతం మేర పెంచుతున్నట్లు తెలిపింది. పెంచిన ధరలు జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని ఇరు సంస్థలు తెలిపాయి. ముడి సరుకుల ధరలు పెరిగిపోవటంతో కార్ల ధరలు పెంచకతప్పటం లేదని పేర్కొన్నాయి. ఇప్పటికే మారుతి సుజుకీ, హ్యుండయ్, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్, బీఎండబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్, ఆడి ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి.



ఆర్‌బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా

3 ఏళ్ల కాలానికి నియామకం.. రేపు బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కొత్త గవర్నర్‌గా ప్రస్తుత రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా నియమితులయ్యారు. అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ కేబినెట్ (ఏసీసీ) ఆయన నియామకానికి సోమవారం ఆమోదం తెలిపింది. ఆర్‌బీఐ 26వ గవర్నర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించనున్న 56 ఏళ్ల మల్హోత్రా.. మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. రాజస్థాన్ కేడర్‌కు చెందిన 1990 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన మల్హోత్రా.. ప్రస్తుత ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్థానాన్ని భర్తీ చేయనున్నారు. ఈ నెల 10తో దాస్ పదవీకాలం ముగియనుంది.

కంప్యూటర్ సైన్స్ ఇంజనీర్.. ఫైనాన్స్, ట్యాక్సేషన్‌లోనూ అపార అనుభవం

ఐఐటీ కాన్పూర్ నుంచి కంప్యూటర్స్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన మల్హోత్రా.. ఆ తర్వాత అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ పట్టా పుచ్చుకున్నారు. ఐఏఎస్ అధికారిగా 33 ఏళ్ల ప్రస్థానంలో ఆయన పవర్, ఫైనాన్స్, ట్యాక్సేషన్, ఐటీ, మైన్స్ సహా పలు శాఖల్లో పనిచేశారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖలోని రెవెన్యూ డిపార్ట్‌మెంట్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతక్రితం ఆర్థిక సేవల విభాగ కార్యదర్శిగానూ పనిచేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల స్థాయిలో ఫైనాన్స్, ట్యాక్సేషన్ విభాగాల్లో ఆయనకు అపార అనుభవం ఉంది. ఏకాభిప్రాయ సాధనలో దిట్ట. కొత్త ఆదాయం పన్ను విధానం అమలులోనూ ఆయన కీలకపాత్ర పోషించారు.

ఆరేళ్లపాటు దాస్ సారథ్యం



ఆర్‌బీఐ 25వ గవర్నర్‌గా 2018 డిసెంబరు 12న బాధ్యతలు స్వీకరించిన శక్తికాంత దాస్ ఆరేళ్ల పదవీకాలం మంగళవారంతో ముగియనుంది. తొలుత మూడేళ్ల కాలానికి గవర్నర్‌గా నియమితులైన దాస్ పదవీకాలాన్ని ప్రభుత్వం మరో మూడేళ్లు పొడిగించింది. మిగులు నిధుల బదిలీకి సంబంధించి ఆర్‌బీఐ, కేంద్రం మధ్య వివాదం నెలకొనడం, అప్పటి గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆకస్మికంగా పదవికి రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. అలాంటి సున్నిత పరిస్థితుల్లో పగ్గాలు చేపట్టిన దాస్.. ఆర్‌బీఐ పట్ల మార్కెట్ వర్గాల్లో విశ్వాసాన్ని తిరిగి నిలబెట్టడంతో పాటు ఆర్‌బీఐ-కేంద్రం మధ్య సంబంధాలను పునరుద్ధరించడంలో సఫలమయ్యారు. అత్యంత గడ్డుకాలమైన కొవిడ్ సంక్షోభంలోనూ దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు అవసరమైన ద్రవ్యపరపతి విధాన చర్యలు చేపట్టిన ఘనత కూడా ఆయనదే. అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మేగజైన్ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో దాస్ రెండుసార్లు టాప్ సెంట్రల్ బ్యాంకర్‌గా నిలిచారు. తమిళనాడు కేడర్‌కు చెందిన 1980 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన దాస్.. ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టకముందు ఆర్థిక సేవల కార్యదర్శిగానూ పనిచేశారు. జీఎస్‌టీ, పెద్ద నోట్ల రద్దు అమలు సమయంలోనూ కీలక పాత్ర పోషించారు.

శ్రీసిటీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ప్లాంట్

- రూ.7,000 కోట్ల పెట్టుబడి
- 300 ఎకరాలు కేటాయించాలని ఏపీ ప్రభుత్వానికి వినతి
- నేరుగా 1,500 మందికి ఉద్యోగాలు!



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో మరో బహుళ జాతి సంస్థ (ఎంఎన్‌సీ) కొలువు తీరనుంది. దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల దిగ్గజం ఎల్‌జీ గ్రూప్ అనుబంధ సంస్థ 'ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా' శ్రీసిటీ లేదా దానికి సమీపంలో ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. రూ.15,000 కోట్ల పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) కోసం సెబీకి సమర్పించిన ముసాయిదా పత్రం (డీఆర్‌హెచ్‌పీ)లో కంపెనీ ఈ విషయం తెలిపింది. ఈ ప్లాంట్ ఏర్పాటు కోసం 300 ఎకరాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్టు సమాచారం. ఈ ప్రాజెక్టు కోసం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా రూ.7,000 కోట్ల వరకు ఖర్చు చేయనుంది. ఇందులో రూ.5,000 కోట్లు కంపెనీ నేరుగా పెట్టుబడి పెడుతుంది. మిగతా రూ.2,000 కోట్ల పెట్టుబడులు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్‌కు విడిభాగాలు సరఫరా చేసే కంపెనీల నుంచి వస్తాయి. ఈ ప్రాజెక్టు అమలుకు నోచుకుంటే నేరుగా 1,500 మందికి ఉద్యోగావకాశాలు ఏర్పడతాయని అంచనా.

ఎందుకంటే?

ఎజీ ఎలక్ట్రానిక్స్ ఇండియాకు ఇప్పటికే వివిధ గృహోపకరణాల ఉత్పత్తి కోసం ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా, మహారాష్ట్రలోని పుణెల్లో రెండు ఉత్పత్తి యూనిట్లు ఉన్నాయి. ఈ ప్లాంట్ల స్థాపిత సామర్థ్యం 1,39,90,000 యూనిట్లుగా ఉంది. దక్షిణ భారత మార్కెట్ కోసం ఈ రెండు ప్లాంట్ల నుంచే ఉత్పత్తిని తరలించాల్సి వస్తోంది. ఇందుకు రవాణా ఖర్చులతో పాటు వివిధ సరఫరా సమస్యలు ఎదురవుతున్నాయి. శ్రీసిటీలో కొత్త ప్లాంటు ఏర్పాటు ద్వారా ఈ సమస్యలను అధిగమించాలని కంపెనీ భావిస్తోంది. దీనికి తోడు ఈ ప్లాంటులో ఉత్పత్తి చేసే ఏసీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు, టీవీలను కంపెనీ ఇతర దేశాలకూ ఎగుమతి చేయాలని యోచిస్తోంది. ఈ పెట్టుబడి అమలుకు నోచుకుంటే ఒక కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ మన దేశంలో ఇంత పెద్ద మొత్తం పెట్టుబడి పెట్టడం ఇదే మొదటిసారి అవుతుంది. శ్రీసిటీలో ఇప్పటికే బ్లూస్టార్, డైకిన్, హావెల్ వంటి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు కొలువు తీరాయి. కాగా ఏపీలో ఏర్పాటు చేయనున్న ప్లాంట్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి విధానం కింద ఆర్థికపరమైన ప్రోత్సాహకాలు పొందేందుకు ఆమోదం లభించింది.

రెండున్నర నెలల్లో 800 కోట్ల స్పామ్ కాల్స్

80 కోట్ల స్పామ్ ఎస్ఎంఎస్‌లు: భారతీ ఎయిర్‌టెల్

ఢిల్లీలో అత్యధిక స్పామ్ కాల్స్.. ఆ తర్వాత స్థానంలో ఏపీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రైవేట్ టెలికాం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పరిష్కారాల ద్వారా స్పామ్ కాల్స్, మెసేజ్‌లపై యుద్ధం ప్రకటించింది. గడిచిన రెండున్నర నెలల్లో తన నెట్‌వర్క్‌లో 800 కోట్ల స్పామ్ కాల్స్, 80 కోట్ల స్పామ్ ఎస్ఎంఎస్‌లను గుర్తించినట్లు ఎయిర్‌టెల్ సోమవారం వెల్లడించింది. తమ ఏఐ ఆధారిత నెట్‌వర్క్‌లో ఆధునిక ఆల్గోరిథమ్స్‌ను ఉపయోగించి రోజుకు దాదాపు 10 లక్షల మంది స్పామర్లను గుర్తించినట్లు సంస్థ తెలిపింది. గత రెండున్నర నెలల్లో నమోదైన మొత్తం కాల్స్‌లో 6 శాతం స్పామ్ కాల్సేనని, మొత్తం ఎస్ఎంఎస్‌లలో 2 శాతం స్పామ్ మెసేజ్‌లేనని పేర్కొంది. రెండున్నర నెలల్లో దాదాపు 25.2 కోట్ల మంది కస్టమర్లను సందేహాస్పద కాల్స్‌పై ముందుగా అలర్ట్ చేయడం జరిగిందని, ఈ తరహా కాల్స్‌ను స్వీకరించే కస్టమర్ల సంఖ్య కూడా 12 శాతం మేర తగ్గిందని ఎయిర్‌టెల్ పేర్కొంది. ఢిల్లీలోని కస్టమర్లు అత్యధిక స్పామ్ కాల్స్ అందుకున్నారని తెలిపింది. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ యూపీ ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. అత్యధిక స్పామ్ కాల్స్ చేసిందీ ఢిల్లీ సర్కిల్ నుంచేనని..ముంబై, కర్ణాటక ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయని ఎయిర్‌టెల్ తెలిపింది.

రూపాయి ఢమాల్

ఒకే రోజు 20 పైసలు పతనం

సరికొత్త రికార్డు కనిష్ఠ స్థాయి .. రూ.84.86కు ఎక్స్ఛేంజ్ రేటు

ముంబై: భారత కరెన్సీ విలువ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి క్షీణించింది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం 20 పైసలు నష్టపోయి 84.86 వద్ద ముగిసింది. గడిచిన నెల రోజులకు పైగా కాలంలో (నవంబరు 6 తర్వాత) రూపాయికిదే అతిపెద్ద ఒక్కరోజు పతనం. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల, ఈక్విటీ మార్కెట్లో నష్టాలు ఇందుకు ప్రధాన కారణమయ్యాయి. దిగుమతిదారులు, విదేశీ బ్యాంకుల నుంచి డాలర్‌కు డిమాండ్ నెలకొనడంతో రూపాయి మరికొద్ది రోజులు బలహీనంగానే ఉండనుందని ఫారెక్స్ వర్గాలు అభిప్రాయపడ్డాయి. కాగా, అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 0.89 శాతం పెరిగి 71.75 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనైన ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన మిశ్రమ సంకేతాలు, రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు నష్టాలకు కారణమయ్యాయి. సెన్సెక్స్ 200.66 పాయింట్లు కోల్పోయి 81,508.46 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 58.80 పాయింట్ల నష్టంతో 24,619 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్ 200 పాయింట్లు డౌన్

కాగా ఇంటర్నేషనల్ జెమ్మోలాజికల్ ఇన్‌స్టిట్యూట్ (ఇండియా) లిమిటెడ్ ఐపీఓ ఈ నెల 13న ప్రారంభమై 17న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని రూ.397-417గా నిర్ణయించింది. అలాగే ఇన్వెంచురస్ నాలెడ్జ్ సొల్యూషన్స్ ఐపీఓ ఈ నెల 12న ప్రారంభమై 16న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని రూ.1,265-1,329గా కంపెనీ నిర్ణయించింది.

12-13 తేదీల్లో టీజీ-ప్యాకాన్ సదస్సు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఈ నెల 12-13 తేదీల్లో హైదరాబాద్ మరో జాతీయ సదస్సుకు వేదికవుతోంది. సీఐఐ (తెలంగాణ చాప్టర్) ఏర్పాటు చేసే ఈ రెండు రోజుల సదస్సుకు దేశ, విదేశాలకు చెందిన 250 మంది ప్రతినిధులు హాజరవుతారని సీఐఐ టీజీ ప్యాకాన్ సదస్సు చైర్మన్ ఏవీపీఎస్ చక్రవర్తి చెప్పారు. తొలి రోజు సదస్సులో ప్యాకేజింగ్ రంగంలో నవ కల్పనలు, అభివృద్ధి మీద, రెండో రోజు ప్యాకేజింగ్ రంగంలో సుస్థిర అభివృద్ధి గురించి చర్చ జరుగుతుందన్నారు. పరిశ్రమ తాజా పరిమాణాలపై 50 నుంచి 60 మంది సీఈఓలతో రౌండ్ టేబుల్ చర్చ కూడా ఉంటుందన్నారు.

మరో 100 ఎయిర్‌బస్ విమానాలకు ఆర్డర్

ఎయిర్ ఇండియా

ముంబై: టాటా గ్రూప్ గూటికి చేరిన ఎయిర్ ఇండియా పెద్దఎత్తున విస్తరణ చేపట్టింది. ఇందులో భాగంగా ఎయిర్‌బస్ నుంచి మరో 100 విమానాలు కొనుగోలు చేసేందుకు ఆర్డర్ పెట్టింది. గత ఏడాది పెట్టిన 250 విమానాల ఆర్డర్‌కు ఇది అదనం. ఈ వంద విమానాల్లో 10 వైడ్ బాడీ ఏ350 విమానాలు, మిగతా 90 న్యారో బాడీ ఏ320 రకం విమానాలని తెలిపింది.

ఏఎంజీ అమ్మోనియాకు జెంటారి విద్యుత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మలేషియా ప్రభుత్వ నిర్వహణలోని పెట్రోనాస్ గ్రూప్ అనుబంధ సంస్థ జెంటారి- ఏఎం గ్రీన్ అమ్మోనియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎంజీ అమ్మోనియా) మధ్య ఒక దీర్ఘకాలిక విద్యుత్ సరఫరా ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం జెంటారి అనుబంధ సంస్థ జెంటారి రెన్యువబుల్స్ ఇండియా కాస్టర్ వన్ ప్రైవేట్ లిమిటెడ్, ఏఎంజీ అమ్మోనియా ఏర్పాటు చేసే గ్రీన్ అమ్మోనియా ప్లాంట్లకు నిరంతరం 650 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేస్తుంది. ఇందుకోసం జెంటారి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో 2,400 మెగావాట్లు ఉత్పత్తి సామర్థ్యం ఉన్న పవన, సౌర విద్యుదుత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. వీటిని 350 మెగావాట్లు/2,100 మెగావాట్ల ఇంధన స్టోరేజీ ప్లాంట్లతో అనుసంధానం చేసి ఏఎంజీ అమ్మోనియా ప్లాంట్లకు సరఫరా చేస్తారు. ఏఎం గ్రీన్ అమ్మోనియా 2030 నాటికి ఏటా 50 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న గ్రీన్ అమ్మోనియా ప్లాంట్లను ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ సహా దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసి యూరోపియన్ యూనియన్ (ఈయూ) దేశాలకు ఎగుమతి చేస్తుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,780 ▲	71,300 ▲	1,00,000 ▲
ముంబై	76,692 ▲	70,250 ▲	91,800 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

10వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	625
వరంగల్	622	గోదావరి	625
చిత్తూరు	633	విశాఖపట్నం	615
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	104
వరంగల్	100	గుంటూరు	99
కరీంనగర్	100	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	75
కర్నూలు	100	నెల్లూరు	75
విశాఖపట్నం	96	అనంతపురం	75
గోదావరి	104		

స్పోర్ట్స్

షమి అదరగొట్టె..

బెంగాల్ క్వార్టర్స్ చేరె..

బెంగళూరు:. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో భాగంగా చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో మహ్మద్ షమి ఆల్‌రౌండ్ షోతో బెంగాల్ 3 పరుగుల తేడాతో గెలిచి క్వార్టర్‌ఫైనల్ చేరింది. మొదట బెంగాల్ 20 ఓవర్లలో 159/9 స్కోరు చేసింది. 114 పరుగులకే 8 వికెట్లు కోల్పోయిన దశలో పదో నెంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన షమి 17 బంతులు ఎదుర్కొని 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 రన్స్ బాది అజేయంగా నిలిచాడు. ఛేదనలో చండీగఢ్ 20 ఓవర్లలో 156/9 స్కోరుకే పరిమితమై ఓటమిపాలైంది. 139 కి.మీ వేగంతో బౌలింగ్ చేసి ఓ వికెట్ పడగొట్టిన షమి.. 4 ఓవర్లలో 13 డాట్ బాల్స్ వేయడం విశేషం.

ఆంధ్ర పోరు ముగిసింది

యూపీ చేతిలో ఓటమి

బెంగళూరు: సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఆంధ్ర జట్టు కథ ముగిసింది. సోమవారం ఇక్కడ జరిగిన ప్రీ క్వార్టర్‌ఫైనల్ పోరులో నాలుగు వికెట్ల తేడాతో ఉత్తరప్రదేశ్ చేతిలో పరాజయం పాలైంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 156 పరుగులు చేసింది. ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ (34 నాటౌట్) టాప్ స్కోరర్. కెప్టెన్ రికీ భుయ్ (23), శశికాంత్ (23 నాటౌట్) పర్వాలేదనిపించగా.. ఓపెనర్ భరత్ (4) నిరాశపరిచాడు. యూపీ బౌలర్లలో భువనేశ్వర్, విప్‌రాజ్ నిగమ్ చెరో రెండు వికెట్లు తీశారు. ఛేదనలో కర్ణ్ శర్మ (48), రింకూ సింగ్ (27 నాటౌట్), ఆఖర్లో విప్‌రాజ్ నిగమ్ (8 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 27 నాటౌట్) అదరగొట్టడంతో యూపీ 19 ఓవర్లలో 157/6 స్కోరు చేసి గెలిచింది. ఆంధ్ర బౌలర్లలో సుదర్శన్ (3/22) మూడు, త్రిపురాన విజయ్ (2/21) రెండు వికెట్లు పడగొట్టారు.

చెలరేగిన రూథర్‌ఫర్డ్

తొలి వన్డేలో బంగ్లాపై విండీస్ గెలుపు

సెయింట్ కిట్స్/నెవిస్: బంగ్లాదేశ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో ఆతిథ్య వెస్టిండీస్ శుభారంభం చేసింది. తొలి మ్యాచ్‌లో షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ (80 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్సర్లతో 113) సెంచరీతో చెలరేగడంతో విండీస్ ఐదు వికెట్లతో గెలిచింది. మొదట బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 294 పరుగులు చేసింది. మెహిదీ హసన్ (74), టాంజిద్ (60), మహ్మదుల్లా (50 నాటౌట్) రాణించారు. షెపర్డ్ 3, అల్జారీ జోసెఫ్ 2 వికెట్లు తీశారు. ఛేదనలో రూథర్‌ఫర్డ్ విజృంభణతో పాటు హోప్ (86), గ్రీవ్స్ (41 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడడంతో.. విండీస్ 47.4 ఓవర్లలోనే 295/5 చేసి గెలిచింది.

టైటాన్స్‌కు నిరాశ

పుణె: ప్రొ కబడ్డీ లీగ్‌లో గత మ్యాచ్ విజయంతో వరుస ఓటములకు చెక్ పెట్టిందనుకున్న తెలుగు టైటాన్స్‌కు అంతలోనే నిరాశ ఎదురైంది. సోమవారం హరియాణా స్టీలర్స్‌తో జరిగిన పోరులో టైటాన్స్ 25-46తో చిత్తయింది. మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 30-26తో పుణెరి పల్టాన్‌పై గెలిచింది.



కెప్టెన్‌తో చెడిందా?

అందుకే షమికి బెర్త్ దక్కడం లేదా?

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

భారత పేసర్ మహ్మద్ షమికి.. కెప్టెన్ రోహిత్ శర్మకు మధ్య సంబంధాలు బెడిసికొట్టాయా? షమి జట్టులోకి రావడం హిట్‌మ్యాన్‌కు ఇష్టం లేదా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఓవైపు ఫిట్‌గా లేడని, అతడి గాయం తిరగబెట్టిందని రోహిత్ మీడియాకు వివరణ ఇస్తుండగా.. మరోవైపు షమి మాత్రం మైదానంలో దుమ్ము రేపుతున్నాడు. ఆదివారం అడిలైడ్‌లో ముగిసిన రెండో టెస్టులో పరాజయం పాలైన తర్వాత రోహిత్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...షమి మోకాలు మళ్లీ వాచిందని, గాయాన్ని తాము క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పాడు. గాయం తగ్గకముందే బరిలోకి దింపి షమిని ఒత్తిడిలోకి నెట్టదలచుకోవడం లేదని కూడా రోహిత్ వెల్లడించాడు. కానీ సీన్ కట్ చేస్తే.. సోమవారం సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో చండీగఢ్‌పై షమి ఆల్‌రౌండ్‌షోతో అదరగొట్టాడు. 17 బంతుల్లోనే 32 పరుగులు చేసిన ఈ పేసర్.. అటు బౌలింగ్‌లో 13 డాట్ బాల్స్ వేసి ఓ వికెట్ తీశాడు. మరి.. రోహిత్ చెబుతున్నట్టు షమికి గాయం తిరగబెడితే అతను విశ్రాంతి తీసుకోవాలి. కానీ బరిలోకి దిగి ఇంత మెరుగ్గా ఎలా ఆడగలుగుతున్నాడనే చర్చ ఆరంభమైంది. అందుకే ఇద్దరి మధ్య చెడిందనే కథనాలు వినిపిస్తున్నాయి.

అసలేం జరిగిందంటే..

న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌కు ముందు షమి తాను పూర్తి ఫిట్‌గా ఉన్నట్టు ప్రకటించాడు. అయితే కెప్టెన్ రోహిత్ మాత్రం కివీస్‌తోనే కాకుండా ఆసీస్ పర్యటనకు కూడా షమి అందుబాటులో ఉండడని, అతడి గాయం తిరగబెట్టిందని ప్రకటించాడు. అప్పుడే షమి ఈ విషయంలో సోషల్ మీడియాలోనూ ఖండించాడు. అలాగే షమి ఎన్‌సీఏ పునరావాస శిబిరంలో ఉన్నప్పుడు బెంగళూరులో కివీస్‌తో తొలి టెస్టు జరిగింది. ఈ సమయంలో రోహిత్‌ను షమి కలిశాడట. తన ఫిట్‌నెస్‌పై తప్పుడు ప్రకటనలు ఎందుకు చేస్తున్నావని షమి గట్టిగానే ప్రశ్నించాడని, అప్పుడే ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగిందంటూ మీడియాలో వచ్చిన కథనం సంచలనం సృష్టిస్తోంది.

దేశవాళీల్లో అదరగొడుతున్నా..

మహ్మద్ షమి చివరిసారి భారత జట్టు తరఫున 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ ఆడాడు. మోకాలి గాయంతో అప్పటి నుంచి ఏడాదిపాటు పునరావాస శిబిరంలో ఉండి కోలుకున్నాడు. జాతీయ జట్టులోకి రావాలంటే షమి ముందుగా దేశవాళీల్లో నిరూపించుకోవాల్సి రావడంతో బెంగాల్ తరఫున రంజీ మ్యాచ్ ఆడాడు. దీంతో పాటు రెండు వారాల్లోనే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 8 మ్యాచ్‌లు కూడా ఆడాడు. తద్వారా ఫిట్‌నెస్ నిరూపించుకున్న షమి జాతీయ జట్టులోకి పునరాగమనం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సంకేతాలు పంపినట్టయింది. కానీ అతడికి ఇప్పటివరకు ఎన్‌సీఏ నుంచి అనుమతి లభించలేదు. అది లభించాకే తను ఆసీస్ పర్యటనకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఒకవేళ అన్నీ అనుకూలించి తను ఆస్ట్రేలియా వెళ్తే చివరి రెండు టెస్టుల్లో ఆడే వీలుంటుంది.

రోహిత్ ఓపెనర్‌గా రావాలి..

గవాస్కర్, రవిశాస్త్రి సూచన

అడిలైడ్: ఆసీస్‌తో రెండో టెస్టులో భారత జట్టు చిత్తుగా ఓడడంతో కెప్టెన్ రోహిత్ శర్మపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఆటగాడిగానే కాకుండా నాయకుడిగానూ విఫలమయ్యాడని మాజీలు ఆరోపిస్తున్నారు. అడిలైడ్ టెస్టులో ఆసీస్‌కు రోహిత్ పూర్తిగా లొంగిపోయినట్టు కనిపించాడని మాజీ కోచ్ రవిశాస్త్రి ఘాటుగా స్పందించాడు. రాబోయే మ్యాచ్‌ల్లో ఓపెనర్‌గా ఆడి పుంజుకోవాలని కోరాడు. 'మైదానంలో రోహిత్‌లో దూకుడు కనిపించలేదు. అతడి బాడీ లాంగ్వేజి చూస్తుంటే ఆసీస్‌కు లొంగిపోయినట్టుగా అర్థమైంది. అలాగే రోహిత్ ఓపెనర్‌గా రావడం మంచిది. రాహుల్‌ను మిడిలార్డర్‌లో ఆడించాలి' అని శాస్త్రి సూచించాడు. మరోవైపు రోహిత్ లేడు కాబట్టే తొలి టెస్టులో రాహుల్ ఓపెనింగ్ చేశాడని, తిరిగి ఆ స్థానంలో కెప్టెన్ ఆడితేనే బావుంటుందని గవాస్కర్ కూడా చెప్పాడు. అయితే గాబాలో ఎరుపు కూకాబుర్రా బంతులను ఎదుర్కొనేందుకు రోహిత్ మిడిలార్డర్‌లో ఆడితేనే మేలంటూ బీసీసీఐకి చెందిన ఓ కోచ్ తెలిపాడు. అప్పటికి బంతి మెరుపు కోల్పోయి సీమ్ తగ్గుతుందని చెప్పాడు.

సిరాజ్‌కు జరిమానా



హెడ్‌కు మందలింపు

దుబాయ్: భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన రెండో టెస్టులో మాటల యుద్ధానికి తెర తీసిన పేసర్ మహ్మద్ సిరాజ్-బ్యాటర్ హెడ్‌పై ఐసీసీ చర్యలకు దిగింది. సహచర ప్లేయర్‌తో అనుచితంగా ప్రవర్తించి.. సిరాజ్ ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించాడని, అందుకే అతడి మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత విధిస్తున్నట్టు పేర్కొంది. అలాగే హెడ్‌ను మందలించినట్టు తెలిపింది. దీంతోపాటు క్రమశిక్షణ ఉల్లంఘన కింద ఇరువురి ఖాతాలో ఒక్కో డీమెరిట్ పాయింట్‌ను కూడా చేర్చింది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ సెంచరీ సాధించిన హెడ్‌ను క్లీన్‌బౌల్డ్ చేసిన సిరాజ్ కోపంతో.. బయటికి వెళ్లిపో అనేలా సైగ చేశాడు. అటు హెడ్ కూడా ఏదో అనడం కనిపించింది. అయితే సిరాజ్ చర్యను పలువురు మాజీలు తప్పుబడుతున్నారు. సెంచరీ చేసిన హెడ్‌ను గౌరవించాల్సింది పోయి దుందుడుకుగా ప్రవర్తించడం సరికాదని గవాస్కర్, శ్రీకాంత్ విమర్శించారు. అలాగే ఆసీస్ మాజీ బ్యాటర్ సైమన్ కటిచ్ కూడా సిరాజ్‌ది మతిలేని చర్యగా పేర్కొన్నాడు. హెడ్ మ్యాచ్ విన్నింగ్ గేమ్ ఆడాడని, అతను అవుటైనప్పుడు భుజం తట్టి మెచ్చుకోవాల్సిందని అన్నాడు.

గుకేష్‌కు ఎదురుదెబ్బ



12వ రౌండ్‌లో పరాజయం

సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్ మరో రెండు రౌండ్లలో ముగుస్తుందనగా భారత యువ జీఎం దొమ్మరాజు గుకేష్‌కు ఎదురుదెబ్బ తగిలింది. సోమవారం ముగిసిన పన్నెండో రౌండ్లో గుకేష్‌పై వరల్డ్ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా) 39 ఎత్తుల్లో గెలుపొందాడు. ఈ మెగా ఫైనల్లో డింగ్ తెల్ల పావులతో విజయం సాధించడం ఇదే తొలిసారి. అంతేకాక 14 రౌండ్ల ఈ సుదీర్ఘ ఫైనల్లో 11 గేమ్‌ల తర్వాత డింగ్ నెగ్గడం విశేషం. ఈ ఫైనల్ మొత్తం పరిశీలిస్తే గుకేష్ పేలవంగా ఆడిన రౌండ్ ఇదే కావడంతో అందుకు తగిన మూల్యం చెల్లించుకున్నాడు. డింగ్ తాజా విజయంతో ఇరువురి స్కోర్లు 6-6తో సమమయ్యాయి. తదుపరి రెండు రౌండ్లలో ఎవరైతే 1.5 పాయింట్లు సాధిస్తారో వారే విజేతగా నిలుస్తారు. ఒకవేళ ఆ రెండు గేమ్‌లు డ్రా అయితే టైబ్రేకర్ ఫలితంతో చాంపియన్‌ను నిర్ణయిస్తారు. మంగళవారం విశ్రాంతి రోజు. బుధ, గురువారాల్లో ఆఖరి రెండు రౌండ్లు జరగనున్నాయి.

జీఎంకు 9 ఏళ్ల బాలుడి షాక్



న్యూఢిల్లీ: అమెరికా గ్రాండ్‌మాస్టర్ రాసెట్ జియాటినోవ్‌కు భారతీయ చెస్ బుడతడు ఆరిత్ కపిల్ షాకిచ్చాడు. సోమవారం జరిగిన కేఐఐటీ ఇంటర్నేషనల్ ఓపెన్ టోర్నమెంట్ ఆఖరిదైన తొమ్మిదో రౌండ్లో 66 ఏళ్ల రాసెట్‌పై తొమ్మిదేళ్ల ఆరిత్ 63వ ఎత్తులో విజయం సాధించాడు. తెల్లపావులతో బరిలోకి దిగిన ఆరిత్ ప్రారంభంలో తడబడినా ఆటసాగేకొద్దీ పట్టు బిగించి గెలుపొందాడు. అత్యంత పిన్న వయస్సులో (9 సంవత్సరాల 2 నెలలు) జీఎంను ఓడించిన భారత చెస్ క్రీడాకారుడిగా ఆరిత్ అరుదైన ఘనత సాధించాడు. ప్రపంచంలో అయితే భారత మూలాలు గల సింగపూర్ క్రీడాకారుడు అశ్వథ్ కౌశిక్ (8 సంవత్సరాల 6 నెలలు) ఈ జాబితాలో ప్రథమ స్థానంలో ఉండగా, ఆరిత్ మూడో స్థానంలో నిలిచాడు. ఇక, రష్యా జీఎం బోరిస్ సావచెంకో టైటిల్ సాధించాడు.

సఫారీలదే రెండో టెస్టు

2-0తో సిరీస్ కైవసం

గెబెహ: శ్రీలంకతో రెండో టెస్టులోనూ గెలిచిన దక్షిణాఫ్రికా 2-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో సఫారీలు 109 పరుగుల తేడాతో లంకను చిత్తు చేశారు. ఆటకు చివరిరోజైన సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 205/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన లంక 238 రన్స్‌కు ఆలౌటైంది. ఐదు వికెట్లతో కేశవ్ మహరాజ్ (5/76) లంక పతనాన్ని శాసించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 358 రన్స్ చేసిన దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 317కు ఆలౌటైంది. లంక తొలి ఇన్నింగ్స్‌లో 328 రన్స్ చేసింది.

'డబ్ల్యూటీసీ' టాప్‌లోకి దక్షిణాఫ్రికా: దక్షిణాఫ్రికా డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఇప్పటిదాకా రెండో స్థానంలోనున్న సఫారీ జట్టు 63.33 విజయాల శాతంతో టాప్‌నకు చేరుకుంది. భారత్‌పై గులాబీ టెస్టు గెలుపుతో టాప్‌లోకొచ్చిన ఆస్ట్రేలియా (60.71) ఇప్పుడు రెండో స్థానానికి పడిపోయింది. టీమిండియా (57.29) మూడో స్థానంలో, శ్రీలంక (45.45) నాలుగో స్థానంలో ఉన్నాయి.

బ్రాండింగ్‌లో కింగ్..ధోనీ



న్యూఢిల్లీ: నాలుగేళ్ల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పటికీ.. మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ క్రేజ్ ఇసుమంతైనా తగ్గలేదు. కార్పొరేట్ ప్రపంచం అతడిని తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉపయోగించుకునేందుకు ఇప్పటికీ క్యూ కడుతోంది. ధోనీ ప్రస్తుతం 42 కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని టాప్‌లో ఉండడమే ఇందుకు నిదర్శనం. ఈ విషయంలో అతను బాలీవుడ్ దిగ్గజాలు అమితాబ్ బచ్చన్ (41 కంపెనీలు), షారుక్ ఖాన్ (34)లను కూడా దాటేశాడు. చెన్నై తరఫున ఐపీఎల్‌లో మాత్రమే ఆడుతున్న 43 ఏళ్ల ధోనీ.. మొత్తం ఆస్తి రూ.1,040 కోట్లుగా సమాచారం.



మీకు తెలుసా?

మెగ్నీషియం తగ్గితే?

తరచూ కండరాలు పట్టేస్తున్నాయా? మందులు వాడుతున్నప్పటికీ రక్తపోటు అదుపు తప్పుతోందా? అయితే మీకు మెగ్నీషియం లోపం ఉండివచ్చు. ఈ పోషకం లోపిస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయంటే...

తీవ్రమైన ప్యానిక్ అటాక్స్, చిత్తభ్రమలు, కండరాలు పట్టేయడం, అధిక రక్తపోటు... వీటికి మెగ్నీషియం లోపం కారణం కావచ్చు. ఇలాంటి సందర్భాల్లో వృక్షాధారిత లేదా మాంసాహార మెగ్నీషియం పోషకాన్ని లేదా సప్లిమెంట్లను తీసుకోక తప్పదు. శరీరంలో మెగ్నీషియం మోతాదు తగ్గడం వల్ల, నాడీవ్యవస్థ పనితీరు అదుపు తప్పి, ఆందోళన, చికాకులు పెరుగుతాయి. ఇవి ప్యానిక్ అటాక్స్ రూపంలో బయల్పడుతూ ఉంటాయి. 'హైపోమెగ్నీసీమియా' అనే మెగ్నీషియం లోపం వల్ల కండరాల నొప్పులు, అధిక రక్తపోటు, మానసిక సమస్యలు తలెత్తే అవకాశాలు పెరుగుతాయి. మధుమేహం, తీవ్రమైన డయేరియా, సిలియాక్ వ్యాధితో బాధపడే వారిలో మెగ్నీషియం శోషణ తగ్గిపోతుంది. అలాగే మద్యపానం అలవాటున్న వారిలో కూడా మెగ్నీషియం ప్రమాదకర స్థాయికి పడిపోతుంది. అయితే ఈ పోషకం మోతాదు పూర్తిగా తగ్గిపోయేవరకూ లక్షణాలు బయల్పడవు కాబట్టి ఈ సమస్యను కనిపెట్టడం



కష్టంగా మారుతూ ఉంటుంది. కాబట్టి తరచూ కండరాలు పట్టేస్తూ ఉండడం, నొప్పులు పెరగడం, కండరాలు అదురుతూ ఉండడం, అర్థం లేని ఆందోళన, భయం, భావోద్వేగాలు అదుపు తప్పుతూ ఉండడం, మానసిక కుంగుబాటు లక్షణాలు కనిపించినప్పుడు వైద్యులను కలిసి మెగ్నీషియం లోపాన్ని పరీక్షించుకోవాలి. అవసరానికి మించిన విటమిన్ డి3, మెగ్నీషియం లోపం.. ఈ రెండూ ఎముకలు గుల్లబారే ముప్పును పెంచుతాయి. అలాగే మెగ్నీషియం లోపం రక్తపోటును పెంచి, సరైన సమయంలో సరిదిద్దుకోలేకపోతే అంతిమంగా గుండెపోటుకు దారి తీస్తుంది. మెగ్నీషియం పోషకం శ్వాసనాళాల పనితీరు మీద ప్రభావం కనబరుస్తుంది. ఈ పోషకం తగ్గడం వల్ల, ప్రత్యేకించి చలికాలంలో ఆస్తమా రోగుల బాధలు రెట్టింపవుతాయి.

ఇలా పెంచుకోవచ్చు

మెగ్నీషియం పుష్కలంగా పదార్థాలను సరిపడా తీసుకోవడం ద్వారా ఈ లోపాన్ని అరికట్టవచ్చు. అవేంటంటే...

- పొట్టు తీయని ధాన్యాలు
- బీన్స్
- ఆకుకూరలు, కూరగాయలు.

అవగాహన

చెవిలో చప్పుడు ఎందుకు?

గుండెచప్పుడును పోలిన శబ్దం చెవిలో కూడా వినిపిస్తూ ఉంటుంది. ఈ లయబద్ధమైన శబ్దం వెనకేదైనా ఆరోగ్య సమస్య దాగి ఉందా? తెలుసుకుందాం!

నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నప్పుడు లేదా పడుకుని ఉన్నప్పుడు చెవిలో గండె చప్పుడుతో సమానమైన శబ్దం వినిపిస్తూ ఉంటుంది. దీన్ని 'పల్సటైల్ టిన్నిటస్' అంటారు. ఇలా నాడి కొట్టుకుంటున్నట్టు తోచే ఈ ంటి లయబద్ధమైన చప్పుడు కొందర్లో ఒక చెవిలో వినిపించవచ్చు, ఇంకొందర్లో రెండు చెవుల్లో వినిపించవచ్చు. మెడ, తలలోని రక్తనాళాల్లో రక్త ప్రవాహ ఫలితమే ఈ చప్పుడు. ఇలాంటి చప్పుడు వెనకున్న కారణాలు ఏవంటే...

- **వినికిడి లోపం:** మధ్య చెవిలో ఇన్ఫెక్షన్ లేదా ఇన్ఫ్లమేషన్ లేదా ద్రవం పేరుకుపోవడం వల్ల వినికిడి లోపం తలెత్తవచ్చు. కొన్ని సందర్భాల్లో వినికిడికి తోడ్పడే చెవిలోని చిన్న ఎముకల్లో సమస్యలు తలెత్తడం వల్ల కూడా వినికిడి తగ్గవచ్చు. ఈ రకమైన వినికిడి లోపం అంతర్గతంగా తలలో శబ్దాలను కూడా తీవ్రతరం చేస్తుంది. అంటే ఊపిరి తీసుకోవడం, నమలడం, చెవిలోకి రక్తప్రసార శబ్దాల తీవ్రత పెరుగుతుంది.
- **కరోటిడ్ ధమని వ్యాధి:** కరోటిడ్ ధమనుల్లో పేరుకుపోయే కొవ్వుల మూలంగా రక్తప్రవాహంలో హెచ్చుతగ్గులు చోటు చేసుకుని పల్సేటివ్ టిన్నిటస్ తలెత్తుతుంది.
- **అధిక రక్తపోటు:** రక్తపోటు ఎక్కువగా ఉన్న



ప్పుడు, కరోటిడ్ ధమనిలో రక్త ఉధృతి ఫలితంగా కూడా చెవిలో చప్పుడు మొదలు కావచ్చు.
- **రక్తనాళ సమస్యలు:** రక్తనాళంలో అవకారాలు (అన్యూరిజం), ధమనికీ, శిరకూ మధ్య అసాధారణ సంబంధం ఏర్పడి ఉండడం (ఆర్టీయిరోవీనస్ మాల్ఫార్మేషన్), ధమనులు మెలితిరిగి ఉండడం లేదా, కర్ణభేరి వెనక ఉండే రక్తనాళాల మీద కణుతులు పెరగడం వల్ల కూడా చెవిలో చప్పుళ్లు వినిపించవచ్చు.

ఎక్కువ సందర్భాల్లో పల్సేటివ్ టిన్నిటస్ గురించి కంగారు పడవలసిన అవసరం ఉండదు. కానీ దానంతట అది తగ్గిపోకుండా, వారాల తరబడి వేధించే స్థాయికి చేరుకుంటే, తప్పనిసరిగా వైద్యులను కలవాలి.

చలికాలం అంతర్గత, బాహ్య ఆరోగ్యాలను చెక్కుచెదరకుండా ఉంచుకోవడం కోసం ఆయుర్వేద ఆరోగ్య సూత్రాలను ఆచరించవచ్చు. బలాన్ని పెంచుకునే వీలున్న ఈ కాలాన్ని వీలైనంత మెరుగ్గా ఎలా సద్వినియోగం చేసుకోవాలో ఆయుర్వేద నిపుణులు ఇలా వివరిస్తున్నారు.

ఆయుర్వేదం

ఆవు నెయ్యి శ్రేష్ఠం

ఈ కాలంలో చర్మం పొడిబారకుండా మృదువుగా ఉండడం కోసం, శరీరం పొడిబారిపోకుండా ఉండడం కోసం రోజుకు రెండు చెంచాల చొప్పున కల్తీ లేని ఆవు నెయ్యి తీసుకోవచ్చు. ఈ కాలంలో శరీరాన్ని తేమగా ఉంచుకోకపోతే, ఆ ప్రభావం మోకాళ్ల నొప్పులు, వెన్ను నొప్పులు, ఒంటి నొప్పులు, నాడీ సంబంధ రుగ్మతల రూపంలో వేసవిలో శరీరాన్ని బాధిస్తుంది. ఆవు నెయ్యితో కొలెస్ట్రాల్ పెరుగుతుందని భయపడుతూ ఉంటారు. కానీ సమర్థంగా అరిగించుకోగలిగితే ఆవు నెయ్యితో శరీరానికెంతో మేలు కలుగుతుంది. అందుకోసం వ్యాయామంతో శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలి.



చలికాలం
చెక్కుచెదరని ఆరోగ్యం

ఏడాదిని ఉత్తరాయనం, దక్షిణాయనం అనే రెండు భాగాలుగా విభజించుకుంటే ఉత్తరాయనంలో వేడి ఎక్కువగా ఉంటుంది కాబట్టి శరీరం బలహీనపడుతుంది. శరీరంలోని సత్తువ బయటకు వెళ్లిపోతుంది కాబట్టి ఆ కాలాన్ని ఆదాన కాలం అంటారు. దక్షిణాయనంలో చల్లని వాతావరణం వల్ల శరీరం శక్తిని స్వీకరించి, బలపడుతుంది కాబట్టి ఈ కాలాన్ని విసర్గ కాలం అంటారు. కాబట్టి ఏడాదిలోని మొదటి ఆరునెలల్లో కోల్పోయిన సత్తువను తిరిగి పొందే వీలున్న కాలంగా దక్షిణాయనాన్ని, మరీ ముఖ్యంగా చలికాలాన్నీ పరిగణించాలి. ఇది సత్తువను పెంచే కాలమే అయినప్పటికీ, చల్లదనం మూలంగా విజృంభించే వ్యాధులకు దూరంగా ఉండాలంటే ఈ కాలానికి తగిన, తగని ఆహార పదార్థాల పట్ల అవగాహన ఏర్పరుచుకోవాలి. అలాగే శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడం కోసం ఈ కాలాన్ని పరిపూర్ణంగా సద్వినియోగం ? చేసుకోవాలి.

అభ్యంగనం అవసరం

చల్లగాలితో చర్మపు తేమ తగ్గిపోకుండా ఉండడం కోసం ప్రతి రోజూ అభ్యంగనం ఆచరించాలి. అందుకోసం నువ్వుల నూనె లేదా ఆవ నూనె వాడుకోవచ్చు. అభ్యంగనం కోసం ఎండలో కూర్చుని ఒళ్లంతా నూనె పట్టించి, సున్నితంగా మర్దించి, కొంద్దిసేపు ఎండ తగిలేలా చూసుకుని, తర్వాత గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయాలి. ఈ పని తీరుబడిగా చేయగలిగితే, చర్మంలోకి నూనె ఇంకి, నునుపుగా మారి, పగుళ్లు ఏర్పడకుండా ఉంటాయి. క్షీరబలా తైలాన్ని కూడా అభ్యంగనం కోసం వాడుకోవచ్చు. ఈ నూనెను గోరువెచ్చగా కాచుకుని తల నుంచి పాదాల వరకూ మర్దించినా చర్మం మృదువుగా మారుతుంది.



శక్తిని పుంజుకునే కాలం

ఈ కాలంలో జఠరంలో అగ్ని ప్రబలంగా ఉండడం మూలంగా తిన్న ఆహారం తేలికగా అరుగుతుంది. కాబట్టి మిగతా కాలాలకు సరిపడా శక్తి నిల్వలను పెంచుకోవడం కోసం చలికాలాన్నీ, ఈ కాలంలో దొరికే పదార్థాలను మెరుగ్గా ఉపయోగించుకోవాలి. ఈ కాలంలో పండే పంటలన్నీ శరీరానికి శక్తినిచ్చేవే! కాలం కాని కాలంలో కృత్రిమంగా పండించే హైబ్రిడ్ పండ్లు కూడా నేడు మార్కెట్లో అందుబాటులో ఉన్నప్పటికీ వాటి జోలికి వెళ్లకపోవడమే మంచిది. మాంసకృత్తులు, కొవ్వులు ఎక్కువగా ఉండే పదార్థాలను నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. అలాగే పెరుగు విఎనహా మిగతా పాల ఉత్పత్తులన్నీ తినొచ్చు. ఈ కాలంలో దొరికే ఉసిరి, యాపిల్, పైనాపిల్, నారింజ, ద్రాక్ష మొదలైన సిట్రస్ పండ్లతో పాటు గాజర్ తింటూ ఉండాలి. ఈ కాలంలో గోధుమలు, బియ్యం తినొచ్చు. తృణధాన్యాల్లో రాగులు, ఉలవలు, సజ్జలు, బార్లీలు శరీరం పొడిబారుతుంది. కాబట్టి వీటి పరిమాణం తగ్గించాలి. కూరగాయల్లో చిక్కుడు తగ్గించాలి. ఈ కాలంలో పాలకూర, క్యాబేజీ, విఎనుములు, అలసందలు, పెసల పరిమాణం పెంచాలి. ఈ కాలంలో సముద్రాహారం, చికెన్, మటన్ నిరభ్యంతరంగా తినొచ్చు. ఈ కాలంలో ర్యాడిష్ మినహా మిగతా దుంపలన్నీ తినొచ్చు. డ్రైఫ్రూట్స్‌లోని మంచి కొవ్వులను శరీరం శోషించుకోవడం కోసం వాటిని బాగా నమిలి తినాలి. అలాగే చల్ల నీళ్లకు బదులుగా గోరువెచ్చని నీళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ కాలంలో దాహం తగ్గుతుంది కాబట్టి నీళ్ల పరిమాణం తగ్గించకూడదు. ఇలా చేస్తే మొలల సమస్య పెరుగుతుంది. కాబట్టి వీలైనన్ని ఎక్కువ నీళ్లు తాగాలి.

చిన్నపాటి జాగ్రత్తలతో...

ఈ కాలంలో సూక్ష్మక్రిములు విస్తృతంగా వృద్ధి చెందుతాయి కాబట్టి ఆ వీలు లేకుండా వ్యాధినిరోధకశక్తిని పెంచుకోవడం ద్వారా శ్వాసకోస సమస్యలకు దూరంగా ఉండొచ్చు. అందుకోసం ఉసిరి ఎంతో మేలు చేస్తుంది. రోజుకు ఒక ఉసిరి తిన్నా, ఉసిరితో తయారయ్యే చ్యవన్‌ప్రాష్ రోజుకొక స్పూను తీసుకున్నా మేలు కలుగుతుంది.

అలాగే అభ్యంగనం కూడా క్రమం తప్పకుండా ఆచరించాలి. అంత సమయం లేనివాళ్లు వారంలో కనీసం మూడు సార్లైనా కనీసం తల, ముఖం, మెడలకు నువ్వుల నూనె పట్టించి, మర్దన చేసుకుంటే ప్రయోజనం ఉంటుంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఈ కాలంలో అడపా దడపా శ్వాసకోస సమస్యల బారిన పడక తప్పదు. అలాంటప్పుడు ఏం చేయాలంటే...

- **కషాయం:** తులసి, వేపాకు (చెరొక అరగుప్పెడు), వాము, మిరియాల పొడి (అర చెంచా), వెల్లుల్లి (నాలుగు రెబ్బలు) తీసుకుని, వీటిని 400 మిల్లీలీటర్ల నీళ్లలో వేసి 100 మిల్లీలీటర్లకు చేరుకునే వరకూ మరిగించి, రెండు పూటలా 50 మిల్లీమీటర్ల చొప్పున తీసుకోవాలి. ఈ కషాయంతో ఒకట్రెండు రోజుల్లో జలుబు పూర్తిగా తగ్గిపోతుంది.
- **పసుపు:** గ్లాసు వేడి పాలల్లో అర చెంచా పసుపు కలుపుకుని రాత్రి నిద్రకు ముందు తాగాలి. పసుపు, యాలకులతో తయారైన హరిద్రఖండం ఔషధాన్ని కూడా తీసుకోవచ్చు. ప్రతి రాత్రి వేడి పాలలో, అరచెంచా హరిద్రఖండం కలుపుకుని తాగినా ఫలితం ఉంటుంది.
- **తాలిసాది చూర్ణం:** కఫం ఉనప్పుడు చెంచా చూర్ణాన్ని గోరువెచ్చని నీళ్ల లేదా తేనెతో కలిపి రోజుకు రెండు పూటలా తీసుకోవాలి. పిల్లలకు అర చెంచా సరిపోతుంది. ఈ చూర్ణం తేలికపాటి జలుబు, దగ్గు, జ్వరాలకు పని చేస్తుంది.
- **త్రికటు చూర్ణం:** సొంఠి, మిరియాలు,పిప్పలుతో తయారైన త్రికటు చూర్ణాన్ని జలుబు చేసిన వెంటనే తీసుకుంటే, సమస్య తీవ్రమవకుండా ఉంటుంది. అర చెంచా త్రికటు చూర్ణాన్ని వేడి నీళ్లలో లేదా తేనెతో కలిపి తీసుకుంటే ఫలితం ఉంటుంది.

చలికాలం వ్యాయామాలు

శీతాకాలం బద్ధకం వదలాలంటే శరీరాన్ని చలాకీగా ఉంచే వ్యాయామాలు చేయాలి. జీర్ణశక్తి మెరుగై, శక్తి సమంగా శరీరమంతటా ప్రసరించాలన్నా వ్యాయామం చేయక తప్పదు. గుండె వేగాన్ని పెంచే వ్యాయామాలు, కీళ్లు, కండరాలను బలపరిచే వ్యాయామాలు చేయాలి. యోగాభ్యాసాలు కూడా చేయవచ్చు. సైకిల్ తొక్కడం, ఈత, స్కిప్పింగ్ లాంటివీ చేయవచ్చు. వ్యాయామం చేయాలనే ఆసక్తి లేనివారు బ్యాడ్మింటన్ లాంటి క్రీడలతో కూడా శరీరానికి వ్యాయామం అందించవచ్చు. అయితే వ్యాయామం చేస్తున్నంత సేపు తప్పనిసరిగా నీళ్లు తాగుతూ ఉండాలి. చమట ద్వారా బయటకు వెళ్లిపోయే ఖనిజ లవణాలను భర్తీ చేస్తూ ఉండాలి.

ఆరోగ్య కొవ్వులు

ఈ కాలం బలాన్ని పెంచుకోవడం కోసం నాణ్యమైన కొవ్వులను ఆహారంలో చేర్చుకోవాలి. ఇందుకోసం...

- **అవిసె నూనె:** ఈ నూనెను కూరగాయల సూప్‌లో పరిమితంగా కలుపుకుని తీసుకోవచ్చు. అయితే ఈ నూనెను నేరుగా వంటకు ఉపయోగించకూడదు.
- **సబ్జా:** వీటిని 10 నుంచి 20 నిమిషాలపాటు నీళ్లలో నానబెట్టి తాగాలి. లేదంటే రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే తాగవచ్చు. వీటిలోని ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు జీర్ణవ్యవస్థతో పాటు నాడీవ్యవస్థనూ ఆరోగ్యంగా ఉంచుతాయి.
- **అవకాడొ:** మాంసకృత్తులు కలిగిన ఈ పండును ఏ సమయంలోనైనా తినవచ్చు.
- **నాణ్యమైన నూనెలు:** ఆలివ్, అవకాడొ, కొబ్బరి, నువ్వులు, పొద్దుతిరుగుడు నూనెలు వాడుకోవచ్చు.
- **నెయ్యి:** ఆయుర్వేదంలో నెయ్యి స్వర్ణంతో సమానం. వెన్న, నెయ్యి జీర్ణశక్తిని పెంచి, శరీర కణజాలాలకు శక్తినిస్తాయి.

డాక్టర్ డి.వి. ప్రశాంత్ కుమార్
పంచకర్మ నిపుణులు,
శక్తి ఆయుర్వేదిక్ క్లినిక్,
ఈస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్.



మెదడు మొద్దుబారకుండా...

డిజిటల్ పరికరాల వాడకం మెదడు ఏకాగ్రతను తగ్గించి, జీవితంలోని సాధారణ సరదాల నుంచి ఆనందం పొందే సామర్థ్యాన్ని కుంటు పరుస్తుంది. ఈ పరిస్థితి మరింత దిగజారకుండా ఉండాలంటే, ముందుగానే అప్రమత్తం కావాలి.

డిజిటల్ పరికరాలను ఎక్కువగా ఉపయోగించడం వల్ల మెదడు అవసరానికి మించి ప్రేరేపితమై, ఏకాగ్రత సామర్థ్యాన్ని కోల్పోతుంది. ఈ పరిస్థితికి లోనైన మెదడుకు 'పాప్‌కార్న్ బ్రెయిన్' అని అమెరికాకు చెందిన డేవిడ్ ఎమ్. లెవీ అనే కంప్యూటర్ సైంటిస్టు నామకరణం చేశాడు. తరచూ స్క్రీన్ మీద ప్రత్యక్షమవుతూ ఉండే నిరంతర నోటిఫికేషన్లు, లైక్స్‌ను చూడగానే చటుక్కున పెరిగిపోయే డోపమైన్ హార్మోన్‌ల ఆధారంగా పాప్‌కార్న్ బ్రెయిన్ అనే పదాన్ని సృష్టించాడాయన. ఫోన్‌లో మోగే ప్రతి నోటిఫికేషన్ శబ్దం, అవసరమైన పనులపై నుంచి మనసును మళ్లించి, ఏకాగ్రతను కుంటుపరుస్తుంది. మన మెదడెప్పుడూ కొత్తదానికి ఆకర్షితమయ్యేలా రూపొంది ఉంటుంది. కాబట్టి ఈ లక్షణాన్ని సద్వినియోగం చేసుకునే డిజిటల్ పరికరాలు, వినోదం కోసం అంతులేనన్ని కొత్తమార్గాలను ఆవిష్కరిస్తున్నాయి. సామాజిక మాధ్యమాలు, వీడియో గేమ్స్, నిరంతర స్క్రోలింగ్‌లు, ఫీల్‌గుడ్ హార్మోన్‌ను విడుదల చేస్తూ, పదే పదే ఆ వినోదాన్ని కోరుకునేలా మెదడును దాసోహం చేస్తాయి. ఇలా మెదడుకు చేరుకునే డిజిటల్ సమాచారం వల్ల కొంతకాలానికి మెదడు నిరంతరం దృష్టి పెట్టవలసిన పనుల పట్ల ఏకాగ్రతను కేటాయించే సామర్థ్యాన్ని కోల్పోతుంది. పుస్తక పఠనం, అర్థవంతమైన సంభాషణలను కొనసాగించడం కష్టతరమైపోతుంది. ఈ డిజిటల్ సంతృప్తికి అలవాటు పడిన వాళ్లు ఎలాంటి తక్షణ సంతృప్తినిచ్చే స్క్రీన్ల తోడు లేకుండా కుదురుగా కొద్దిసేపు కూడా కూర్చోలేకపోతూ ఉంటారు.

మేలుకుందాం



పెరిగే నిద్రలేమి

డిజిటల్ పరికరాలతో పొందే అవసరానికి మించిన ప్రేరణ ఆందోళన, మానసిక కుంగుబాటులకు, తమలో ఏదో లోపించిందనే భావనలకూ దారి తీస్తుంది. మరీ ముఖ్యంగా నిద్రకు ముందు ఎక్కువ సమయాల పాటు ఫోన్లకు అతుక్కుపోవడం వల్ల నిద్రకు తోడ్పడే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గి నిద్రలేమి వేధిస్తుంది. ఫోన్ల నుంచి వెలువడే నీలి వెలుగు, మెదడును చురుగ్గా ఉంచి, నిద్ర నాణ్యతను తగ్గిస్తుంది. దీర్ఘకాలం పాటు స్క్రీన్‌కు బహిర్గతమయ్యేవారికి శరీర భంగిమలు, కంటి సమస్యలు కూడా తప్పదు.

పరిమితి ఇలా...

- డిజిటల్ పరికరాల వాడకానికి సమయ పరిమితి విధించాలి. సామాజిక మాధ్యమాల వాడకాన్ని నిర్దిష్ట సమయానికే పరిమితం చేయాలి.
- పడగ్గది, భోజనాల గది, స్నానాల గదుల్లో వాటి వాడకాన్ని మానేయాలి. ఇంట్లో ఆడుకునే ఆటలు, పుస్తకాలు లాంటి ఇతర కాలక్షేపాలను పెంచి స్క్రీన్ టైమ్ తగ్గించాలి.
- తోట పని, బొమ్మలు గీయడం, వ్యాయామం లాంటి వ్యాపకాలను అలవరుచుకోవాలి
- స్క్రీన్లతో సంబంధం లేని వ్యాయామాలు, ధ్యానాలకు సమయం కేటాయించాలి.
- నిద్రకు గంట ముందు నుంచి స్క్రీన్లకు దూరంగా ఉండడం అలవాటు చేసుకోవాలి
- వీడియో స్ట్రీమింగ్‌కు బదులుగా ఆడియో బుక్స్, పాడ్‌కాస్ట్స్, రేడియో వినడం అలవాటు చేసుకోవాలి.

ఆరోగ్యమే మహా భాగ్యం

ఆ సువాసనలు ప్రమాదకరం

సువాసనలు వెదజల్లే కొవ్వొత్తులు, అగర్బత్తీలు, రూమ్ ఫ్రెష్‌నర్లు ఆహ్లాదకరకరమైన సువాసనలు వెదజల్లుతూ హాయిగొలుపుతాయి. అయితే ఈ సువాసనలు దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలను కూడా తెచ్చిపెడతాయి. ఎలాగంటే...

గదుల్లోని దుర్వాసనలు పారదోలి, సువాసనలతో కూడిన వాతావరణాన్ని సృష్టించడం కోసం అగర్బత్తీలు, కొవ్వొత్తులు, రూమ్ ఫ్రెష్‌నర్ స్ప్రేలను తరచూ వాడుతూ ఉంటాం. కానీ ఇవి దుర్వాసనలను పారదోలుతూ గదుల్లో గాలి కలుషితాలను పెంచుతాయి. కిటికీలన్నీ మూసి ఉంచిన గదుల్లో సువాసనలు వెదలజ్లే కొవ్వుత్తులు, అగర్బత్తీలను వెలిగించడం వల్ల వాటి ద్వారా వెలువడే పొగలు, వాసనలు ఇంట్లోని వాతావరణాన్ని కలుషితం చేసి, సూక్ష్మ రేణువుల సాంద్రతను పరిమితికి మించి 15 రెట్లు పెంచుతాయి. ఈ పరిస్థితి సాధారణ స్థితికి చేరుకోడానికి కొన్ని గంటల సమయం పడుతుంది. సువాసన వెదజల్లే అగర్బత్తీలు, కొవ్వుత్తులను వెలిగించడం వల్ల వాటి నుంచి మిశ్రమ రసాయనాలతో పాటు, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్స్ మొదలైన విషపూరిత వాయువులు వెలువడతాయి. రూమ్ ఫ్రెష్‌నర్లలో ఉండే సేంద్రీయ



సమ్మేళనాలు ఆరోగ్యానికి హాని చేస్తాయి. స్వల్ప వ్యవధుల పాటు వీటికి బహిర్గతం కావడం వల్ల దగ్గు, తుమ్ములు, కళ్లు, ముక్కు, గొంతు మంట లాంటి సమస్యలు వేధిస్తాయి. అయితే దీర్ఘ కాలం పాటు వీటికి బహిర్గతమైతే, తీవ్ర ఊపిరితిత్తుల సమస్యలు తప్పవు. వీటికి బహిర్గతమైతే, ఉబ్బసం వ్యాధిగ్రస్థుల ఇబ్బందులు మరింత పెరుగుతాయి. సహజసిద్ధ సేంద్రీ పదార్థాలతో తయారైన కొవ్వొత్తులు సురక్షితమైనవి అనుకుంటే పొరపాటు. వీటిని వెలిగించినప్పుడు, సహజసిద్ధ సువాసనల్లో కలిసి ఉండే హానికారక రసాయనాలు విడుదలై కాలుష్యాన్ని పెంచుతాయి.

ఫలాహారం

పండ్లు పరిమితంగానే...

బరువు తగ్గడం కోసం కొంతమంది పూర్తిగా పండ్ల మీదే ఆధారపడుతూ ఉంటారు. కానీ ఫలాహారం ఆరోగ్యకరం కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

సమతులాహారంలో భాగంగా తరచూ పండ్లు తింటూ ఉండడం కచ్చితంగా ఆరోగ్యకరమే! అయితే ఆ అలవాటులో భాగంగా అవసరానికి మించి పండ్లు తింటున్నామా? అని ఎవరైనా, ఎప్పుడైనా ఆలోచించారా? ఎందుకంటే... 'అతి అనర్థదాయకం' అంటారు. ఈ సూత్రం పండ్లకూ వర్తిస్తుంది. అతిగా పండ్లు తినడం వల్ల ఒరిగే ప్రభావం ప్రత్యేకించి కాలేయానికి ప్రతికూలంగా ఉంటుంది. ఎక్కువ కాలం పాటు అధిక మోతాదుల్లోని ఫ్రక్టోజ్ కాలేయానికి చేరినప్పుడు, కాలేయం ఆ అదనపు ఫ్రక్టోజ్‌ను కొవ్వుగా మార్చుకుంటుంది. ఫలితంగా ఆ పరిస్థితి, నాన్‌ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్‌కు దారి తీస్తుంది. అదనంగా పండ్లు తినడం వల్ల, కడుపుబ్బరం, డయేరియా లాంటి తాత్కాలిక సమస్యలు కూడా తలెత్తే అవకాశాలుంటాయి. అలాగే పండ్లలోని సహజసిద్ధ ఆమ్లాలు, చక్కెరల వల్ల దంతక్షయం ప్రమాదం ఉంటుంది. అలాగే రక్తంలో చక్కెర మోతాదులు హెచ్చుతగ్గులకు గురవుతాయి కాబట్టి మధుమేహులు, హైపర్‌గ్లైసీమియా లేదా క్లోమ సమస్యలు ఉన్నవాళ్లు పండ్లు వీలైనంత పరిమితంగా తీసుకోవాలి.



జెత్వానీ కేసు.. విద్యాసాగర్‌కు బెయిల్



» పలు షరతులు విధించిన హైకోర్టు

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సినీ నటి కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌కు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. విజయవాడ మూడవ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సంతృప్తి మేరకు రూ.50వేల వ్యక్తిగత బాండ్‌తో రెండు పూచీకత్తులు సమర్పించాలని పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. చార్జిషీట్ దాఖలు చేసేవరకు లేదా మూడునెలల వరకు ప్రతినెలా 1వ, 15వ తేదీల్లో ఉదయం 10 గంటలు, మధ్యాహ్నం ఒంటిగంట మధ్య దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని స్పష్టం చేసింది. దర్యాప్తు అధికారి కోరినప్పుడు అందుబాటులో ఉండాలని, ప్రత్యక్షంగాకానీ పరోక్షంగాకానీ సాక్షులను ప్రభావితం, బెదిరించడం చేయవద్దని పిటిషనర్‌కు తేల్చిచెప్పింది. ఇదే తరహా నేరాల్లో పాల్గొనవద్దని, ట్రయల్ కోర్టులో విచారణకు తప్పనిసరిగా హాజరవుతుండాలని స్పష్టం చేసింది. కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా జెత్వానీపై నమోదైన కేసు, జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా కుక్కల విద్యాసాగర్‌పై నమోదైన కేసు రెండూ దర్యాప్తు దశలోనే ఉన్నాయని గుర్తుచేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ సోమవారం తీర్పు ఇచ్చారు.

ఏకపక్షంగా సేల్ డీడ్ల రద్దు కుదరదు : హైకోర్టు

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బాధిత వ్యక్తులకు నోటీసులు ఇవ్వకుండా, వారి వివరణ తీసుకోకుండా నేరుగా రిజిస్టర్డ్ సేల్ డీడ్లను రద్దు చేయడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. సేల్ డీడ్ రద్దుతో ఆస్తిని కోల్పేయే వారికి తమ వాదన చెప్పుకొనే అవకాశం ఇవ్వకపోవడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని పేర్కొంది. రిజిస్ట్రేషన్ శాఖ నిబంధనల్లో నోటీసు జారీ గురించి నిర్దిష్టంగా ప్రస్తావించనప్పటికీ.. ఆ నిబంధన ఉన్నట్లు భావించి నోటీసులు ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పింది. నోటీసులు ఇవ్వాలనే నిబంధన ఏదీ లేకుంటే, అలాంటి రూల్స్‌ను రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలని సుప్రీంకోర్టు సైతం స్పష్టం చేసిందని గుర్తుచేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావు ఇటీవల తీర్పు ఇచ్చారు. విశాఖజిల్లా, సబ్బవరం మండలం, గాలి భీమవరం గ్రామానికి చెందిన జోరీగుల బంగారం అనే వ్యక్తి తన భూమిని జి.నాగేశ్వరరావు, ఎస్.రమణ, షేక్ ఆసిఫ్ పాషాలకు 2013లో విక్రయించారు. సబ్బవరం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ముగిసింది. సేల్ డీడ్లు జారీ చేశారు. అయితే ఆ భూమిని పోరంబోకుగా పేర్కొంటూ అధికారులు 2014లో సేల్ డీడ్లను రద్దు చేశారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ.. బంగారం, ఆయన భూమి కొన్నవారు అదే ఏడాది హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు.

బిగ్‌బాస్ ప్రసారంపై జోక్యం చేసుకోం

» అశ్లీలతపై ఫిర్యాదులకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయి

» కొన్ని ఫొటోలు చూపి షో నిలిపేయమంటే సాధ్యం కాదు

» పిటిషనర్‌కు హైకోర్టు స్పష్టీకరణ.. పిల్స్ కొట్టివేత

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బిగ్ బాస్ షో ప్రసారం విషయంలో జోక్యం చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నిరాకరించింది. ఆ రియాలిటీ షోలో అసభ్యత, అశ్లీలత ఉంటే, వాటిపై ఫిర్యాదుకు చట్టంలో ప్రత్యామ్నాయాలు ఉన్నాయని ధర్మాసనం గుర్తుచేసింది. షోలోని కొన్ని సన్నివేశాల ఫోటోలు తమ ముందు ఉంచి ఆషోను నిలిపివేయాలంటే సాధ్యం కాదంది. పిటిషనర్ అభ్యంతరం చెబుతున్న సన్నివేశాలు అశ్లీలత నిర్వచనం పరిధిలోకి వస్తాయా? లేదా? అనే విషయాన్ని నిర్ధారించేందుకు చట్టంలో మూడంచెల విధానం ఉందని పేర్కొంది. రియాలిటీ షోలోని అంశాలపై పిటిషనర్ కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేసి ఊరుకున్నారని ఆక్షేపించింది. కేబుల్ టీవీ నియంత్రణ చట్ట నిబంధనలు అనుసరించి ప్రస్తుత పిల్‌లోని అంశాలన్నింటినీ సంబంధిత యంత్రాంగం ముందు లేవనెత్తాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. బిగ్‌బాస్ షోను నిలుపుదల చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. యువతను పెడదారి పట్టించడంతో పాటు అశ్లీలత, హింసాత్మక చర్యలను ప్రోత్సహించేలా ఉన్న బిగ్‌బాస్ షోను రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్య మాత్రమే ప్రసారం చేయాలని, లేదా నిలుపుదల చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త, నిర్మాత కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి 2019, 2022లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై వాదనలు ముగిశాక తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం ఇటీవల నిర్ణయం వెల్లడించింది.

న్యాయ నిపుణులతో చర్చించాకే..

హెల్త్ అసిస్టెంట్లను తొలగించాం

» ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ కృష్ణబాబు

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న 920 మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్(మేల్)లను తొలగించడం బాధాకరమైనప్పటికీ, న్యాయపరమైన చిక్కుల నుంచి బయటపడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హైకోర్టు ఉత్తర్వులపై న్యాయ నిపుణులతో చర్చించాకే హెల్త్ అసిస్టెంట్లను తొలగించామన్నారు. వీరి నియామక ప్రక్రియలో తెలంగాణతో పోల్చితే ఏపీలో పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయన్నారు.

ఎన్టీఆర్ స్థానంలో వైఎస్ఆర్ పేరు

» వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ పేరుతో జీఏడీ ఉత్తర్వులు

» కూటమి ప్రభుత్వంలో పేరు మార్చినా గుర్తించని అధికారులు

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులే కాదు సాధారణ పరిపాలన శాఖ అధికారులు కూడా వైసీపీ మత్తు నుంచి బయటపడలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటికీ జగన్, వైఎస్ఆర్ పేర్ల జపమే చేస్తున్నారు. మాజీ సీఎస్ ఐ.వై.ఆర్.కృష్ణారావుకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద రూ.3,71,260 లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) పొలిటికల్ కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల్లో "డా.వైఎస్ఆర్ వైద్య సేవ ట్రస్ట్" సీఈవో సిఫారసు మేరకు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌గా ఉన్న దాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డా.ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌గా పేరు మార్చిన విషయం తెలిసిందే. గత మూడు నెలల నుంచి ట్రస్ట్ అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆ పేరుతోనే ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతున్నారు. సాధారణ పరిపాలన శాఖకు ఈ విషయం తెలియకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

'రెరా'లో 85 పెండింగ్ ఫైల్స్ క్లియర్

» ఇక ప్రత్యేక డ్రైవ్ ద్వారా పరిష్కరించాలి: మంత్రి నారాయణ ఆదేశాలు

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొత్త హౌసింగ్ ప్రాజెక్టులు, లేఅవుట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏపీ రెరా వద్ద పెండింగ్‌లో ఉన్న 85 ఫైళ్లను ఒకే రోజు పరిష్కరించారు. కొత్త ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్‌కు రెరాకు వ్యాపార సంస్థలు చేసే దరఖాస్తుల అసంపూర్తి సమాచారంపై అధికారులు నోటీసులిస్తున్నారు. అయితే సకాలంలో సమాధానాలు రాకపోవడంతో ఫైళ్ల క్లియరెన్స్ కావడం లేదంటున్నారు. వ్యాపార సంస్థల తరఫున ఎక్కువ మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు దరఖాస్తు చేస్తున్నారు. అసంపూర్తి సర్వే వివరాలపై రెరా నుంచి సర్వేయర్లకు వెళ్తున్న సమాచారం వ్యాపార సంస్థల నిర్వాహకులకు చేరడం లేదు. కొందరు సర్వేయర్లు పక్కన పెట్టేస్తున్న విషయాన్ని మంత్రి దృష్టికి తెచ్చారు. దీనిపై ఇటీవల నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను కూడా మంత్రి నారాయణ ఫోన్ చేసి అడిగారు. రెరా నుంచి వెళ్తున్న నోటీసులు ప్రాజెక్టు యాజమాన్యాలకు సరిగా వెళ్లడం లేదని మంత్రి నిర్ధారణకు వచ్చారు. ఇక నుంచి ప్రాజెక్టు నిర్వాహకుల ఫోన్ నంబర్లు తెలుసుకుని వారితో నేరుగా మాట్లాడాలని అధికారులకు సూచించారు. వారానికి రెండు రోజుల పాటు కమిటీ సమావేశమై పెండింగ్‌లో ఉన్న మిగతా 500 ఫైళ్లనూ వెంటనే పరిష్కరించాలని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు.

నేవీలోకి ఐఎన్ఎస్ తుషిల్

విశాఖపట్నం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళంలోకి మరో యుద్ధనౌక 'ఐఎన్ఎస్ తుషిల్' చేరింది. రష్యాలోని కలినిన్‌గ్రాడ్ యంటర్ షిప్‌యార్డులో భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సోమవారం దీనిని జలప్రవేశం చేయించారు. ఐఎన్ఎస్ తుషిల్ (ఎఫ్ 70) మల్టీరోల్ స్టెల్త్ గైడెడ్ మిస్సైల్ ఫ్రిగేట్. ఇది మార్గదర్శక క్షిపణులతో రహస్యంగా లక్ష్యాలను ఛేదిస్తుంది.



యుద్ధ నౌక ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, భారత్, రష్యా ఉన్నతాధికారులు

'ఫైబర్' ప్రక్షాళన ఏదీ?

» కూటమి ప్రభుత్వం వచ్చి 6 నెలలవుతున్నా మార్పులేదు

» మధుసూదనరెడ్డి జమానాలో 300 మంది పైచిలుకు వైసీపీ కార్యకర్తలకు కొలువు

» జీఎంగా గంధంశెట్టి సురేశ్ నియామకం

» ఆయనకు ఐఏఎస్‌లకు మించిన భారీవేతనం

» ఇప్పటికీ ఆయనే కీలకాధికారి

» ఇటీవల జగన్ సైన్యంలో కొద్ది మంది తొలగింపు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో ప్రక్షాళన జరుగడం లేదు. జగన్ సైన్యం ఇప్పటికీ తిష్ఠ వేసుకుని కూర్చుంది. పైగా అక్రమార్కులకే అక్కడ పెద్దపీట వేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి గద్దెనెక్కేనాటికి ఫైబర్‌నెట్‌లో దాదాపు 1,100 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో దాదాపు 300 మంది కడప వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి అనుయాయులు, వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలే. వీరెవరూ ఫైబర్‌నెట్ కార్యాలయానికే రాలేదు. కానీ నెలనెలా వారి ఖాతాల్లో జీతాలు పడిపోయాయి. ముఖ్యంగా జగన్ ప్రభుత్వం కడప జిల్లాకు చెందిన వైసీపీ కార్యకర్తలకు చేతికి ఎముక లేనట్లుగా రూ.లక్షల్లో వేతనాలు ఇచ్చేసింది. పులివెందుల నియోజకవర్గానికి చెందినవారినైతే కొత్త అల్లుడి తరహాలో చూసుకున్నారు. గంధంశెట్టి సురేశ్‌ను నెలకు రూ.2 లక్షల జీతంతో రాష్ట్ర ఎయిర్‌పోర్టు అథారిటీ లిమిటెడ్ (ఏపీఏడీసీ)లో జనరల్ మేనేజర్‌గా నియమించారు. ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవెన్ పదవీ విరమణకు కొద్దిరోజుల ముందు ఈ నియామకాన్ని చేపట్టారు. ఆ తర్వాత కొద్దికాలానికే సురేశ్‌ను అప్పటి ఫైబర్‌నెట్ ఎండీ మధుసూదనరెడ్డి తన వద్దకు రప్పించుకున్నారు. అక్కడ కీలకమైన ఆర్థిక విభాగంలో జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు అప్పగించారు. ప్రతినెలా రెండు లక్షల జీతంతో పాటు.. అదనంగా మరో రూ.లక్ష దాకా అలవెన్సులు మంజూరు చేశారు. ఐఏఎస్ అధికారులకు కూడా రానంత జీతాన్ని సురేశ్‌కు ఇవ్వడంపై విమర్శలు వచ్చినా జగన్ సర్కారు పట్టించుకోలేదు. ఆయన భార్య ప్రభుత్వ రంగ సంస్థలో ఏఎస్‌వోగా ఉన్నారు. 2024 ఎన్నికలకు ముందు మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించేందుకు ఆమె ప్రయత్నించడంతో.. మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఎన్నికల సంఘాని(ఈసీ)కి ఫిర్యాదు చేశారు. ఈసీ ఆమెను ఎన్నికల విధుల నుంచి తప్పించింది, తదనంతరం నాటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సిఫారసుతో వెలగపూడి సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా చేరారని అధికార వర్గాలు వెల్లడించాయి.

సురేశ్‌దే పెత్తనం..

కూటమి అధికారంలోకి వచ్చాక.. సురేశ్ దంపతులపై చర్యలు ఉంటాయని అందరూ భావించారు. ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌ను ప్రక్షాళన చేస్తారని ఆశించారు. మధుసూదనరెడ్డి ఎండీగా ఉన్నప్పుడు జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేస్తారని ప్రచారం జోరుగా సాగింది. ఇవేవీ జరుగలేదు. సురేశ్ ఇప్పటికీ కీలకాధికారిగా ఉండడంపై టీడీపీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. జగన్ సైన్యంలో కొద్ది మందిని విధుల నుంచి తొలగించినా.. అత్యధికులు ఇంకా కొనసాగుతున్నారు. ప్రస్తుతం దినేశ్‌కుమార్ ఫైబర్‌నెట్ ఎండీగా ఉన్నారు. అదనంగా డ్రోన్ కార్పొరేషన్ ఎండీగా, రియల్‌టైమ్ గవర్నెన్స్ సీఐవోబాధ్యతలు కూడా అప్పగించడంతో...ప్రక్షాళనపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు.

ఉంటుందా.. ఊడుతుందా?

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఫైబర్‌నెట్ కనెక్షన్లు 11 లక్షలకు చేరాయి. జగన్ ఐదేళ్ల ఏలుబడిలో అవి 5 లక్షలకు పడిపోయాయి. కూటమి సర్కారు వచ్చాక 20 లక్షల కనెక్షన్లను లక్ష్యంగా పెట్టుకున్నా.. మరో పది వేలు తగ్గినట్లు చెబుతున్నారు. గడచిన ఐదు నెలల్లో ఫైబర్‌నెట్ ఎంఎస్‌వోలతో సమావేశం పెట్టలేదు. వారి అభిప్రాయాలనూ సేకరించలేదు. ఫైబర్‌గ్రిడ్ బాక్సులను కూడా వారికి ఇవ్వడం ఆపేశారు. ఒకవైపు ఎంఎస్‌వోల సమస్యలను పరిష్కరించకపోవడం.. మరోవైపు కనెక్షన్ల పెంపుపై దృష్టిసారించకపోవడంతో.. అసలు ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఉంటుందో ఊడుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది.

బీటెక్ విద్యార్థులకు 'స్వయం' శిక్షణ

కేంద్రం, ఐఐటీ మద్రాసుతో ప్రభుత్వ ఒప్పందం

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం, ఐఐటీ మద్రాసు సంయుక్తంగా అమలుచేస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమం 'స్వయం'ను రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకురానుంది. ఈ మేరకు కేంద్రం, ఐఐటీ మద్రాసుతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉన్నత విద్యామండలి తాజాగా ఒప్పందం చేసుకున్నాయి. దీని ప్రకారం రాష్ట్రంలోని ఇంజనీరింగ్ విద్యార్థులకు 72 రకాల కోర్సుల్లో నైపుణ్యాలు పెంపొందించేలా అధ్యాపకులకు ఐఐటీ మద్రాసు ప్రొఫెసర్లు శిక్షణ ఇస్తారు. అలాగే ఆన్‌లైన్‌లోనూ విద్యార్థులకు నేరుగా శిక్షణ అందిస్తారు. ఒక సెమిస్టర్ పాటు కొనసాగే ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థులకు అదనంగా క్రెడిట్లు రావడంతో పాటు ఐఐటీ మద్రాసు సర్టిఫికెట్లు జారీ చేస్తుంది. సాఫ్ట్‌వేర్ కోర్సులతో పాటు మెకానికల్, సివిల్ తదితర రంగాల్లోనూ శిక్షణ ఇవ్వనున్నారు. విద్యార్థి చదువు పూర్తయ్యేలోగా అవసరమైన నైపుణ్యాలు సాధించడం ద్వారా వెంటనే ఉద్యోగం వచ్చే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. శిక్షణలో నాణ్యతతో పాటు ఐఐటీ మద్రాసు జారీచేసే సర్టిఫికెట్‌కు కూడా విలువ ఉంటుందని, దానివల్ల ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

స్థిరంగా అల్పపీడనం

» నేటికి తీవ్ర అల్పపీడనంగా బలోపేతం

» రేపు వాయుగుండంగా మార్పు

» 14, 15 తేదీల్లో మరో అల్పపీడనం

» దక్షిణ కోస్తా, సీమకు భారీ వర్షసూచన

» చురుగ్గా ఈశాన్య రుతుపవనాలు

» తూర్పుగాలుల ప్రభావమే కారణం

విశాఖపట్నం, అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాతావరణం అల్పపీడనాలు/తుఫాన్లకు అనుకూలంగా మారింది. గత నెలలో ఒక తుఫాన్ రాగా, ప్రస్తుతం ఒక అల్పపీడనం కొనసాగుతుంది. ఈనెల 14న లేదా 15న మరో అల్పపీడనం ఏర్పడనుంది. ఇప్పటికే 'ఫెంగల్' తుఫాన్‌తో తమిళనాడు, పుదుచ్చేరి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఏపీలోని కోస్తా, రాయలసీమల్లోనూ వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. దాని నుంచి ఇంకా కోలుకోకముందే రెండు రోజుల క్రితం ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. సోమవారం నాటికి ఇది స్థిరంగా కొనసాగుతోంది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి మంగళవారం నాటికి తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. బుధవారం కల్లా నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించి శ్రీలంక, తమిళనాడు తీరం దిశగా రానుంది. ఈ క్రమంలో బుధవారం రాత్రికి వాయుగుండంగా బలపడుతుందని ఇస్రో వాతావరణ నిపుణుడు ఒకరు తెలిపారు. దీని ప్రభావంతో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు తిరుపతి, చిత్తూరు, కడప, శ్రీసత్యసాయి, అన్నమయ్య, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయన్నారు. వాయుగుండం తీరం దిశగా వచ్చే సమయంలో దక్షిణ కోస్తా తీరంలో గంటకు 30 నుంచి 35 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయన్నారు. ఈనెల 14న లేదా 15న దక్షిణ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడుతుందని చెప్పారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో తూర్పుగాలుల ప్రభావం ఎక్కువగా ఉన్నందున ఈశాన్య రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయని, అందువల్ల కొద్దిరోజులుగా తమిళనాడు, దానికి ఆనుకుని ఉన్న రాష్ట్రాల్లో వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని తెలిపారు. మరికొద్ది రోజులు తూర్పుగాలుల ప్రభావం కొనసాగుతుందని, ఒక్కొక్కసారి సముద్రం నుంచి వచ్చే తేమగాలులతో తీర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుంటాయని చెప్పారు. తూర్పుగాలుల ప్రభావంతోనే రాష్ట్రంలో చలి ప్రభావం స్వల్పంగా ఉందన్నారు.

నాలుగు రోజులు వర్షాలు

అల్పపీడనం ప్రభావంతో రానున్న నాలుగు రోజులు వివిధ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ముఖ్యంగా చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం అల్లూరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు పడతాయని పేర్కొంది. వరి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించింది.

విజయ్‌పాల్ కస్టడీపై రేపు నిర్ణయం

రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో అరెస్టు

కోర్టులో ముగిసిన ఇరుపక్షాల వాదనలు



గుంటూరు(లీగల్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శాసనసభ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో అరెస్టయిన విశ్రాంత అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌ను విచారణ కోసం 5 రోజుల కస్టడీకి అప్పగించాలని కోరుతూ నగరంపాలెం(గుంటూరు) పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం తీర్పు వెలువడనుంది. సోమవారం గుంటూరులోని స్పెషల్ మొబైల్ కోర్టు ఇన్‌చార్జి, ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ జి.స్పందన వద్ద ఈ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదోపవాదాలు ముగిశాయి. తీర్పును మేజిస్ట్రేట్ బుధవారానికి వాయిదా వేశారు. విజయ్‌పాల్ ప్రస్తుతం గుంటూరు జిల్లా జైలులో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఆయనను తమ కస్టడీకి అప్పగించాలని నగరంపాలెం పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. ఈ కేసులో స్పెషల్ పీపీగా నియమితులైన ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్ వి.రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. అప్పట్లో సిట్టింగ్ ఎంపీగా ఉన్న రఘురామకృష్ణరాజు అప్పటి ముఖ్యమంత్రిని విమర్శించారని తద్వారా రాజద్రోహానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ దర్యాప్తు పేరుతో 2021 మే 14న 25 నుంచి 30 మంది కాన్వాయ్‌గా వెళ్లి హైదరాబాద్‌లోని రఘురామ ఇంట్లోకి అక్రమంగా చొరబడి అదుపులోకి తీసుకున్నారని, గుంటూరు సీఐడీ కార్యాలయంలోని ఒక రూంలో ఇంటరాగేషన్ పేరుతో ఉంచారని తెలిపారు. ఆ రూము వద్ద ఉన్న కొందరు పోలీసులను దర్యాప్తు అధికారి విజయ్‌పాల్ దూరంగా పంపించి వేశారని, ఆ తర్వాత 15 నిమిషాలకే బాధతో రఘురామకృష్ణరాజు పెడుతున్న కేకలను ఆ పోలీసులు విన్నారని చెప్పారు. రూములోకి వెళ్లేటప్పుడు తనంతతానుగా నడిచి వెళ్లిన రఘురామకృష్ణరాజును ఇంటరాగేషన్‌తో ఒక గంటలోనే నడవలేని స్థితికి తెచ్చారని, కోర్టులో హాజరుపరిచేందుకు ఇద్దరు వ్యక్తులు మోసుకురావాల్సి వచ్చిందని వివరించారు.దర్యాప్తు సమయంలో విజయ్‌పాల్ పోలీసులకు ఏమాత్రం సహకరించలేదని, దర్యాప్తు అధికారి ప్రశ్నలకు ఎటువంటి సమాధానాలూ చెప్పలేదని వివరించారు. ఈ కేసులో జరిగిన కుట్రను వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉందని, నేరంలో ఎవరెవరు పాల్గొన్నారో తేల్చాల్సి ఉందని, రఘురామకృష్ణరాజును కాళ్లపై బెల్టులతో కొడుతూ, వీడియో తీసి పంపించారని, ఆ వీడియో ఎవరికి పంపారో తేలాల్సి ఉందని చెప్పారు. విజయ్‌పాల్ తరఫున న్యాయవాది మన్మథరావు వాదనలు వినిపిస్తూ 2021 మే 14న ఘటన జరిగితే రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేయకుండా మూడేళ్లు ఎందుకు సమయం తీసుకున్నారో చెప్పాల్సి ఉందన్నారు. అరెస్టుకు ముందు నోటీసు అందుకున్న ప్రతిసారీ విజయ్‌పాల్ పోలీసుల ఎదుట హాజరయ్యారని తెలిపారు. పోలీసు కస్టడీకి తీసుకొని వేధించటానికే ఈ పిటిషన్ వేశారని, కనుక పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. దీనిపై స్పెషల్ పీపీ రాజేంద్రప్రసాద్ స్పందిస్తూ ఏ కేసులో ఎవరు దర్యాప్తు చేయాలనేది ప్రభుత్వ ఇష్టమని, దానిని నిందితులు ప్రశ్నించజాలరని పేర్కొన్నారు. ఇది హత్యాయత్నం కేసు కనుక, జీవిత ఖైదు పడే అవకాశం ఉందని, కనుక దీనికి ఇన్ని రోజుల్లోపు ఫిర్యాదు ఇవ్వాలనే కాలపరిమితి వర్తించదని తెలిపారు. రఘురామకృష్ణరాజును రాష్ట్రంలోకి వస్తే చంపేందుకు కుట్ర పన్నారని, ఆయనను రాష్ట్రంలోకి రానివ్వకుండా గత పాలకులు అడ్డుకున్నారని, దాని వల్లే ఫిర్యాదు చేయడం ఆలస్యమైందని వివరణ ఇచ్చారు.

నైపుణ్య వర్సిటీ ఎక్కడో?

» తిరుపతిలో ఏర్పాటుకు గతంలో నిర్ణయం

» 50 ఎకరాల భూమి కూడా కేటాయింపు

» ఇప్పుడు దానిపై ప్రభుత్వం పునరాలోచన

» ప్రైవేటు వర్సిటీతో కలసి చేపట్టే అవకాశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర యువతలో నైపుణ్యాలు మెరుగుపరిచే ఉద్దేశంతో ఏర్పాటు చేయదలచిన నైపుణ్య విశ్వవిద్యాలయం ఎక్కడ అనేది ప్రశ్నార్థకంగా మారింది. తిరుపతిలో స్కిల్ వర్సిటీ ఏర్పాటుకు గత ప్రభుత్వంలో నిర్ణయం తీసుకుని, 50 ఎకరాల భూమి కేటాయించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఆ దిశగానే కసరత్తు జరిగింది. కానీ కొంతకాలంగా దీనిపై ఎలాంటి కదలిక లేదు. నైపుణ్యాభివృద్ధి సంస్థ సారథ్యంలో తిరుపతిలో ఏర్పాటు చేయదలచిన స్కిల్ వర్సిటీపై సర్కారు పునరాలోచన చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై తుది నిర్ణయం తీసుకోవాలని నైపుణ్యాభివృద్ధి సంస్థ రెండు నెలల కిందట కోరింది. అందులో భాగంగా మూడు ప్రతిపాదనలు చేసింది. పూర్తిగా ప్రభుత్వమే యూనివర్సిటీని ఏర్పాటు చేయడం, ప్రభుత్వం భూమి కేటాయించి ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేయడం, ఎలాంటి నిధులు, భూములు ఇవ్వకుండా ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేయడం. విజయనగరంలోని సెంచూరియన్ ప్రైవేటు యూనివర్సిటీ స్కిల్ కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. పూర్తిగా ఆ వర్సిటీ నిధులతోనే నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తారు. అయితే ఇందులో రాష్ట్ర ప్రభుత్వానికి కొంత భాగస్వామ్యం ఉంటుంది. ఇప్పటికే ఒడిశాలో స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించిన సెంచూరియన్.. అదే తరహాలో ఇక్కడ కూడా మరొకటి ప్రారంభించడానికి ప్రయత్నిస్తోంది. కాగా, గత ప్రభుత్వంలో తిరుపతిలో స్కిల్ వర్సిటీ ఏర్పాటుకు భూమి కేటాయించినా అడుగు ముందుకు పడలేదు. భూమి, భవనాలు, ల్యాబ్‌లు, సిబ్బంది అన్నీ కలిపి కనీసం రూ.300 కోట్లు అవసరమని అంచనా వేశారు. ప్రస్తుతం ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో ఆ స్థాయిలో నిధులు వెచ్చించడం సర్కారుపై ఆర్థిక భారంగా మారుతుంది. అలాగే ఈ వర్సిటీ ఏర్పాటు చేసినా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు బోధించే సిబ్బంది అవసరం. ప్రస్తుతం ఉన్నత విద్యలోనే కొంతమేర నైపుణ్య శిక్షణ అందిస్తున్నందున వర్సిటీ ప్రారంభించిన తర్వాత దాన్ని ఎలా వినియోగించుకోవాలి అనేది కూడా ప్రశ్నార్థంగా మారింది. మరోవైపు నైపుణ్య గణన చేపట్టినందున స్కిల్ వర్సిటీ అంశాన్ని ప్రభుత్వం తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది.

వాటర్‌షెడ్ పనులకూ సోషల్ ఆడిట్

» క్వాలిటీ కంట్రోల్ తనిఖీల తర్వాతే చెల్లింపులు

» నీటి సంరక్షణ పనుల్లో అక్రమాలకు చెక్

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అవినీతిపై సోషల్ ఆడిట్, క్వాలిటీ కంట్రోల్ తనిఖీలు చేపట్టినట్లుగానే వాటర్‌షెడ్ పనులపై కూడా ఈ తనిఖీలు చేపట్టాలని గ్రామీణాభివృద్ధిశాఖ నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాలిచ్చారు. క్వాలిటీ కంట్రోల్ తనిఖీల తర్వాతే నీటి సంరక్షణ పనులకు చెల్లింపులు చేపట్టాలని సూచించారు. పీఎంకేఎస్‌వై-2.0 కింద కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి 2.44 హెక్టార్లలో నీటి సంరక్షణ కోసం 59 కొత్త వాటర్‌షెడ్లను మంజూరుచేసింది. అన్ని స్థాయిల్లో పనులను పర్యవేక్షించాలని ఇప్పటికే మార్గదర్శకాలను సూచించింది. చెక్‌డ్యాంలు, చెక్‌వాల్‌లు, ఫారంపాండ్లు, ఊటచెరువులు, కాంటూర్ కందకాలు, రాతికట్టడాలు తదితర నీటి సంరక్షణ పనులన్నింటినీ తనిఖీ చేపట్టి, అవినీతికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కూడా ఆకస్మిక తనిఖీలు చేపట్టి అవినీతికి అవకాశం లేకుండా చూడాలని కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోలీసులపై 'సజ్జల' స్కెచ్!


» డ్రైవర్‌తో భార్గవ్ దొంగ అరెస్టు డ్రామా

» సాంకేతిక దర్యాప్తులో తేలిన కుట్రకోణం

» ముందురోజు వైసీపీ పెద్దలతో టచ్‌లో.. సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు

» కేసు నమోదుకు రంగం సిద్ధం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)



వైసీపీ సోషల్ మీడియా మాజీ ఇన్‌చార్జి సజ్జల భార్గవ్ రెడ్డి డ్రైవర్ ఆడిన దొంగ అరెస్టు నాటకం ఇప్పుడు ఆయన మెడకు చుట్టుకుంది. దీని వెనుక వైసీపీ పెద్దల హస్తం కూడా ఉందని తేలింది. వీరంతా కలసి పోలీసులనే నిందితులుగా చూపే ప్రయత్నం చేయడంతో ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. తప్పుడు ఫిర్యాదు చేయించిన భార్గవ్‌పై కేసు నమోదు చేయడానికి రంగం సిద్ధం చేశారు. సజ్జల భార్గవ్ వద్ద ఆగిరిపల్లి మండలం సింహాద్రి అప్పన్నపేట గ్రామానికి చెందిన యామర్తి సుబ్బారావు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల రెండో తేదీ రాత్రి మఫ్టీలో ఉన్న ఇద్దరు టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లు సుబ్బారావును ఇంటి వద్ద నుంచి అరెస్టు చేశారని, అతని ముఖానికి మంకీ క్యాప్ తొడిగి ఒక అపార్టుమెంట్‌లోకి తీసుకెళ్లి భార్గవ్ గురించిన అన్ని విషయాలు చెప్పాలని ఇష్టానుసారంగా కొట్టారని, అనంతరం విజయవాడలోని ఆంధ్రా ఆసుపత్రి వద్ద వదిలేశారని మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఇతర వైసీపీ నాయకులు ఆరోపించారు. దీనిపై ఈ నెల 3న విజయవాడలోని సీపీ కార్యాలయానికి వెళ్లి పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబుకు ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏం జరిగిందంటే...

వైసీపీ నేతల ఫిర్యాదును స్వీకరించిన కమిషనర్ దర్యాప్తునకు ఆదేశించారు. దీంతో సుబ్బారావును పోలీసులు తీసుకొచ్చారని చెబుతున్న మార్గాల్లో సీసీ ఫుటేజీని అధికారులు పరిశీలించారు. రెండో తేదీ రాత్రి అతడిని తీసుకొచ్చినట్టు ఎక్కడా ఆధారాలు లభించలేదు. అలాగే ఆయా ప్రాంతాల్లో సెల్‌టవర్ లొకేషన్‌లోనూ సిగ్నల్ పాయింట్ సైతం రాలేదు. దీంతో అనుమానించిన పోలీసులు సుబ్బారావు నుంచి వాంగ్మూలం తీసుకోవడంతో అతనిలో తడబాటు మొదలైంది. అరెస్టు చేసే సమయంలో సుబ్బారావు భార్య, పిల్లలను పోలీసులు బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే అతడి భార్య తన తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగోకపోవడంతో ఏడాది క్రితం నుంచి ఉయ్యూరు వద్ద ఉన్న అరట్లకట్ట గ్రామంలో ఉంటున్నట్టు విచారణలో నిర్ధారణ అయింది. సింహాద్రి అప్పన్నపేటలో ఇంటి నుంచి రెండో తేదీ రాత్రి సుబ్బారావును అరెస్టు చేశారని ఫిర్యాదులో తెలపగా, ఆ రోజున అతని సెల్‌టవర్ లొకేషన్ అరట్లకట్టలో చూపించింది. ఇక రెండో తేదీన సాయంత్రమే విజయవాడ కొత్త ప్రభుత్వాసుపత్రికి సమీపంలో ఉండే మిషనరీ ఆసుపత్రి వద్ద ఉన్న బస్టాప్‌లో కూర్చున్న సుబ్బారావును మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అనుచరులైన చంద్రలీల స్కూటర్‌పై ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లిన సీసీ ఫుటేజీని పోలీసులు సేకరించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అక్కడి క్యాజువాలిటీలో అతనికి ప్రాథమిక చికిత్స చేయించిన దృశ్యాలు ప్రభుత్వాసుపత్రి సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. దొంగ అరెస్టు డ్రామాకు ముందురోజు నుంచి వైసీపీ పెద్దలతో సుబ్బారావు టచ్‌లో ఉన్నట్టు పోలీసులు సాంకేతికంగా నిర్ధారించారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జునతో పాటు ఇతర వైసీపీ నేతలతో 1న అతను పలుమార్లు కాల్స్ మాట్లాడటంతో వారే ఈ నాటకాన్ని ఆడించారని గుర్తించారు. అసభ్యకర పోస్టింగ్‌లకు సంబంధించిన కేసుల్లో ఇరుక్కున్న భార్గవ్... బెయిల్ కోసమే ఇటువంటి డ్రామాలు ఆడిస్తున్నట్టు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులను నిందితులుగా పేర్కొంటూ ఫిర్యాదు చేయడాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. భార్గవ్‌పై కేసు నమోదుకు సిద్ధమవుతున్నారు.



బీజేపీ సభ్యత్వం కార్డు, రాజ్యసభ అభ్యర్థిగా బి ఫారంను ఆ పార్టీ నేతల నుంచి అందుకుంటున్న ఆర్.కృష్ణయ్య

రాజ్యసభకు టీడీపీ నుంచి బీద, సానా

» బీజేపీ అభ్యర్థిగా ఆర్ కృష్ణయ్య.. నేడు సభ్యుల నామినేషన్లు

అమరావతి, న్యూఢిల్లీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు కూటమి అభ్యర్థులు ఖరారయ్యారు. టీడీపీ నుంచి బీద మస్తాన్ రావు, సానా సతీశ్... బీజేపీ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్యను రాజ్యసభకు ఎంపిక చేసినట్లు సీఎం చంద్రబాబు సోమవారం ప్రకటించారు. ముగ్గురు అభ్యర్థులు మంగళవారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. వైసీపీకి తగిన సంఖ్యాబలం లేకపోవడంతో పోటీకి దూరంగా ఉంది. ఈ నేపథ్యంలో కూటమి అభ్యర్థుల ఎంపిక ఏకగ్రీవం కానుంది. కాగా తెలంగాణకు చెందిన బీసీ నాయకుడు ఆర్.కృష్ణయ్య... గతంలో వైసీపీ తరఫున రాజ్యసభలో అడుగుపెట్టారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే తన సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయనను బీజేపీ తిరిగి రాజ్యసభకు పంపనున్నట్లు 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. కృష్ణయ్య సోమవారం ఆన్‌లైన్ ద్వారా బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. అటు రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను, పార్టీ సభ్యత్వాన్ని కృష్ణయ్య ఒకేసారి తీసుకున్నారు.

విజయసాయిరెడ్డిపై కేసులు ఖాయం: అనిత

విజయవాడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిపై కచ్చితంగా కేసులు నమోదు చేస్తాం. అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులు బయట పడుతుండడంతో ఇప్పుడు ఇష్టానుసారం మాట్లాడుతున్నారు' అని హోంమంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ, గాంధీనగర్‌లోని జిల్లా జైలును ఆమె సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడారు. 'సీఎం చంద్రబాబు గురించి మాట్లాడే స్థాయి విజయసాయిరెడ్డికి లేదు. కూటమి ప్రభుత్వం మధ్య చిచ్చు పెట్టేవిధంగా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారు. పార్టీలకు పోలీసులు తొత్తులుగా మారితే చర్యలు తప్పవు. జిల్లా జైలులో అధికారులపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరుగుతోంది. రెండు రోజుల్లో నివేదిక వస్తుంది. దానిప్రకారం చర్యలు తీసుకుంటాం. కాకినాడ పోర్టులో పట్టుబడిన రేషన్ బియ్యం కేసులో విచారణ జరుగుతోంది' అని మంత్రి అనిత అన్నారు.

యనమల ఏనాడైనా బీసీల సమస్యలపై పోరాడారా?

» కులాల పేర్లతో బహిరంగ లేఖ సబబుకాదు: రెడ్డి సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ, అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఏనాడైనా బీసీల సమస్యల పోరాడారా? అని పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రశ్నించారు. 'పార్టీలో పదవులు అనుభవించి, ఇప్పుడు కులాల పేర్లతో లేఖలు రాయడం సరి కాదు. టీడీపీకి ఒక క్రమశిక్షణ ఉంది. యనమల ఇప్పుడు గీత దాటారు. ఈ విషయం చంద్రబాబు తేల్చాలి' అని రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు.

వ్యక్తులను, కులాలను తప్పుబట్టే ఉద్దేశం లేదు: యనమల

'వ్యక్తులను, కులాలను తప్పుబట్టే ఉద్దేశం నాకు లేదు' అని టీడీపీ ఎమ్మెల్సీ యనమల అన్నారు. 'కాకినాడ సెజ్ విషయంలో నా ప్రకటనను కొందరు వక్రీకరించారు. సెజ్‌లో బీసీలు, ఎస్సీలు నష్టపోయారని, కొందరు పెద్దలు లబ్ధి పొందారని చెప్పడం నా ఉద్దేశం. నేను జీవితాంతం టీడీపీ మనిషిని, వైసీపీ వ్యతిరేకిని. నా వ్యక్తిత్వాన్ని, పార్టీ పట్ల నా అంకిత భావాన్ని ఎవరూ శంకించాల్సిన పని లేదు. నేను ఎప్పుడూ పదవుల కోసం పాకులాడలేదు' అని పేర్కొన్నారు.

వైసీపీ పాలనలో అన్నదాతలకు మొండిచేయి: అచ్చెన్న

పార్వతీపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు. ఐదేళ్లు వ్యవసాయ రంగాన్ని విస్మరించారు. ఇప్పుడు రైతు సమస్యలపై మాట్లాడే హక్కు మాజీ సీఎం జగన్‌కు లేదు' అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. రైతుల గురించి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామని వైసీపీ చెప్పడం విడ్డూరంగా ఉంది. రైతులకు జగన్ క్షమాపణ చెప్పాలి' అని అచ్చెన్న అన్నారు.

రాష్ట్ర కేబినెట్‌లోకి నాగబాబు!!



రాజ్యసభ సీటుకు బదులుగా మంత్రి పదవి

కూటమి పార్టీల నడుమ అంగీకారం

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోదరుడు కె.నాగేంద్రబాబు త్వరలో రాష్ట్ర మంత్రివర్గంలో చేరనున్నారు. రాజ్యసభ సీటు వదులుకున్నందుకు ప్రతిగా ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించారు. కూటమి పార్టీల మధ్య ఈ మేరకు అంగీకారం కుదిరింది. ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం రాత్రి ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి మూడు రాజ్యసభ స్థానాలకు ఉపఎన్నిక జరుగనుండగా.. ఒకటి తన అన్న నాగేంద్రబాబుకు ఇవ్వాలని పవన్ కోరారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన ఆర్.కృష్ణయ్యకు తాము ముందే హామీ ఇచ్చామని, ఆ సీటు ఇవ్వలేమని బీజేపీ నాయకత్వం నిస్సహాయత వ్యక్తం చేసింది. తెలంగాణలో బీసీ వర్గాలను దరిచేర్చుకోవడానికి కృష్ణయ్య అవసరం ఉందని ఆ పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. టీడీపీ కూడా తన కోటా కింద వచ్చిన రెండు రాజ్యసభ సీట్లలో ఒక దానిని.. వైసీపీకి, రాజ్యసభకు రాజీనామా చేసి వచ్చిన బీద మస్తాన్‌రావుకు ఇస్తామని ముందుగానే హామీ ఇచ్చామని.. రెండోది కాకినాడ జిల్లాకు చెందిన పార్టీ నేత సానా సతీశ్‌కు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపింది. ఈ నేపథ్యంలో నాగబాబుకు రాజ్యసభ సీటు అవకాశం దక్కలేదు. లోక్‌సభ ఎన్నికల్లో అనకాపల్లి సీటు జనసేన కోటా కిందకు వచ్చిందని.. అక్కడ నాగబాబును నిలిపాలనుకున్నామని.. కానీ బీజేపీ కోసం త్యాగం చేశామని పవన్ కూటమి పార్టీలకు గుర్తుచేశారు. దీంతో ప్రత్యామ్నాయంగా నాగబాబును రాష్ట్ర కేబినెట్‌లోకి తీసుకోవాలని కూటమి నిర్ణయించింది. రాష్ట్ర మంత్రివర్గంలో ప్రస్తుతం ఒక ఖాళీ ఉంది. నాగబాబు ప్రస్తుతం శాసనసభలో గానీ, శాసన మండలిలో గానీ సభ్యుడు కాదు. ఏ సభలోనూ సభ్యుడు కాకపోయినా మంత్రిగా తీసుకోవచ్చు. కానీ ఆరు నెలల్లోపు ఆయన ఏదో ఒక సభ నుంచి ఎన్నిక కావాలి. కూటమి సర్కారు వచ్చాక వైసీపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. వాటిని మండలి చైర్మన్ మోషేన్‌రాజు ఇంకా ఆమోదించలేదు. అవి ఖాళీ అయితే.. అందులో ఒకటి నాగబాబుకు ఇస్తారు. లేదంటే వచ్చే మార్చిలో మండలిలో కొన్ని ఖాళీలు రానున్నాయి. అప్పుడైనా ఇచ్చే అవకాశం ఉంది. అయితే అంతకుముందే నాగబాబును మంత్రిగా తీసుకుంటారా.. లేక ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాక తీసుకుంటారా అన్నది చూడాల్సి ఉంది.

ఆంధ్రా టు ఆఫ్రికా

(మొదటి పేజీ తరువాయి)

విజిలెన్స్ విభాగం సవివరమైన నివేదిక ఇచ్చింది. ఈ అక్రమ రవాణాలో 80 మంది కీలక పాత్ర పోషించినట్లు గుర్తించింది. రైస్ మిల్లర్ల నుంచి సేకరణ... లబ్ధిదారులకు పంపిణీ....ఆ తర్వాత కొనుగోలు చేసి తిరిగి మిల్లులకు చేరే మార్గాలను వివరించింది. అక్కడి నుంచి సివిల్ సప్లైస్, పోలీసు, పోర్టు అధికారులు, కస్టమ్స్ హౌస్ ఏజెంట్లను మేనేజ్ చేసి ఆంధ్రా తీరం నుంచి ఆఫ్రికా దేశాలకు లక్షల టన్నులు ఎలా తరలించారో నివేదించింది. అక్రమ ఎగుమతి జరిగే ప్రక్రియ నుంచి..అందులో కీలకమైన వాటాదారులు, ఓడ రేవుల్లో వ్యవహారాలు, కట్టడిలో సవాళ్ల వరకు.. ముప్పై పేజీలకు పైగా ఉన్న నివేదికలో ప్రభుత్వానికి వివరించింది. అందులో పేర్కొన్న అంశాలు పరిశీలిస్తే...

ఎండీయూలతో రాచబాట..

మన రాష్ట్రంలో ఉచిత బియ్యం సరఫరాకు చిన్న సైజు ఎండీయూలను (రేషన్ వాహనాల) గత వైసీపీ ప్రభుత్వంలో ఉపయోగించారు. అక్రమ రవాణా ఈ వాహనాలతోనే మొదలవుతుంది. లబ్ధిదారుల్లో 30 నుంచి 40శాతం రేషన్ బియ్యం వాడటంలేదు. కొందరు పాక్షికంగా ఉపయోగించుకొంటున్నారు. ఇలాంటి వాళ్ల నుంచి ఎండీయూ ఆపరేటర్లే బియ్యాన్ని కొనుగోలు చేసేవాళ్లు. ప్రభుత్వానికి లెక్కలు చెప్పాలి కాబట్టి కొన్నిచోట్ల కృత్రిమ వేలి ముద్రలు కూడా ఉపయోగించారు. ఇలా లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని మండల, జిల్లా స్థాయిలో కొందరు వ్యాపారులకు విక్రయించేవారు. ఈ బియ్యమంతా ఎక్కడికక్కడ అనధికార స్టాక్ పాయింట్లలో నిల్వ చేసేవారు. ఆ తర్వాత బడా ఎగుమతిదారులు రంగంలోకి దిగుతారు. మండల, జిల్లా స్థాయి వ్యాపారుల నుంచి



రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తారు. ఆ బియ్యాన్ని ఎండీయూ వాహనాలతోపాటు లారీల్లోనూ మిల్లులకు తరలిస్తారు. మిల్లుల్లో బియ్యాన్ని పాలిష్ పట్టి... నూక, ఉప్పుడు బియ్యం పేరుతో రేవుల ద్వారా ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేశారు. రాయలసీమ జిల్లాలు, నెల్లూరు, ప్రకాశంలో కొంత భాగం నుంచి కృష్ణపట్నం, చెన్నై పోర్టులకు బియ్యం వెళ్లేవి. గుంటూరు నుంచి విశాఖపట్నం జిల్లాల వరకూ కాకినాడ యాంకరేజీ పోర్టుకు చేరుకుని అటు నుంచి విదేశాలకు వెళ్లిపోయేవి. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచీ రేషన్ బియ్యం సేకరించినట్లు విజిలెన్స్ గుర్తించింది. ఇలా గత ఐదేళ్ల పాటు లక్షల టన్నుల బియ్యాన్ని స్మగ్లింగ్ చేయగలిగారు. ప్రభుత్వ పెద్దలు కీలక నేతల సహకారం లేకుండా ఇది జరిగేది కాదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో వివరించింది.

సివిల్ సప్లైస్ విజిలెన్స్ 6(ఏ)తో సరి..

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూసుకోవాల్సిన సివిల్ సప్లై విజిలెన్స్ విభాగం తూతూ మంత్రంగా అప్పుడప్పుడు సోదాలు చేస్తుందని, పట్టుబడ్డ బియ్యంపై ఆ శాఖ చట్టం 6(ఏ) కింద నామమాత్రంగా జరిమానా విధిస్తోందని విజిలెన్స్ పెదవి విరిచింది. ఆటోలు, టెంపోలు మొదలుకొని పాతిక ముప్పై టన్నుల భారీ వాహనాల్లో రేషన్ బియ్యం పొరుగు రాష్ట్రాలకు తరలి పోతున్నా పట్టించుకోలేదని తేల్చింది. కాకినాడ పోర్టుకు వెళ్లే బియ్యం అయితే టోల్ గేట్లను సైతం మేనేజ్ చేసి ఏకంగా గ్రీన్ చానెల్ ఏర్పాటు చేశారని పేర్కొంది. రాజకీయ నాయకులతో కుమ్మక్కై వ్యాపారులు, అధికారులు 2019నుంచి 2024మధ్య మొత్తం రేషన్ బియ్యాన్ని ఊడ్చేశారని వివరించింది.

విజిలెన్స్ నివేదికలోని ముఖ్యాంశాలు

- బియ్యం స్మగ్లింగ్‌కు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- ఐపీసీ, బీఎన్ఎస్ 2023 చట్టాల మేరకు కేసులు నమోదు చేసి వారిని జైలుకు పంపితేనే ఫలితం ఉంటుంది. బాధ్యులను గుర్తించి సరఫరా నెట్‌వర్క్‌ను తెగ్గొట్టి కీలక స్మగ్లర్లకు సంకెళ్లు వేయాలి.
- ప్రతి జిల్లాలోనూ రేషన్ మాఫియాతో సంబంధం ఉన్న వ్యక్తులు ఉన్నారు. రాష్ట్రం మొత్తం మీద ఉన్న ఇలాంటి 80మంది కింగ్ పిన్స్‌ను కట్టడి చేయాలి.
- అక్రమార్కులకు శిక్షలు పడేలా వాదించేందుకు ప్రతి జిల్లాలోనూ అనుభవజ్ఞులైన ప్రాసిక్యూటర్లను నియమించాలి.
- కాకినాడ పోర్టు చుట్టూ ఉన్న ప్రైవేటు వ్యక్తుల కట్టడికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి.
- వాహనాల తనిఖీలు, బియ్యం అనధికారిక నిల్వల తనిఖీ చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉండాలి.
- రైస్ మిల్లుల్లో రేషన్ బియ్యం పాలిషింగ్ నిరోధించాలి. గడిచిన ఐదేళ్ల రికార్డులన్నీ పరిశీలించి విద్యుత్ బిల్లులు సైతం తనిఖీ చేయాలి.
- పీడీఎస్ పంపిణీలో లొసుగుల కట్టడికి డిజిటల్ రికార్డుల నిర్వహణ, రవాణాలో వాహన ట్రాకింగ్ కోసం జీపీఎస్ ఏర్పాటు లాంటి చర్యలు తీసుకోవాలి.
- జిల్లాల కలెక్టర్ల అధ్యక్షతన జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటుచేసి రేషన్ బియ్యం సరఫరాపై నిరంతర నిఘాపెట్టి కమిటీలు ఇచ్చే సూచనలు, సమాచారంతో ఎప్పటికప్పుడు సమీక్షించుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టాలి.

బియ్యం సేకరణ, పంపిణీలో..

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పండించే వరిని రైతు భరోసా కేంద్రాల ద్వారా కనీస మద్దతుధరతో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ కొనుగోలు చేస్తుంది. ఆ ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు ఇస్తే ప్రతి వంద కిలోలకు 67కిలోల చొప్పున బియ్యం తిరిగి వెనక్కి మిల్లర్లు ఇస్తారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధీనంలో ఉండే గోడౌన్లలో వాటిని నిల్వ చేసి మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్లకు తరలించి అక్కడి నుంచి రేషన్ డీలర్‌కు అంతిమంగా ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారుల ఇంటివద్దకు చేర్చాలి. ఇందులో బియ్యం సేకరణ నుంచి లబ్ధిదారులకు చేరే వరకూ ఎక్కడికక్కడ లోపాలను విజిలెన్స్ నివేదిక ఎత్తి చూపింది. బియ్యం నాణ్యత, నిల్వలో జాగ్రత్తలు, తూకాల్లో తేడాలు, దొంగతనాలు ఇతరత్రా జాగ్రత్తల్లో ఆయా విభాగాల బాధ్యుల నిర్లక్ష్యం, అవినీతిని ఎండగట్టింది. ఈ-పోస్ నుంచి రేషన్ బియ్యం రీసైక్లింగ్ వరకూ అన్ని చోట్లా మేనేజ్ చేశారని, యాదృచ్ఛిక తనిఖీలు చేపట్టి తూతూ మంత్రంగా ఆడిట్ చేశారని తేల్చింది.

పేర్ని నాని బియ్యం దందా

» ఎన్నికల ముందు 250 టన్నులు మాయం

» ఆయన పౌరసరఫరాల శాఖకు అద్దెకు ఇచ్చిన గోదాముల నుంచి తరలింపు

» కూటమి ప్రభుత్వం వచ్చాక వెలుగులోకి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రేషన్ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా మాజీ మంత్రి పేర్ని నాని బియ్యం దందా బయటపడింది. పౌరసరఫరాల శాఖకు ఆయన అద్దెకు ఇచ్చిన గోదాముల్లో సుమారు 250 టన్నుల బియ్యం మాయమైంది. దీని విలువ రూ.కోటి పైచిలుకు ఉంటుందని అంచనా. ఎన్నికలకు ముందే బియ్యం మాయమైనా అప్పట్లో అధికారులు ఈ విషయం బయటకు రాకుండా తొక్కిపెట్టారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడం, పౌరసరఫరాల శాఖ అధికారులూ బదిలీలు కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై అధికారులు విచారణ చేయగా... పేర్ని నాని సూచనల మేరకే బియ్యం తరలించానని గోదాము ఇన్‌చార్జి వెల్లడించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పౌరసరఫరాల శాఖకు రెండుచోట్ల గోదాములు ఉన్నాయి. చిలకలపూడి వద్ద సెంట్రల్ వేర్ హౌసింగ్ గోదాములు ఉన్నాయి. మంగినపూడి బీచ్ సమీపంలో బందరు రూరల్ మండలం కొత్తపూడి పంచాయతీ పొట్లపాలెం గ్రామంలో పేర్ని నానికి సుమారు 2 ఎకరాల్లో గోదాములు ఉన్నాయి. వీటిని పౌరసరఫరాల శాఖకు అద్దెకు ఇచ్చారు. ఆ శాఖ వీటిని బఫర్ గోదాములుగా వినియోగిస్తోంది. వీటి సామర్థ్యం సుమారు లక్ష టన్నులు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఎన్నికలకు ముందు మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ గోదాముల నుంచి సుమారు 250 టన్నుల బియ్యం మాయమైంది. అయినా ఈ విషయాన్ని అధికారులు వెల్లడించలేదు. సాధారణంగా గోదాములను అద్దెకు ఇచ్చిన తర్వాత యజమానికి ఎలాంటి సంబంధం ఉండదు. మొత్తం బాధ్యత పౌరసరఫరాల శాఖ అధికారులదే. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండటంతో పేర్ని మనిషినే బఫర్ గోదాముల వద్ద ఔట్‌సోర్సింగ్ ద్వారా ఇన్‌చార్జిగా నియమించారు. గోదాముల నుంచి పెద్దఎత్తున బియ్యం మాయమైన ఘటనకు ఇన్‌చార్జితో పాటు పౌరసరఫరాల శాఖ అధికారులను బాధ్యులను చేయాల్సి ఉంది. ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. గోడౌన్ ఇన్‌చార్జిని విచారించారు. తనకేం సంబంధం లేదని, పేర్ని నాని సూచనల మేరకే బియ్యం తరలించానని ఆయన చెప్పారు.

మచిలీపట్నం సమీపంలో పేర్ని నాని అద్దెకు ఇచ్చిన బియ్యం గోడౌన్లు





నానికి అధికారుల సహకారం

బియ్యం మాయమైన ఘటనలో పేర్ని నానిపై అధికారులు కేసు నమోదు చేయాల్సి ఉంది. కానీ నానికి సన్నిహితంగా ఉండే కొందరు అధికారులు ఈ విషయాన్ని ఆయనకు తెలియజేసి, విషయం బయటకు పొక్కకముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దీంతో తన గోదాముల్లో మాయమైన బియ్యానికి ఖరీదు ఎంతో తెలిపితే ఆ మొత్తాన్ని చెల్లిస్తానని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌కు నాని లేఖ రాశారు. జేసీ ఈ లేఖను పౌరసరఫరాల శాఖ ఎండీకి పంపి, తగిన సూచనలు చేయాల్సిందిగా కోరినట్లు సమాచారం.

అడ్డంగా బుక్కైన మాజీ మంత్రి

250టన్నుల బియ్యాన్ని మాయం చేసిన పేర్ని నాని దాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో నిండా మునిగిపోయారు. డబ్బులు చెల్లించి గుట్టుచప్పుడు కాకుండా తప్పును కప్పి పెట్టాలనే యోచనతో జేసీకి లేఖ రాయడం ద్వారా చేసిన తప్పును నాని స్వయంగా ఒప్పుకొన్నట్లయింది. ప్రభుత్వానికి చెందిన బియ్యాన్ని పక్కదారి పట్టించడం తీవ్రమైన నేరం. దీనిపై క్రిమినల్ కేసు నమోదు చేసే అవకాశం ఉంది.

మరో 100 టన్నులు మాయం!

పేర్ని నాని గోదాముల నుంచే గాక చిలకలపూడి వద్ద ఉన్న సెంట్రల్ వేర్ హౌసింగ్ గోదాముల నుంచి కూడా ఎన్నికలకు ముందు సుమారు 100 టన్నుల బియ్యం మాయమైనట్లు సమాచారం. విచారణలో ఈ విషయం వెలుగుచూడగానే అక్కడ ఇన్‌చార్జిగా ఉన్న వ్యక్తి ఆ బియ్యాన్ని బయట కొనుగోలు చేసి గుట్టుచప్పుడు కాకుండా సర్దేయడంతో ఈ విషయం అంతటితో ముగిసిపోయింది. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న గోదాముల నుంచి బియ్యాన్ని పక్కదారి పట్టించారంటే నాడు వైసీపీ నాయకులు వ్యవస్థలను ఎంతలా నిర్వీర్యం చేశారో అర్థమవుతోంది. దీనిపై సమగ్ర విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగు చూసే అవకాశముంది.



సైబర్ పోలీసుల ఎదుట విచారణకు హాజరైన ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి

వర్రా రవీంద్రరెడ్డి ఎవరో తెలీదు

» విచారణలో కడప ఎంపీ అవినాశ్ పీఏ రాఘవరెడ్డి సమాధానం

కడప, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వర్రా రవీంద్రరెడ్డి ఎవరో తనకు తెలీదని ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి చెప్పారు. దాదాపు 20 రోజులుగా పరారీలో ఉన్న ఆయన సోమవారం పోలీసు విచారణకు హాజరయ్యారు. పోలీసులు అడిగిన పలు ప్రశ్నలకు తెలియదనే సమాధానం ఇచ్చారు. సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనితతో పాటు జగన్ తల్లి విజయలక్ష్మి, సోదరి షర్మిల, సునీతపై వర్రా రవీంద్రరెడ్డి అసభ్యకర పోస్టులు పెట్టారు. దీనిపై పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురానికి చెందిన హరి ఫిర్యాదు మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదైంది. ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి ఇచ్చిన కంటెంట్ మేరకే తాను పోస్టులు పెట్టినట్లు విచారణలో వర్రా వెల్లడించారు. ఇదే కేసులో నిందితుడైన రాఘవరెడ్డి దాదాపు 20రోజులుగా పరారీలో ఉన్నారు. ముందస్తు బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. శనివారం పులివెందులకు వచ్చిన రాఘవరెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చి సోమవారం విచారణకు రావాలని ఆదేశించారు. దీంతో రాఘవరెడ్డి తన లాయర్ ఓబుళరెడ్డితో సైబర్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఉదయం 11నుంచి రాత్రి 8గంటల వరకు డీఎస్పీ మురళీ నాయక్ విచారణ చేపట్టారు. ఎంపీ అవినాశ్‌తో ఉన్న బంధంపై లోతుగా అడిగినట్లు తెలిసింది. అలాగే వర్రా ఇచ్చిన స్టేట్‌మెంట్‌పైనా ప్రశ్నించారు. అయితే అసలు రవీంద్రరెడ్డి ఎవరో తనకు తెలీదని, విజయలక్ష్మి, షర్మిలపై పోస్టులతో తనకు ఎలాంటి సంబంధం లేదని రాఘవరెడ్డి సమాధానం ఇచ్చారు. పోలీసులు అడిగిన ప్రతి ప్రశ్నకు తనకు తెలీదని ఆయన సమాధానం ఇచ్చారని సమాచారం.

విశాఖ పోర్టులో బియ్యం స్వాధీనం

» విదేశాలకు ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉంచిన 483 టన్నుల రేషన్ నిల్వలు

» మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీలు

విశాఖపట్నం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టు నుంచి విదేశాలకు ఎగుమతి చేసేందుకు సిద్ధం చేసిన 483 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం సాయంత్రం ఆకస్మికంగా పోర్టు పరిధిలో ఉన్న కంటైనర్ ఫ్రైట్ స్టేషన్‌కు చెందిన నాలుగు గోదాములను తనిఖీ చేశారు. ఒకటి, మూడు నంబరు గోదాముల్లో 190 టన్నులు బియ్యం ఉండగా, గోదాముల నుంచి పోర్టు ద్వారా ఎగుమతి చేసేందుకు 10 కంటైనర్లల్లో మరో 293 టన్నుల బియ్యం సిద్ధం చేసినట్టు గుర్తించారు. మంత్రి వెంట ఉన్న పౌరసరఫరాల సంస్థ అధికారులు బస్తాల నుంచి బియ్యం తీసుకుని పరిశీలించారు. రెండు గోదాములు, కంటైనర్లలో ఉన్న బియ్యంలో కెర్నల్స్ ఉన్నట్టు సాంకేతిక సిబ్బంది గుర్తించారు. రేషన్ కార్డుదారులకు సరఫరా చేసే ఫోర్టిఫైడ్ రైస్‌లో కెర్నల్స్ ఉంటాయి. తనిఖీలలో లభ్యమైనవి రేషన్ బియ్యంగా నిర్ధారించి 483 టన్నులు సీజ్ చేశారు. ఈ బియ్యంలో శాంపిల్స్ తీసుకుని పౌరసరఫరాల సంస్థకు చెందిన ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... పోర్టు నుంచి రేషన్ బియ్యం ఎగుమతి అవుతున్నట్టు పక్కా సమాచారం రావడంతో నాలుగు బృందాలు తనిఖీ చేశాయన్నారు. రెగ్యులర్ బియ్యం, ఇతర సరుకులతో పాటు కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ గోదాముల్లో రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించామన్నారు. ప్రస్తుతానికి తనిఖీల్లో దొరికిన 483 టన్నుల బియ్యం సీజ్ చేశామన్నారు. రాయ్‌పూర్‌కు చెందిన ఏజీఎస్ ఫుడ్స్ అనే సంస్థ ఈ బియ్యం ఎగుమతి చేస్తోందని వెల్లడించారు.



విశాఖ పోర్టు ఏరియాలోని కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ గోదాముల్లో తనిఖీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

25 వేలకోట్ల బియ్యం ఎగుమతి

కాకినాడ పోర్టుపై నిఘా పెరగడంతో అక్రమ వ్యాపారులు 2నెలల నుంచి విశాఖ పోర్టు నుంచి 70వేల టన్నుల బియ్యం ఎగుమతి చేశారని మంత్రి నాదెండ్ల తెలిపారు. వాటి విలువ సుమారు రూ.25 వేల కోట్లు ఉంటుందన్నారు. బియ్యం స్మగ్లింగ్‌కు విశాఖ గేట్‌వేగా మారిందన్న ఆరోపణలు నిజమేనని తేలిందన్నారు. ప్రభుత్వం కిలో బియ్యం రూ.43కు కొనుగోలు చేసి కార్డుదారులకు అందజేస్తుందని, అయితే వారిని మోసం చేసి కిలో రూ.10కు తీసుకుంటున్నారన్నారు. తరువాత వీటిని పాలిష్ చేసి కిలో రూ.70 నుంచి రూ.80కు విదేశాలకు ఎగుమతి చేసి వేల కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు. విశాఖలో సీజ్ చేసిన బియ్యం అక్రమ రవాణా విషయాన్ని సిట్‌కు నివేదించనున్నట్టు తెలిపారు. అనకాపల్లి జిల్లాలో రేషన్ బియ్యం నిల్వలపై తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అధికార యంత్రాంగం, మీడియాతో కలిసి పనిచేస్తామన్నారు.



కాకినాడ సీపోర్టులో చెక్‌పోస్టు!

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు

రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోకుండా చర్యలు

ప్రస్తుతం ప్రభుత్వ యాంకరేజ్ పోర్టు వద్ద రెండు చెక్‌పోస్టులు

విదేశాలకు రేషన్ బియ్యం ఎగుమతి చేయకుండా అడ్డుకునేందుకు కాకినాడ సీపోర్టులో త్వరలో కొత్తగా చెక్‌పోస్టు ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పోర్టు లోపల నౌకలు ఆగే బెర్త్‌కు అతి సమీపంలో ఏర్పాటు చేసే అంశంపై అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. పోర్టు, బియ్యం ఎగుమతిదారులు, షిప్పింగ్ ఏజెంట్లతో దీనిపై చర్చిస్తున్నారు. ప్రైవేటు రంగానికి చెందిన సీపోర్టుకు నౌకలు నేరుగా ఒడ్డున ఉండే బెర్త్ వద్దకే వస్తాయి. ఇక్కడ బియ్యం ఎగుమతులు జరుగుతున్నా కనీసం తనిఖీలు లేవు. ఇదే అదనుగా రేషన్ అక్రమార్కులు వేల టన్నుల బియ్యాన్ని గుట్టుగా విదేశాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ యాంకరేజ్‌పోర్టు నుంచి వేలకోట్ల విలువైన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమై పోర్టుకు వెళ్లే దారిలో రెండుచోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తోంది. రేయింబవళ్లు పోర్టు లోపలకు వెళ్లే లారీల్లో బియ్యం శాంపిళ్లను తనిఖీ చేస్తోంది. కానీ ఈ తరహా చెక్‌పోస్టులు సీపోర్టులో లేవు. ఈ నేపథ్యంలో ఇక్కడ కూడా ఏర్పాటు చేసేందుకు అడుగులు పడుతున్నాయి. వాస్తవానికి బియ్యం ఎగుమతులన్నీ ప్రభుత్వానికి చెందిన యాంకరేజ్ పోర్టు నుంచే ఎన్నో ఏళ్లుగా జరుగుతున్నాయి. ఈ పోర్టుకు డ్రెడ్జింగ్ సదుపాయం లేకపోవడంతో నౌకలు ఒడ్డుకు వచ్చే సౌలభ్యం లేదు. దీంతో సముద్రం లోపలే నౌకలు ఆగుతాయి. బార్జీల్లో బియ్యం బస్తాలు లోడ్ చేసి ఓ బోటుతో ఈ బార్జీలను తరలించి అక్కడ షిప్‌లోకి ఎక్కిస్తారు. ఇలా ఒక్కో నౌకలో బియ్యం లోడింగ్ మొత్తం పూర్తి కావాలంటే 26 రోజుల వరకు పడుతుంది.

అప్పట్లో ద్వారంపూడి కోసం

వైసీపీ అధికారంలోకి వచ్చాక ద్వారంపూడి తన సోదరుడు, అనుచరులు విదేశాలకు బియ్యం ఎగుమతులు అనుకున్నంత వేగంగా చేయలేకపోతున్నారని అప్పటి సీఎం జగన్‌ను కలిశారు. ప్రభుత్వ యాంకరేజ్ పోర్టు నుంచి కాకుండా పక్కనే ఉన్న ప్రైవేటు సీపోర్టు నుంచి బియ్యం ఎగుమతులకు అవకాశం కల్పించాలని కోరారు. అప్పటి ప్రభుత్వం ద్వారంపూడి కోసం బియ్యం ఎగుమతులు ప్రైవేటు పోర్టు నుంచి కూడా చేసుకోవచ్చని పేర్కొంటూ 2021 ఫిబ్రవరిలో ఆదేశాలు జారీ చేసింది. యాంకరేజ్‌పోర్టులో బియ్యం ఎగుమతి కోసం వచ్చే నౌకల సంఖ్య పది దాటితే, ఆపై అన్ని నౌకలను సీపోర్టుకు తరలించి బియ్యం ఎగుమతి చేసుకునేందుకు వెసులుబాటు ఇచ్చింది. దీంతో అప్పటి నుంచి సీపోర్టు నుంచి బియ్యం ఎగుమతులు ప్రారంభమయ్యాయి. ఈ అవకాశాన్ని ద్వారంపూడి వినియోగించుకుని వేలకోట్ల విలువైన బియ్యం ఎగుమతి చేశారు. సీపోర్టులో బియ్యం లోడింగ్ పూర్తికావడానికి 8 రోజులు మాత్రమే పడుతుంది. ప్రస్తుతం యాంకరేజ్‌పోర్టులో బియ్యం లోడింగ్ కోసం 14 షిప్‌లు నిరీక్షిస్తున్నాయి. వాటిలో నాలుగు నౌకలు ఇప్పుడు సీపోర్టుకు బియ్యం లోడింగ్‌కు రాబోతున్నాయి. ఈ నేపథ్యంలో బియ్యం ఎగుమతి ప్రారంభానికి ముందే చెక్‌పోస్టు ఏర్పాటుకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు.

పవన్‌కు బెదిరింపు కాల్

» డిప్యూటీ సీఎం ఓఎస్డీకి కాల్ చేసిన ఆగంతకుడు

» నిందితుడు తిరువూరు వాసిగా గుర్తింపు



విజయవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి అభ్యంతరకర భాషతో మాట్లాడుతూ ఓ ఆగంతకుడు ఓఎస్డీ వెంకటకృష్ణకు కాల్ చేశాడు. అంతేకాకుండా కొద్ది రోజుల క్రితం హోంమంత్రి అనితకూ ఈ తరహా కాల్ వెళ్లింది. ఇద్దరికీ కాల్స్ చేసిన వ్యక్తి ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన నక్కా మల్లికార్జునరావుగా గుర్తించారు. నిందితుడు ఎంజీ రోడ్డు నుంచి ఈ ఫోన్ కాల్స్ చేసినట్టు గుర్తించారు. ఈ రెండు బెదిరింపు కాల్స్‌పై డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదులు అందాయి. దీంతో విజయవాడ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎంజీ రోడ్డును జల్లెడపట్టారు. స్థానికులను విచారించగా అటువంటి వ్యక్తి ఇక్కడెవరూ లేరని స్థానికులు చెప్పారు. దీంతో బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ముమ్మరంగా గాలించారు. అతడి ఆచూకీ మాత్రం లభించలేదు. పోలీసులకు లొకేషన్ ట్రాక్ అయిన కాసేపటికే స్విచ్ఛాఫ్ చేశాడు. వాస్తవానికి మల్లికార్జునరావు ఈ ఫోన్ చేశాడా, ఎవరైనా అతడి పేరు మీద సిమ్‌కార్డు తీసుకుని ఫోన్ చేశారా అన్న విషయం నిందితుడు అరెస్టయిన తర్వాత తేలనుంది. కాగా, డిప్యూటీ సీఎం ఓఎస్డీకి బెదిరింపు కాల్ వ్యవహారంపై హోంమంత్రి అనిత ఆరా తీశారు. నిందితుడిని పట్టుకోవాలని డీజీపీ ద్వారకా తిరుమలరావును ఆదేశించారు.



ఎమ్మెల్సీగా గెలుపొందిన గోపీమూర్తితో ఉపాధ్యాయుల సంబరాలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గోపీమూర్తి!

» 'ఉభయ గోదావరి'లో ఘన విజయం సాధించిన పీడీఎఫ్ అభ్యర్థి

కలెక్టరేట్/కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాసన మండలి తూర్పు, పశ్చిమగోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి ఘన విజయం సాధించారు. కాకినాడ జేఎన్‌టీయూలో సోమవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎన్నికల పరిశీలకుడు కె.హర్షవర్ధన్, రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సమక్షంలో నిర్వహించారు. 14 టేబుళ్లపై ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కౌంటింగ్ కొనసాగింది. మొత్తం 15,494 ఓట్లు పోలవగా, వాటిలో 814 చెల్లని ఓట్లు నమోదయ్యాయి. మిగిలిన 14,680 ఓట్లలో యూటీఎఫ్ బలపర్చిన బొర్రా గోపీమూర్తికి 9,165 ఓట్లు లభించాయి. ఇతర అభ్యర్థులైన గంధం నారాయణరావుకు 5,259, దీపక్ పులుగుకు 102, నామన వెంకటలక్ష్మికి 81, డాక్టర్ కవల నాగేశ్వరరావుకు 73 ఓట్లు లభించాయి. చెల్లుబాటు అయిన ఓట్ల ఆధారంగా నిర్దేశించిన కోటా 7,341 ఓట్లను గోపీమూర్తి తొలి రౌండ్‌లోనే అధిగమించారు. దీంతో కౌంటింగ్ కేంద్రం వద్ద గోపీమూర్తితో ఉపాధ్యాయులు సంబరాలు చేసుకున్నారు. రిటర్నింగ్ అధికారి షాన్‌మోహన్ ఆయనను విజేతగా ప్రకటించి ధ్రువపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి విలేకరులతో మాట్లాడుతూ అపారమైన అభిమానంతో తనను గెలిపించిన ఉపాధ్యాయులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు గోపీమూర్తికి అభినందనలు తెలిపారు.

2 నుంచే డయాఫ్రం వాల్ పనులు



» నిర్మాణం 600 మీటర్లకు చేరగానే.. ఈసీఆర్ఎఫ్ డ్యాం సమాంతర నిర్మాణం

» కాంట్రాక్టు సంస్థలకు మంత్రి నిమ్మల ఆదేశం

» వచ్చే వారం పోలవరంలో సీఎం పర్యటన

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణ పనులను వచ్చే నెల రెండో తేదీన ప్రారంభించాల్సిందేనని కాంట్రాక్టు సంస్థలకు జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. సోమవారం విజయవాడలోని ఆయన నిర్మాణ సంస్థలు మేఘా ఇంజనీరింగ్, బావర్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం ఎస్ఈ నరసింహమూర్తి తదితరులతో సమీక్షించారు. వచ్చే వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు క్షేత్రంలో పర్యటిస్తారని చెప్పారు. ఆ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణ పనుల షెడ్యూల్‌ను ప్రకటిస్తారన్నారు. ముందస్తు కార్యాచరణ ప్రణాళికల మేరకు.. డయాఫ్రం వాల్ నిర్మాణ పనుల 600 మీటర్లకు చేరుకున్న వెంటనే.. సమాంతరంగా ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం పనులు కూడా ప్రారంభించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), కేంద్ర జల సంఘం రాష్ట్ర జలవనరుల శాఖతో నిర్వహించే వీడియో, టెలికాన్ఫరెన్సుల సమాచారం ముందస్తుగా తనకు గానీ, ముఖ్యమంత్రికి గానీ ఎందుకు తెలియజేయడం లేదని ఈఎన్‌సీ, సీఈపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత శుక్రవారం పీపీఏ సీఈవో అతుల్ జైన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సు వివరాలను ఎందుకు చెప్పలేదని నిలదీశారు. ప్రాజెక్టు పనులకు సంబంధించి సీఈవో చేసిన కీలక వ్యాఖ్యలను శనివారం 'ఆంధ్రజ్యోతి'లో చూశానని.. పత్రికల్లో చూస్తే తప్ప సమాచారం తెలియకపోతే ఎలాగని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. తాము రూ.5 వేల కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామంటూనే.. ముందస్తుగా ఇచ్చిన నిధుల్లో 75 శాతం ఖర్చుపెడితేనే తదుపరి వాయిదా మొత్తం విడుదల చేస్తామని ఆయన చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఇలాంటి అత్యంత సున్నితమైన అంశాలను తనకు చెబితేనే.. సీఎంకు వివరించి సమస్యను పరిష్కరించే అవకాశం ఉంటుందని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు.

ఆస్పత్రి కోసం స్థలం.. 17 అంతస్థుల భవనం!



విశాఖలో ఆస్పత్రి స్థలంలో నిర్మితమవుతున్న రెసిడెన్షియల్ భవనం



వాణిజ్య భవనం నమూనా

ఆస్పత్రి నిర్మించి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని ఓ సంస్థ ముందుకొస్తే మూడు దశాబ్దాల క్రితం అప్పటి ప్రభుత్వం విశాఖలో ఎకరా స్థలం కేటాయించింది. వైసీపీ అధికారంలోకి రాగానే అదే స్థలంలో ఆస్పత్రికి బదులు 17 అంతస్థుల వాణిజ్య భవనం నిర్మాణానికి అనుమతులు ఇచ్చేసింది. ఆ భూమిని అప్పట్లో రూ.8.75 లక్షలకు కొనుగోలు చేయగా, అదే భూమి ఇప్పుడు సుమారు రూ.85 కోట్లు పలుకుతోంది. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చినందుకు తాడేపల్లి పెద్దలకు రూ.కోట్లలో ముట్టినట్లు ప్రచారం జరుగుతోంది.

» వైసీపీ హయాంలో అడ్డగోలుగా 'వాణిజ్య' అనుమతులు

» తాడేపల్లిలో చక్రం తిప్పిన పెద్దలు

» 3 దశాబ్దాల కిందట ఆ భూమికి చెల్లించింది రూ.8.75 లక్షలు

» ప్రస్తుత విలువ సుమారు రూ.85 కోట్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలోని సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ వుడా లేఅవుట్‌లో సామాజిక అవసరాల కోసం కొంత భూమి వదిలారు. అందులో రెండు ఆస్పత్రుల నిర్మాణానికి వేర్వేరుగా వుడా భూమి కేటాయించింది. ప్లాట్ నంబర్-1లో ఎన్ఆర్ఐ అసోసియేషన్‌కి 4,450 చ.గజాలు, రాజీవన్ హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 4,374 చ.గజాలను గజం రూ.200 చొప్పున 1988 ఏప్రిల్ 4న వుడా కేటాయించింది. రాజీవన్ ఈ భూమి కోసం వుడాకు రూ.8,74,800 చెల్లించింది. నర్సింగ్ హోమ్ నిర్మాణానికి దానికి వుడా పలు నిబంధనలు విధించింది. నర్సింగ్ హోమ్ నిర్మాణం రెండేళ్లలో పూర్తిచేయాలని.. పేదలకు 20 శాతం బెడ్లు కేటాయించి ఉచిత వైద్య సేవలు అందించాలని పేర్కొంది. కేటాయించిన భూమిని ఇతర ప్రయోజనాలకు ఉపయోగించకూడదని.. రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ కోసం 300 గజాల స్థలంలో 1,500 చ.అ. విస్తీర్ణంలో మాత్రమే నివాస భవనం నిర్మించుకోవచ్చని.. అంతకు మించి నిర్మాణం ఉండకూడదని స్పష్టంచేసింది. ఆ భూమిని అమ్మకూడదు.. బదిలీ చేయకూడదు. విభజించకూడదు.. తనఖా పెట్టకూడదని కూడా నిబంధన విధించింది. ఎన్ఆర్ఐ అసోసియేషన్ ఆ స్థలంలో భారీ ఆస్పత్రి నిర్మించి నిర్వహిస్తుండగా.. రాజీవన్ సంస్థ మాత్రం నర్సింగ్ హోమ్ నిర్మించలేదు. రకరకాల ప్రయోజనాలకు ఆ భూమిని వినియోగించుకుంటూ వచ్చింది. అక్కడ కొద్దికాలం పాఠశాల కూడా నడిపారు. కొన్నేళ్ల క్రితం ఆ భూమిలో కొంత పవన్‌పుత్ర హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సర్వీసెస్‌కు, పరసరాజ్ రాపా హాస్పిటల్స్‌కు వాటాలు ఇచ్చారు. దీనికోసం హైకోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారు.

ఆస్పత్రి గిట్టుబాటు కాదని..

జగన్ ప్రభుత్వం వచ్చాక.. ఆ భూమిలో ఆస్పత్రి నిర్వహణ లాభదాయం కాదని, దానిని మూడు సంస్థలు కలిసి అభివృద్ధి చేయాలనుకుంటున్నామని, రెసిడెన్షియల్ కమ్ కమర్షియల్ భవనం నిర్మాణానికి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇవ్వాలని కోరుతూ వీఎంఆర్‌డీఏ (పాత వుడా)కి 2020 ఫిబ్రవరిలో దరఖాస్తు చేశారు. దీనిని ఆనుకునే ఉన్న ఎన్ఆర్ఐ ఆస్పత్రి అద్భుతంగా లాభాల్లో నడుస్తుంటే.. వీఎంఆర్‌డీఏ అధికారులు కళ్లు మూసుకుని కేవలం 20 రోజుల్లో ఎన్‌వోసీ ఇచ్చేశారు. 'మీరు ఆ భూమిలో ఏమైనా నిర్మించుకోవచ్చు, ఎవరికైనా ఇచ్చుకోవచ్చు' అని అనుమతులు మంజూరు చేశారు. సాధారణంగా ఇలా రాయితీ ధరపై కేటాయించిన భూములను ఇతర ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలనుకుంటే ప్రభుత్వానికి నివేదించి.. అక్కడినుంచి అనుమతితీసుకోవాలి. ఒక్కోసారి ఇలాంటి విషయాలపై మంత్రివర్గ సమావేశంలో పెట్టి కూడా నిర్ణయం తీసుకుంటారు. కానీ వీఎంఆర్‌డీఏ అధికారులు స్టాండింగ్ కౌన్సిల్ అభిప్రాయం తీసుకుని.. ఎవరి అభ్యంతరాలు లేవంటూ సర్టిఫికెట్ ఇచ్చేశారు. ఈ క్రమంలో అప్పటి స్థానిక వైసీపీ నాయకులకు, తాడేపల్లి పెద్దలకు కోట్లలో ముడుపులు అందాయనేది ఆరోపణ.

ఏడాది క్రితం జీవీఎంసీ అనుమతులు

వీఎంఆర్‌డీఏ 2020 ఫిబ్రవరిలో ఎన్‌వోసీ ఇవ్వగా రాజీవన్ అండ్ కో మూడేళ్లకు .. 2023 ఫిబ్రవరిలో జీవీఎంసీకి భవన నిర్మాణానికి దరఖాస్తు చేశారు. ఆ ఏడాది నవంబరులో 17 అంతస్థుల భవన నిర్మాణానికి కార్పొరేషన్ అనుమతి ఇచ్చింది. అందులో ఒక ఫ్లోర్ కమర్షియల్‌కు, మరో రెండు .సెల్లార్లుగా (పార్కింగ్ నిమిత్తం) చూపించారు ఆస్పత్రికి కేటాయించిన భూమిలో రెసిడెన్షియల్/కమర్షియల్ భవనం ఎలా నిర్మిస్తారని ఎవరూ ప్రశ్నించలేదు. అక్కడ కూడా వైసీపీ పెద్దలు చక్రం తిప్పారు. ఇప్పుడు ఆ ఏరియాలో గజం స్థలం రూ.1.5 లక్షల నుంచి రూ.1.75 లక్షలు పలుకుతోంది. ప్రస్తుతం దాని విలువ సుమారు రూ.85 కోట్లు. భూమి విలువ వేయి రెట్లు పెరిగింది.

ఎమ్మెల్యే విష్ణు ఫిర్యాదు

ఈ భూమి విశాఖ ఉత్తర నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఇంటికి 50 అడుగుల దూరంలోనే ఉంది. అందులో భారీ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించడంతో సీనియర్ సిటిజన్లు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే...జిల్లా కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. ఈభూమికి సేల్‌డీడ్ ప్రకారం బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ ఇచ్చారని,అయితే వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం అక్కడ రహదారులు లేవని ఆయన తెలిపారు. ఈ భవనం కోసం మాస్టర్ ప్లాన్‌ను కూడా వైసీపీ నేతలు మార్చేశారని ఫిర్యాదు చేశారు.

విచారణ చేస్తున్నాం

ఆ భూమిలో నిర్మిస్తున్న భవనానికి ఇచ్చిన అనుమతులపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు చేసిన ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నట్లు వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ తెలిపారు. నిబంధనల ఉల్లంఘనను పరిశీలిస్తున్నామని.. 2-3 రోజుల్లో నిర్ణయం వెల్లడిస్తామని చెప్పారు.

'కంచె' కలిసిరాలేదా..?

జగన్ తాడేపల్లి ప్యాలెస్‌లో వాస్తు మార్పులు

» ఇటీవలే దక్షిణ దిశలో కంచె తొలగింపు

» తాజాగా ఈశాన్యంలో మార్పులు



గతంలో దక్షిణం వైపు తొలగించిన ఇనుపకంచె

అమరావతి, గుంటూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఓ పక్క సార్వత్రిక ఎన్నికల్లో ఘోర ఓటమి.. మరోపక్క తరుముకొస్తున్న కేసులు.. ఈ కలసి రాని కాలానికి వాస్తు దోషాలే కారణమని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భావిస్తున్నట్లు ఉన్నారు. దీంతో ఆయన తాడేపల్లి ప్యాలెస్‌లో చకచకా వాస్తు దోషాలు సవరిస్తున్నారు. ఆ ఇంటి చుట్టూ ఉన్న ఇనుప కంచెను వాస్తుకు అనుగుణంగా మార్పు చేస్తున్నారు. గాలి కోసం అంటూ ఇటీవల దక్షిణ దిశలో కంచెను తీసివేశారు. సోమవారం తూర్పు-ఈశాన్యం వైపు కంచెలో కొన్ని వరుసలను తొలగించారు. తూర్పు ఈశాన్యం మూత వేసి ఉంచడం మంచిది కాదని వాస్తు పండితులు చెప్పిన నేపథ్యంలో ఈ దిద్దుబాట్లు చేస్తున్నారని సమాచారం. అయితే జగన్ ఇంటికి ఇలా వాస్తు మార్పులు చేయడం రాజకీయవర్గాల్లో చర్చకు దారితీసింది. ప్రజలెందుకు తిరస్కరించారో విశ్లేషించుకోకుండా ఆయన సాకులు వెతుక్కుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓటమి నెపాన్ని ఇంటి వాస్తుపైకి నెట్టేస్తున్నారని రాజకీయవర్గాలు అంటున్నాయి. ఇదే ఇంటిలో ఉండగా 2019లో ఆయన అధికారంలోకి వచ్చారని వారు గుర్తుచేస్తున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై 13 నుంచి నిరసనలు

» కంటైనర్ వ్యవహారంలో సీబీఐ తీరుపై మోదీ, షాలకు ఫిర్యాదు చేస్తా: బొత్స



విశాఖపట్నం, విజయనగరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై 13 నుంచి వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ తెలిపారు. లాసన్స్‌బే కాలనీలోని తన కార్యాలయంలోనూ, విజయనగరం జిల్లా కేంద్రంలోని ఆయన సోదరుడు నివాసంలోనూ సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలే అయినప్పటికీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వైఫల్యాల కారణంగా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పార్టీపరంగా ఒక కార్యాచరణ రూపొందించాం. వర్షాలకు తడిచిన ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైంది. ఇబ్బంది పడుతున్న రైతులను ఆదుకోవాలని కోరుతూ 13న అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేస్తాం. ఎన్నికల వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని, పెంచిన విద్యుత్ భారాన్ని తగ్గించాలని కోరుతూ 27న విద్యుత్తు పంపిణీ సంస్థల ఎస్ఈలకు, డిస్కమ్‌ల సీఈఓలకు వినతిపత్రాలు అందజేస్తాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని కోరుతూ వచ్చే నెల 3న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తాం. వైసీపీ నేతలు భూ కబ్జాలకు పాల్పడినట్లు భావిస్తే విచారణ జరిపి ఎటువంటి చర్యలైనా తీసుకోవచ్చు. పోర్టులో సీజ్ చేసిన కంటైనర్‌లో డ్రగ్స్ ఉన్నాయని హడావుడి చేయడంతోపాటు ఇద్దరిని అరెస్టు చేసిన సీబీఐ.. ఇప్పుడు అందులో డ్రగ్స్ లేవని ప్రకటించడం ఆశ్చర్యంగా ఉంది. దీనిపై నేను త్వరలోనే ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాను కలిసి వినతిపత్రం అందజేస్తా' అని బొత్స తెలిపారు.

వైసీపీ అధిష్ఠానం ఒత్తిడితోనే అశ్లీల పోస్టులు

» పోలీసుల ఎదుట నోరువిప్పిన బోరుగడ్డ అనిల్

అనంతపురం క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధిష్ఠానం ఒత్తిడి వల్లే సోషల్ మీడియాలో అశ్లీల పోస్టులు పెట్టాల్సి వచ్చిందని ఆ పార్టీ నాయకుడు, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్ పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలిసింది. రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి శనివారం కస్టడీకి తీసుకున్న అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు.. అనంతపురానికి ఆదివారం అర్ధరాత్రికి చేరుకున్నారు. కేసు గురించి సమగ్రంగా విచారించారు. తొలిరోజు తనకేమీ తెలియదని చెప్పిన బోరుగడ్డ.. సోమవారం కొంత నోరు విప్పినట్లు తెలిసింది. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు సంబంధిత వీడియోల ఆధారంగా (చంద్రబాబు, లోకేశ్, వారి కుటుంబ సభ్యులను దూషించినవి) విచారించారు. పదేపదే ప్రశ్నలు సంధించడంతో తాను వైసీపీ హైకమాండ్ ఆదేశాల మేరకే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టానని చెప్పినట్లు సమాచారం. 'నిన్ను ఆదేశించిన ఆ వ్యక్తి ఎవరు' అని ప్రశ్నించగా, ఆ విషయం గుర్తులేదని చెప్పినట్లు తెలిసింది. మరికొన్ని ప్రశ్నలకు మౌనంగా ఉన్నట్లు సమాచారం. బోరుగడ్డ కస్టడీ సమయం ముగుస్తుండటంతో సీఐ సాయినాథ్, ఎస్ఐ రాంప్రసాద్ సాయంత్రం 4.30గంటలకు కోర్టులో హాజరు పరిచారు. అనంతరం రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

పెట్రోల్ పోసి తగలబెట్టాడు!

» 17 ఏళ్ల బాలికపై ఉన్మాది ఘాతుకం

» ఘటనపై అనేక అనుమానాలు



కాలిన గాయాలతో రాఘవేంద్ర, (ఇన్‌సెట్‌లో) లహరి

నందికొట్కూరు/కర్నూలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో వెంటపడ్డాడు.. నిరాకరించడంతో ఉన్మాదిగా మారాడు. 17 ఏళ్ల బాలికపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో బాలిక సజీవ దహనం కాగా.. యువకుడికి కూడా మంటలు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డినగర్‌లో సోమవారం తెల్లవారుజామున ఈ దారుణం జరిగింది. మృతురాలు తల్లి, బంధువులు, పోలీసులు సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామానికి చెందిన ఇంజమూరి శివరామకృష్ణ, లక్ష్మి దంపతులకు ఇంజమూరి లహరి (17) ఏకైక కుమార్తె. ఆమె పుట్టిన నెలకే తండ్రి శివరామకృష్ణ మరణించడంతో.. అమ్మ లక్ష్మి కూలి పనులు చేస్తూ లహరిని పెంచింది. పదో తరగతి వరకు రామళ్లకోటలో చదవిన లహరి.. అమ్మమ్మ, తాతయ్యల స్వగ్రామమైన నంద్యాల జిల్లా నందికొట్కూరులో ఉంటూ స్థానిక కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. ఆదివారం రాత్రి అవ్వతాతలు ఓ గదిలో పడుకుంటే.. బాలిక పక్క గదిలో నిద్రించింది. సోమవారం తెల్లవారుజామున బాలిక కేకలు విని తాతయ్య పరుగున వచ్చాడు. గదిలోపల మనవరాలు మంటల్లో కాలిపోతుండటం, పక్కనే ఓ యువకుడు కూడా ఉంటడం చూసి షాకయ్యాడు. వెంటనే పోలీసులకు ఫోన్ చేశాడు. ఆ తర్వాత లోపలి నుంచి బయటికొచ్చిన ఆ యువకుడిని స్థానికులు అడ్డుకున్నారు. వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన రాఘవేంద్ర (21) అనే యువకుడే ప్రేమ పేరుతో అర్ధరాత్రి ఇంటికొచ్చి ఈ ఘాతుకానికి ఒడిగట్టాడని, ప్రేమించలేదనే అక్కసుతోనే తన కుమార్తెపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టాడని లహరి తల్లి లక్ష్మి కన్నీరు మున్నీరైంది. కాగా.. బాలికతోపాటు ఆ మంటల్లో చిక్కుకున్న రాఘవేంద్ర కూడా తీవ్రంగా గాయపడ్డాడు. పదో తరగతి నుంచే బాలికను రాఘవేంద్ర ప్రేమ పేరుతో వేధిస్తున్నట్టు తెలిసింది. ఆదివారం రాత్రి లహరితో ఫోన్లో మాట్లాడి అర్ధరాత్రి ఇంటికి వెళ్లి ఉంటాడని, ప్లాన్ ప్రకారం తనతో తీసుకెళ్లిన పెట్రోల్‌ను ఆమెపై పోసి నిప్పుపెట్టి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎస్పీకి హోంమంత్రి అనిత ఫోన్

ఈ ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, నిందితుడికి కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. కాగా, సంఘటనా స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాఘవేంద్ర, లహరి వెల్దుర్తి మండలంలో ఒకే పాఠశాలలో చదువుకున్నారన్నారు. విద్యుత్ షాట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందా? ఇద్దరూ ఆత్మహత్యకు ప్రయత్నించారా..? లహరిని రాఘవేంద్ర హత్య చేశాడా..? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా..? అనే కోణాల్లో విచారణ చేసి కారణాలు వెల్లడిస్తామని చెప్పారు. రాఘవేంద్ర నుంచి కూడా వివరాలు సేకరిస్తామని తెలిపారు.

లోన్ యాప్ వేధింపులు



నరేంద్ర

» 2 వేల కోసం మార్ఫింగ్ చేసి బెదిరింపులు

» పెళ్లయిన 40 రోజులకే యువకుడు ఆత్మహత్య

మహారాణిపేట (విశాఖపట్నం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆ యువకుడు ఆన్‌లైన్ లోన్ యాప్‌లో కొంత మొత్తం అప్పు తీసుకున్నాడు. రూ.2వేలు మినహా మిగతా మొత్తం చెల్లించేశాడు. కానీ.. ఆ రెండు వేల కోసం లోన్ యాప్ నిర్వాహకులు వేధించడం మొదలుపెట్టారు. కుటుంబ సభ్యుల ఫొటోలు మార్ఫింగ్ చేసి ఆ యువకుడికి తెలిసిన వాళ్లందరికీ పంపించారు. ఇటీవలే పెళ్లి చేసుకున్న ఆ యువకుడి భార్యకు కూడా పంపించారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. విశాఖ నగరంలోని మహారాణిపేటలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మహారాణిపేట అంగటిదిబ్బ ప్రాంతానికి చెందిన సూరాడ నరేంద్ర (21) ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వివాహం జరిగి 40 రోజులైంది. దంపతులిద్దరూ చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే నరేంద్ర లోన్ యాప్ ద్వారా అప్పు తీసుకుని కొంత చెల్లించేశాడు. మరో రూ.2వేలు మాత్రమే బాకీ ఉంది. ఇటీవల ఆ డబ్బులు చెల్లించాలని యాప్ నిర్వాహకులు వేధించడం ప్రారంభించారు. అతడి భార్య ఫోన్‌కు మార్ఫింగ్ ఫొటోలు పంపి నరేంద్రతో వెంటనే డబ్బులు కట్టించాలని, లేకుంటే మరిన్ని ఫొటోలు పంపిస్తామని బెదిరించారు. హతాశురాలైన ఆమె ఏం జరిగిందని భర్తను నిలదీయగా.. లోన్ యాప్ వాళ్లకు రెండు వేలు చెల్లించాలని చెప్పాడు. తమ వద్ద ఉన్న రూ.2 వేలు వెంటనే చెల్లించేశారు. అప్పటికే యాప్ నిర్వాహకులు మార్ఫింగ్ ఫొటోలను నరేంద్ర ఫోన్ కాంటాక్ట్ లిస్టులో ఉన్న వాళ్లందరికీ పంపించేశారు. దాన్ని తీవ్ర అవమానంగా భావించిన నరేంద్ర శనివారం అర్ధరాత్రి భార్య నిద్రలో ఉండగా ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

తల్లీబిడ్డలను కాటేసిన కరెంటు తీగ

» కొడుకును కాపాడబోయి తల్లి.. తల్లిని పట్టుకుని కుమార్తె

» విద్యుత్ షాక్‌తో ముగ్గురూ మృతి



ఇంటి ముందు విగత జీవులుగా పడి ఉన్న లక్ష్మి, సంతోష్, అంజలి

పెదబయలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెగిపడిన కరెంటు తీగపై కాలు వేసిన కొడుకుని కాపాడబోయి తల్లి, ఆ తల్లిని కాపాడబోయి కూతురు... ఇలా విద్యుత్ షాక్‌తో ముగ్గురూ మృతిచెందారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలంలో ఈ విషాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని కిముడుపల్లి పంచాయతీ గడుగుపల్లి గ్రామ శివారులో కొర్ర మోహనరావు కుటుంబం నివాసం ఉంటోంది. సోమవారం ఉదయం మోహనరావు పెదబయలు వారపు సంతకు వెళ్లాడు. భార్య లక్ష్మి, నలుగురు పిల్లలు ఇంటి వద్ద ఉన్నారు. సుమారు 11 గంటల సమయంలో ఇంటి ముందు ఆడుకుంటున్న వారి కుమారుడు సంతోష్ (13)... సమీపంలో తెగి పడి ఉన్న విద్యుత్ వైర్‌ను గమనించకుండా దానిపై కాలు వేశాడు. సంతోష్ గిలగిలా కొట్టుకుంటూ పడిపోవడంతో అక్కడే ఉన్న తల్లి లక్ష్మి (36)... ఏమైందంటూ అతడిని పట్టుకుంది. దీంతో ఆమె కూడా షాక్‌కు గురైంది. తల్లి, సోదరుడికి ఏం జరిగిందోననే కంగారులో కుమార్తె అంజలి (10) కూడా వారిని తాకడంతో ఆమె కూడా విద్యుదాఘాతానికి గురైంది. మరో ఇద్దరు పిల్లలు కూడా ఇంట్లో నుంచి బయటకు వచ్చి తల్లి వద్దకు వెళుతుండగా అటువైపుగా పశువులు తోలుకెళ్తున్న కోటేశ్వరరావు చూసి వారిని ఆపేశాడు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. కానీ, అప్పటికే ముగ్గురూ చనిపోయారు.

ఆర్జీవీ బెయిల్ పిటిషన్ విచారణ నేటికి వాయిదా

ఒంగోలు క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వివాదాస్పద సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ బెయిల్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. ఆయనపై శుక్రవారం వరకు పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోకూడదని పేర్కొంది. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో ఆయనపై ప్రకాశం జిల్లా మద్దిపాడుతోపాటు రాష్ట్రంలో మరో 8 ప్రాంతాల్లో కేసులు నమోదైన విషయం తెలిసిందే. దీనిపై విచారణకు హాజరు కావాలని ఇప్పటికే రెండుసార్లు ఒంగోలు పోలీసులు ఆర్జీవీకి నోటీసులు ఇచ్చారు. అదే సమయంలో వర్మ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు మంగళవారానికి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

మోహన్‌బాబు యూనివర్సిటీలో జర్నలిస్టులపై బౌన్సర్ల దాడి

చంద్రగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం వద్ద వీడియో కవరేజ్‌కు వెళ్లిన ఇద్దరు మీడియా ప్రతినిధులపై బౌన్సర్లు, సెక్యూరిటీ సిబ్బంది దాడి చేశారు. దీనిపై బాధితులతో కలిసి జర్నలిస్టు నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు.. సుమన్ టీవీ తిరుపతి ప్రతినిధి ఉమాశంకర్, కెమెరామెన్ నరసింహులు శ్రీవిద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద వీడియో కవరేజ్ చేస్తున్నారు. వీడియో తీయొద్దంటూ అక్కడి సిబ్బంది అడ్డుకున్నారు. ఎంబీయూ పీఆర్వో సతీశ్.. మీడియా ప్రతినిధుల వద్దకు వచ్చి మాట్లాడుతుండగా, ఇద్దరు బౌన్సర్లు, ఇద్దరు సెక్యూరిటీ గార్డులు వచ్చి దాడి చేశారు. ఫైబర్ లాఠీతో కొట్టారు. మీడియా ప్రతినిధులు పరుగు తీస్తుండగా, వారితో పాటు మరి కొంత మంది స్థానికులు వచ్చి బలవంతంగా విద్యానికేతన్‌లోకి లాక్కెళ్లారు. వారి సెల్‌ఫోన్, కెమెరాలను ధ్వంసం చేశారు. బాధితులు చంద్రగిరి సీహెచ్‌సీకి వెళ్లి చికిత్స తీసుకున్నారు. సమాచారం తెలుసుకున్న తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మురళీ, కార్యదర్శి బాలచంద్ర, ఇతర జర్నలిస్టులు చంద్రగిరి వచ్చారు. బాధితులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.